ప్రతిపక్షం

www.prathipaksham.in

సోమవారం 30.03.2026 | Published From Hyderabad | సంపుటి: 19 సంచిక: 10 పేజీలు: 10 | ₹5

ముంబై ఇండియన్స్ విజయం 10

@prathipaksham | prathipaksham tv telugu

బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తున్నారు

పదేళ్లు హౌస్ కమిటీలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

బీఆర్ఎస్ హయాంలో ఎప్పుడూ మేము సభను అడ్డుకోలేదు

- బీఆర్ఎస్ నేతలు జరగాలనుకున్నట్టు సభ జరగదు
- బీఆర్ఎస్ నేతలపై భట్టి విక్రమార్క ఫైర్
- పొంగులేటిని బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ నినాదాలు
- సభలో బీఆర్ఎస్ నిరసనలు.. అసెంబ్లీలో గందరగోళం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు వేసిన స్పీకర్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 29: బీఆర్ఎస్ నేతలు బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మండిపడ్డారు. నాయకులను బ్లాక్‌మెయిల్ చేసి బీఆర్ఎస్‌లో చేర్చుకున్నారని అన్నారు. పదేళ్లు హౌస్ కమిటీలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో ఎప్పుడూ తాము సభను అడ్డుకోలేదని చెప్పారు. నిన్నటి నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సభను పదే పదే అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు జరగాలనుకున్నట్టు సభ జరగదని స్పష్టం చేశారు. అసెంబ్లీలో భట్టి విక్రమార్క తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ..

...:: మిగతా 2లో

మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలి

- ప్రభుత్వం స్పందించకపోతే గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తాం
- అవసరమైతే ప్రజల్లోకి ఈ అంశాన్ని విస్తృతంగా తీసుకెళ్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆరోపణలు

...:: 2లో

'నువ్వు మంత్రిగా ఉన్నప్పుడు నీ తమ్ముడు మహేశ్వర్ రావు, మామ హనుమంత్ రావు, బావమరిది సుమన్ రావుతో కలిసి ధరణి అడ్డుపెట్టి భూములు కాజేయలేదా?' మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ ప్రాంతంలో ప్రైవేట్ పరిశ్రమల యజమానులను బెదిరించి, ధరణి ద్వారా వందల ఎకరాల భూ బదిలీలు జరిగాయి. 'దమ్ముంటే ఒప్పుకో.. దీనిపై హౌస్ కమిటీ వేయిద్దాం'

- హరీష్ రావుకు సీఎం రేవంత్ రెడ్డి సవాల్

హరీష్.. నీ తమ్ముడు నిజాయితీ పరుడైతే

బాలానగర్ భూములపై విచారణకు సిద్ధమా?

నీ తమ్ముడు ధరణి అడ్డుపెట్టి భూములు కాజేయలేదా?

- దమ్ముంటే ఒప్పుకో.. దీనిపై హౌస్ కమిటీ వేయిద్దాం
- దళితుల గౌరవమే మా ప్రభుత్వ లక్ష్యం
- పాడి కౌశిక్ రెడ్డి పై చర్యలకు డిమాండ్
- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ధ్వజం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, మార్చి 29: శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. మాజీ మంత్రి హరీష్‌రావు కుటుంబం భూ వ్యవహారాలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. 'హరీష్.. నీ తమ్ముడు మహేశ్వర్ రావు నిజాయితీ పరుడైతే బాలానగర్ భూములపై విచారణకు సిద్ధమా?" అంటూ సీఎం నేరుగా సవాల్ విసిరారు.

ధరణి అడ్డుగా భూముల దందా..?

'నువ్వు మంత్రిగా ఉన్నప్పుడు నీ తమ్ముడు మహేశ్వర్ రావు, మామ హనుమంత్ రావు, బావమరిది సుమన్ రావుతో కలిసి ధరణి అడ్డుపెట్టి భూములు కాజేయలేదా?' అని సీఎం ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ ప్రాంతంలో ప్రైవేట్ పరిశ్రమల యజమానులను బెదిరించి, ధరణి ద్వారా వందల ఎకరాల భూ బదిలీలు జరిగాయని ఆరోపించారు. 'దమ్ముంటే ఒప్పుకో.. దీనిపై హౌస్ కమిటీ వేయిద్దాం' అని హరీష్ రావుకు సీఎం సవాల్ చేశారు. కేటీఆర్, వెంకటరమణా రెడ్డి నిజంగా హరీష్ నిజాయితీని నమ్మితే హౌస్ కమిటీకి అంగీకరించాలని డిమాండ్ చేశారు. 'భూ దందాలు సభలోనే

...:: మిగతా 2లో

కన్నవారికి అండగా ఉండేందుకు

కొత్త చట్టం

- శాసనసభలో ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- 'తల్లిదండ్రుల సంరక్షణ ఉద్యోగుల బాధ్యత' బిల్లుకు సభ ఆమోదం
- ప్రభుత్వ ఉద్యోగులతో పాటు, ప్రజా ప్రతినిధులకూ వర్తింపు
- నెలకు రూ.10,000 తల్లిదండ్రుల బ్యాంక్ ఖాతాలో జమ

...:: 2లో

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- బీఆర్ఎస్ హయాంలో న్యాయం చేయలేకపోయా.. క్షమించండి
- సమస్య తీర్చే అవకాశం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోవటం లేదు
- ఏజెన్సీలకు కొమ్ముకాస్తూ 5 లక్షల మందికి అన్యాయం చేస్తోంది
- జాగృతి అధికారంలోకి వస్తే ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగాల వ్యవస్థే ఉండదు
- ఇందిరా పార్క్ వద్ద ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ధర్నాలో కల్వకుంట్ల కవిత

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్ మార్చి 29: ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల కోసం వెంటనే కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వానికి రెండు రోజుల సమయమిస్తున్నామని ఈ లోగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం చూపకుంటే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఇందిరా పార్క్ వద్ద ధర్నా చౌక్ లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ

...:: మిగతా 2లో

నేను సిద్ధంగా ఉన్నాను, రేవంత్ రెడ్డి సిద్ధమా?

- సీబీసీఐడీ విచారణ కాదు, హై కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయిద్దాం
- రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అవినీతికి పాల్పడిందని రేవంత్ రెడ్డే చెప్పారు
- ప్రభుత్వ అవినీతినీ కౌశిక్ రెడ్డి ప్రశ్నిస్తున్నాడు
- కాబట్టే కౌశిక్ రెడ్డిపై ఉద్దేశ పూర్వకంగా ప్రభుత్వం దాడి చేస్తుంది
- డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 29: రేవంత్ రెడ్డి తమ్ముళ్లు, బావలు చేసిన స్కాంలపై విచారణకు రెడీ అయితే, నేను కూడా రెడీ అని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్‌రావు అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అక్రమ మైనింగ్ పాల్పడ్డాడని, ప్రజలతో పాటు రేవంత్ రెడ్డికి ఈ విషయం అర్థమైందని, రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అవినీతికి పాల్పడిందని స్వయంగా

...:: మిగతా 2లో

మా దీవుల్ని, నేలను ఆక్రమించాలని చూస్తే

పర్షియన్ గల్ఫ్ షార్కులకు ఆహారంగా మారతారు

- అమెరికన్ సైనికుల రాకపై ఇరాన్ హెచ్చరిక
- ఖర్గ్ ఐలాండ్‌ను స్వాధీనం చేసుకున్న అమెరికా
- పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తత
- ట్రంప్‌కు వ్యతిరేకంగా అమెరికాలో ఉద్యమం

ప్రతిపక్షం, నేషనల్ డెస్క్

ఇరాన్‌పై యుద్ధాన్ని మరింత తీవ్రం చేసేందుకు, కొన్ని దీవుల్ని ఆక్రమించేందుకు అమెరికా తన సైనిక బలగాల్ని పశ్చిమాసియాకు తరలించిన సంగతి

...:: మిగతా 5లో

గోదావరి పుష్కరాలపై 20 రోజుల్లో నివేదిక ఇవ్వండి

- అనువైన ప్రదేశాల గుర్తింపునకు టెక్నికల్ ఇంజనీర్ల కమిటీ
- మూడు దశల్లో ప్రణాళిక అమలు
- ఘాట్ల విస్తరణ - రోడ్ల కనెక్టివిటీపై దృష్టి
- ఆలయాలు, ఘాట్ల అభివృద్ధిపై సీఎం రేవంత్ సమీక్ష

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరాబాద్, మార్చి 29: 2027 జూన్‌లో జరగనున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విస్తృత స్థాయి ఏర్పాట్లపై దృష్టి సారించింది. ఈ మేరకు

...:: మిగతా 3లో

బీజేపీ హయాంలో ఆదివాసీలపై వివక్ష తీవ్రం

గుజరాత్‌లోని బీజేపీ ప్రభుత్వ హయాంలో దళిత, ఆదివాసీ వర్గాలపై ద్వేషం, వివక్ష, అకృత్యాలు తీవ్రమయ్యాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు.

9

భారత్‌కు చేరుకోనున్న ఎల్పీజీ నౌకలు

భీకర దాడులతో అట్టుడుకుతున్న హార్ముజ్ జలసంధి గుండా భారత జెండాతో ఉన్న మరో రెండు ఎల్‌పీజీ కార్గో నౌకలు సురక్షితంగా బయటపడ్డాయి. రాబోయే రెండు, మూడు రోజుల్లో ఇవి భారత్‌కు చేరుకోనున్నాయి.

9

డీఎంకే వరాల జల్లు

తమిళనాడు ప్రజలకు అధికార డీఎంకే పార్టీ వరాల జల్లు కురిపించింది. తమిళనాడులో మళ్లీ అధికారంలోకి వస్తే మహిళలకు అందుతున్న నెలవారీ గౌరవ వేతనాన్ని వెయ్యి రూపాయల నుంచి 2 వేల రూపాయలకు పెంచుతామని హామీ ఇచ్చింది.

9

బీజేపీ గెలిస్తే చేపలు, గుడ్లు తినలేం

పశ్చిమ బెంగాల్‌లో అధికార టీఎంసీ, ప్రతిపక్ష బీజేపీ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. తాజాగా టీఎంసీ అధినేత, సీఎం మమతా బెనర్జీ బీజేపీపై సంచలన వ్యాఖ్యలు చేశారు.

9

రాజకీయం

కన్నవారికి అండగా ఉండేందుకు కొత్త చట్టం

- శాసనసభలో ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- 'తల్లిదండ్రుల సంరక్షణ ఉద్యోగుల బాధ్యత' బిల్లుకు సభ ఆమోదం
- ప్రభుత్వ ఉద్యోగులతో పాటు, ప్రజా ప్రతినిధులకూ వర్తిస్తుంపు
- నెలకు రూ.10,000 తల్లిదండ్రుల బ్యాంక్ ఖాతాలో జమ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 29: పిల్లల కోసం తల్లిదండ్రులు తమ శక్తినంతా ధారపోస్తారని, పిల్లలు మాత్రం రెక్కలు వచ్చాక తల్లిదండ్రులను పట్టించుకోవట్లేదని సీఎం రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధ తల్లిదండ్రులకు అండగా నిలవాలనే 'తల్లిదండ్రుల సంరక్షణ ఉద్యోగుల బాధ్యత' చట్టం తీసుకొచ్చామని అన్నారు. 'తల్లిదండ్రుల సంరక్షణ ఉద్యోగుల బాధ్యత బిల్లు'ను శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టారు. తల్లిదండ్రుల సంరక్షణ ఉద్యోగుల బాధ్యత బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లు ద్వారా ఉద్యోగులు తమ తల్లిదండ్రులను సంరక్షించకపోతే వారి వేతనం నుంచి ఒక భాగాన్ని నేరుగా తల్లిదండ్రులకు అందించే విధానం అమల్లోకి రానుంది. సమాజం తలదించుకునేలా కొందరు పిల్లలు వ్యవహరిస్తున్నారని, ఆత్మీయతకు సంబంధించిన అంశంపై చట్టం తీసుకురావటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. అత్తింటికి వెళ్లిన ఆడపిల్లలు తల్లిదండ్రుల బాగోగులు చూడలేని పరిస్థితులు ఉన్నాయని, తాము తెచ్చిన చట్టం ప్రభుత్వ ఉద్యోగులకే కాదని, ప్రజా ప్రతినిధులకు కూడా వర్తిస్తుందని పేర్కొన్నారు. తల్లిదండ్రుల యోగక్షేమాలు చూడని వ్యక్తిని సామాజికంగా బహిష్కరించాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులను చూసుకోలేనోడు సమాజంలో బతకడానికి వీల్లేదని అన్నారు. సామాజిక బాధ్యతగా ఈ చట్టాన్ని తీసుకువచ్చామని, అందరూ మద్దతు ఇవ్వాలని కోరారు. సీఎం ప్రసంగం అనంతరం తల్లిదండ్రుల సంరక్షణ ఉద్యోగుల బాధ్యత బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది.

ఉద్యోగుల వేతనంలో నెలకు 15 శాతం

ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వరంగ సంస్థల సిబ్బంది, అలాగే ప్రైవేట్ సంస్థల్లో పని చేసే ఉద్యోగులు ఈ బిల్లు పరిధిలోకి వస్తారు. తల్లిదండ్రులను పట్టించుకోని ఉద్యోగుల వేతనంలో నెలకు 15 శాతం లేదా గరిష్ఠంగా రూ.10,000 వరకు ఈ రెండింటిలో ఏది తక్కువైతే ఆ మొత్తాన్ని తల్లిదండ్రుల బ్యాంక్ ఖాతాలో జమ చేస్తారు. ఇది నేరుగా అధికారుల ఆదేశాల మేరకు అమలు అవుతుంది. ఇది కేవలం శిక్షాత్మక చర్య కాకుండా బాధ్యతను గుర్తు చేసే ఒక సామాజిక చర్యగా ప్రభుత్వం భావిస్తోంది.

మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 29: రాష్ట్రంలో అక్రమ మైనింగ్, అవినీతి వ్యవహారాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. శాసనసభ పక్ష ఉపనేత హరీష్ రావు బయట పెట్టిన వివరాల నేపథ్యంలో ప్రభుత్వం కలవరపడిందని ఆయన అన్నారు. ఈ అంశంపై సిట్టింగ్ హైకోర్టు జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. మంత్రి పొంగులేటిని వెంటనే బర్తరఫ్ చేయాలని, ప్రభుత్వం స్పందించకపోతే గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమ క్రషర్స్‌పై చర్యలు తీసుకోవాలంటూ గన్‌పార్క్ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నిరసన తెలిపారు. ఈ నిరసనలో కేటీఆర్, హరీశ్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభ పక్ష ఉపనేత హరీష్‌రావు నిన్న రాష్ట్రప్రభుత్వంలో నంబర్ 2గా ఉన్న ఒక మంత్రిగారి స్కామ్‌ను ఆధారాలతో సహా బయట పెట్టారని, ఆ మంత్రి కుటుంబానికి చెందిన కంపెనీ నిబంధనలు ఉల్లంఘించి అక్రమ మైనింగ్‌కు పాల్పడిందని తెలిపారు. ఈ వివరాలు కూడా ప్రభుత్వమే ఇచ్చిన డాక్యుమెంట్ల ఆధారంగా బయటకు వచ్చాయని పేర్కొన్నారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడిన ఇతర సంస్థలపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకున్నప్పటికీ, రాఘవ కన్స్ట్రక్షన్స్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. మంత్రి కంపెనీ కావడం వల్లనా, లేక ముఖ్యమంత్రి పాత్ర ఉండడం వల్లనా చర్యలు తీసుకోవడం లేదని అనుమానం వ్యక్తం చేశారు. ఈ విషయంపై హరీష్‌రావు ఆధారాలతో సహా వాస్తవాలు బయటపెట్టిన తర్వాత ముఖ్యమంత్రి స్పందిస్తూ రెండు విషయాలు ఒప్పుకున్నారని కేటీఆర్ తెలిపారు. అక్రమాలు జరిగినట్లు అంగీకరించినప్పటికీ, వాటిని బయటపెట్టింది ప్రభుత్వం అన్న పేరుతో ఎదురు దాడి చేయడం విచిత్రమని అన్నారు. అలాగే రాఘవ కన్స్ట్రక్షన్స్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారి దూరపు బంధువులదని చెప్పడం హాస్యాస్పదమని విమర్శించారు. మంత్రి భార్య, కొడుకు, తమ్ముడు కంపెనీతో సంబంధం ఉన్నారని, 2020-22 వరకు ఆయనే చైర్మన్‌గా ఉన్నారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి మాటల్లో విరుద్ధతలు ఉన్నాయని పేర్కొన్నారు. తెలంగాణ మాత్రమే సముద్రతీరంలేని రాష్ట్రం అన్న వ్యాఖ్యలతో ఆయన అవగాహన స్థాయి బయటపడిందని ఎద్దేవా చేశారు. రాఘవ కన్స్ట్రక్షన్స్‌పై ముఖ్యమంత్రికి ఉన్న అనుకూలత వెనుక కారణాలను విశ్లేషించినప్పుడు, ముఖ్యమంత్రి పాత్ర కూడా ఈ వ్యవహారంలో ఉన్నట్లు స్పష్టమవుతోందని కేటీఆర్ ఆరోపించారు. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ఆ కంపెనీకి అప్పగించడం, రాష్ట్రంలో భూదందాలు జరుగుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి, ఆయన అనుచరుల పాత్రపై అనుమానాలు వ్యక్తం చేశారు. రెండున్నరేళ్లుగా ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడే పనులు చేయకుండా కేసులు, కమిషన్లతో కాలక్షేపం చేస్తోందని విమర్శించారు. తప్పు చేయకపోతే భయం ఎందుకు అని ప్రశ్నిస్తూ, మంత్రి గారి కుటుంబ సంస్థపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని నిలదీశారు. చట్టప్రకారం రెండో నోటీసు ఇస్తే సంవత్సరం జైలు శిక్ష పడాల్సి ఉంటుందని గుర్తు చేశారు. మైనింగ్ శాఖ మంత్రి అక్రమాన్ని కేవలం రూ.4 లక్షల వ్యవహారంగా చూపడం సిగ్గుచేటని అన్నారు. అధికారుల దాడిలో ఒకే రోజులో రూ.32 లక్షల విలువైన అక్రమాలు బయటపడిన నేపథ్యంలో, రెండున్నరేళ్లలో జరిగిన అవినీతి పరిమాణాన్ని అంచనా వేయవచ్చని పేర్కొన్నారు. కోకాపేటలో భాగ్యలక్ష్మి మైనింగ్ కంపెనీ కూడా ముఖ్యమంత్రి బంధువులకు చెందినదని ఆరోపించారు. ప్రభుత్వం మైనింగ్ రెవెన్యూ పెరిగిందని చెప్పుకుంటున్నప్పటికీ, వాస్తవంగా రావాల్సిన రూ.1700-1800 కోట్లలో కేవలం రూ.900 కోట్లు మాత్రమే వస్తున్నాయని, మిగిలిన నిధులు ఎక్కడికి వెళ్తున్నాయో వివరించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై సభాసంగం ఏర్పాటు చేసి మంత్రి, ముఖ్యమంత్రి, ఇతరుల పాత్రలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. గతంలో ఓబులాపురం మైనింగ్ కేసులో హౌస్ కమిటీ ఏర్పాటు చేసినట్లు, ఇదే విధంగా పారదర్శక విచారణ జరపాలని కోరారు. ప్రభుత్వం తప్పు చేయకపోతే ఎందుకు భయపడుతోందని ప్రశ్నించారు. ఈ స్కాంలో బీజేపీ సభ్యుల ప్రవర్తన కూడా గమనించాల్సిన అంశమని, వారు ప్రతిపక్షంగా వ్యవహరించకుండా ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి సమాచారం ఇచ్చినా స్పందన లేదని పేర్కొన్నారు. అక్రమ మైనింగ్‌లో పాల్గొన్న మంత్రి, ఆయన కుటుంబ సభ్యులు భూదందాలు, కబ్జాలు చేస్తున్నారని ఆరోపిస్తూ, వీరిని వదిలిపెట్టబోమని హెచ్చరించారు. ఇక హైదరాబాద్ మెట్రో అంశంపై కూడా కేటీఆర్ స్పందించారు. ముఖ్యమంత్రి చేసిన ప్రకటనలో అనేక అసత్యాలు ఉన్నాయని పేర్కొన్నారు. రూ.22 వేల కోట్ల ఆస్తిని రూ.15 వేల కోట్లకు కొనుగోలు చేశామని చెప్పడం ప్రజలను తప్పుదారి పట్టించడమేనన్నారు. మెట్రో కోసం ఇచ్చిన 280 ఎకరాల భూమి ప్రభుత్వానిదేనని, అది కేవలం లీజుకు మాత్రమే ఇచ్చినదని వివరించారు. ఆ భూమిపై ఎల్ అండ్ టీ నిర్మాణాలు చేసి, ఆ తర్వాత ప్రభుత్వానికి తిరిగి అప్పగించాల్సి ఉంటుందని ఒప్పందం ఉందన్నారు. ప్రైవేట్ సంస్థ అప్పును రాష్ట్ర ప్రజలపై మోపడం సిగ్గుచేటని విమర్శించారు. ఎల్ అండ్ టీపై ఒత్తిడి తెచ్చి ఆస్తులను స్వాధీనం చేసుకునే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. హైదరాబాద్ మెట్రో విస్తరణకు కేంద్ర ప్రభుత్వం అభ్యంతరం చెప్పలేదని, గతంలో ప్రాజెక్టు ప్రారంభించినప్పుడు ఎలాంటి సమస్యలు లేవని గుర్తు చేశారు. ఇప్పుడు మాత్రం కొత్త కారణాలు చూపించడం సరైంది కాదన్నారు. ఈ వ్యవహారం మొత్తం ఒక పెద్ద భూ దందా స్కెచ్‌గా కనిపిస్తోందని, 280 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకోవడమే అసలు లక్ష్యమని ఆరోపించారు. ఇందులో ప్రజల ప్రయోజనాలు లేవని స్పష్టం చేశారు.

బాలానగర్ భూములపై విచారణకు సిద్ధమా?

మొదటిపేజీ తరువాయి

బయటపెడతాం.. ఆ భూముల చిట్టా విప్పుతాం... మీ భూదందాలు సభ ద్వారా బయట పెడతాం' అంటూ సీఎం హెచ్చరించారు.

దళితుల గౌరవమే మా ప్రభుత్వ లక్ష్యం

శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దళితుల సాధికారత, రాజకీయ సంస్కృతి, అక్రమ మైనింగ్, సభా వ్యవహార శైలిపై తీవ్రంగా స్పందించారు. గత ప్రభుత్వాలపై విమర్శలు గుప్పిస్తూ, తమ ప్రభుత్వ విధానాలను స్పష్టంగా వివరించారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు తెలంగాణ ఏర్పాటుకు ముందు దళితుడిని ముఖ్యమంత్రిగా చేస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని సీఎం విమర్శించారు. 'దళితులు పాలించరాదన్న భావంతో తానే సీఎం అయ్యారు. ఉప ముఖ్యమంత్రి పదవిని కూడా తొలగించారు' అని అన్నారు. భట్టి విక్రమార్కను గతంలో ప్రతిపక్ష నాయకుడిగా కూడా సహించలేక తొలగించారని విమర్శిస్తూ, 'ఇప్పుడు మా ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు' అని తెలిపారు. తమ ప్రభుత్వంలో దళితులకు విస్తృత అవకాశాలు కల్పించామని సీఎం పేర్కొన్నారు. దామోదర రాజనర్సింహ, సీతక్క, వివేక్ వెంకటస్వామి తదితరులకు పదవులు ఇచ్చామని వివరించారు. 'వాళ్ల టీమ్ హరీష్ రావు, కేటీఆర్ లాంటి వారితో పరిమితం... మా టీమ్ మాత్రం సమగ్ర ప్రతినిధిత్వం' అని వ్యాఖ్యానించారు.

పాడి కౌశిక్ రెడ్డి పై చర్యలకు డిమాండ్

'స్పీకర్‌ను డిక్టేట్ చేసే సంస్కృతి ఎక్కడిది? స్పీకర్ అవకాశం ఇస్తేనే మాట్లాడాలి' అంటూ సభా మర్యాదలను గుర్తు చేశారు. సీనియర్ నాయకుడు కడియం శ్రీహరి గౌరవాన్ని కాపాడాలని సీఎం సూచించారు. అసభ్య ప్రవర్తనకు పాల్పడ్డారని ఆరోపిస్తూ, పాడి కౌశిక్ రెడ్డి పై చర్యలు తీసుకుని ఎథిక్స్ కమిటీకి పంపాలని కోరారు. 'అక్రమ మైనింగ్‌లో ఎవరు ఉన్నా ఆధారాలు ఇవ్వండి.. నా కుటుంబం అయినా, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అయినా వదిలిపెట్టం' అని సీఎం స్పష్టం చేశారు. 'ఆధారాలు ఉంటే ఎవరిపై అయినా చర్యలు తీసుకుంటాం' అని హెచ్చరించారు.

బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తున్నారు

మొదటిపేజీ తరువాయి

'వృద్ధ తల్లిదండ్రులకు భరోసా ఇచ్చే బిల్లుపై మాట్లాడమంటే అల్లరి చేస్తున్నారు. స్పీకర్‌కు నోటీస్ ఇవ్వకుండా మంత్రి పేరు తీయడమే తప్పు. సీబీ సీఐడీకి ఇచ్చిన తర్వాత కూడా అల్లరి ఎందుకు. చప్పట్లు కొట్టుకుంటూ సభను అంగడిలా మార్చకండి. గతంలో వేసిన హౌస్ కమిటీలతో ఏం సాధించారు. పదేళ్లలో మీరు వేసిన హౌస్ కమిటీల రిపోర్ట్ సభలో పెట్టారా?. బీజేపీ సలహా మేరకు కాళేశ్వరం విచారణ సీబీఐకి అప్పగిస్తే ఏం జరిగింది. బీఆర్ఎస్ నేతలు సభను జరగనివ్వొద్దన్న ఎజెండాతో వచ్చారు. ప్రజలకు మేలు జరగొద్దని వారు అనుకుంటున్నారు. ధరణి పేరిట అనాడు వందల ఎకరాల భూములను తమ వారి పేర్ల పైకి బదలాయించుకున్నారు. వాటిపై హౌస్ కమిటీ వేయండి' అని అన్నారు.

పొంగులేటిని బర్తరఫ్ చేయాలని నినాదాలు..

తెలంగాణ అసెంబ్లీలో గందరగోళం నెలకొంది. బీఆర్ఎస్ నేతలు సభలో నిరసనలు చేపట్టారు. రాఘవ కన్‌స్ట్రక్షన్ వ్యవహారంపై హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలని నినాదాలు చేశారు. విపక్షాల నినాదాల మధ్యే ప్రభుత్వం రెండు బిల్లులు ప్రవేశపెట్టింది. బీఆర్ఎస్ నేతలు సభలో గందరగోళం సృష్టించటంపై మంత్రి శ్రీధర్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనింగ్ అంశంపై ఇప్పటికే దర్యాప్తునకు ఆదేశించామని తెలిపారు. సీఐడీ దర్యాప్తునకు ఆదేశించిన తర్వాత హౌస్ కమిటీ ఎందుకు? అని ప్రశ్నించారు. సీఐడీ కంటే పెద్ద సంస్థ ఉంటుందా? అని కూడా మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. తప్పు చేస్తే ఎవరినీ వదిలేది లేదని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ దగ్గర ఆధారాలు ఉంటే సీఐడీకి ఇవ్వొచ్చని అన్నారు. నిరసనలతో సభను అడ్డుకోవడం సరికాదని చెప్పుకొచ్చారు. ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ..'తల్లిదండ్రుల సంరక్షణ కోసం బిల్ పెడుతున్నాం. తల్లిదండ్రులపై బాధ్యత ఉండాలని బిల్ పెడుతున్నాం. సభ సజావుగా నడవకుండా బీఆర్ఎస్ సభ్యులు అడ్డుకుంటున్నారు. తల్లిదండ్రుల సంరక్షణ బీఆర్ఎస్ సభ్యులకు అవసరం లేదా?' అని మంత్రి ప్రశ్నించారు.

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ వేటు వేసిన స్పీకర్..

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలకు అడ్డుపడుతున్నారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరిపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సస్పెన్షన్ వేటు వేశారు. సమావేశాలు ముగిసే వరకు వారిపై సస్పెన్షన్ కొనసాగేలా కీలక నిర్ణయం తీసుకున్నారు. బడ్జెట్ పై చర్చను అడ్డుకుంటున్నారని వారిపై స్పీకర్ సీరియస్ అయ్యారు. సభకు ఆటంకం కలగించవద్దని పలుమార్లు విజ్ఞప్తి చేసినా బీఆర్ఎస్ నేతలు పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ నేతలందరినీ ఈ సెషన్ మొత్తం సస్పెన్షన్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. సభ నుంచి బయటకు వెళ్లిన కారు పార్టీ ఎమ్మెల్యేలంతా తెలంగాణ భవన్‌కు వెళ్లారు. కాగా, హైదరాబాద్‌లో రాఘవ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ అక్రమంగా మైనింగ్ చేస్తోందని.. అది మంత్రి పొంగులేటికి చెందిన కంపెనీ అని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. దీనిపై వెంటనే ప్రతి పక్ష నేత ఆధ్వర్యంలో సభా సంఘం ఏర్పాటు చేసి సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేస్తోంది. నిన్నటి నుంచి సభలో దీనిపై గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. నేడు కూడా కారు పార్టీ ఎమ్మెల్యేలు స్పీకర్ పోడియం వద్ద వెల్లి పెద్దఎత్తున నినాదాలు చేశారు. దీంతో సభను అడ్డుకుంటున్నారంటూ స్పీకర్ వారిపై సస్పెన్షన్ వేటు వేశారు.

మత్తు వదిలించుకోవడానికే మైదానంలోకి రండి: మంత్రి వాకిటి శ్రీహరి

తెలంగాణ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్రీడా పోటీల్లో తాము పాల్గొనమంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి వాకిటి శ్రీహరి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. మత్తు వదిలించుకోవడానికే మైదానంలోకి రమ్మంటున్నామని ఎద్దేవా చేశారు. మైదానంలోకి తాము రామంటూ కేటీఆర్ అంటుంటే ఏం చేయగలమని అన్నారు. 'మావి వేరే గేమ్స్, కేటీఆర్‌వి మరో రకమైన గేమ్స్' అంటూ మంత్రి వాకిటి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. బీఆర్ఎస్ వాళ్లు ఆడే గేమ్స్ పెట్టడం సాధ్యం కాదు కదా? అంటూ చురకలు అంటించారు మంత్రి వాకిటి శ్రీహరి. తాము ఫిట్ తెలంగాణ కోసం ప్రయత్నం చేస్తున్నామని.. ఆరోగ్య తెలంగాణ ఉండాలని సీఎం ఆలోచన చేస్తున్నారని మంత్రి తెలిపారు. ప్రజాప్రతినిధులు క్రీడలు ఆడడం వల్ల విద్యార్థులకు మార్గదర్శకంగా ఉంటుందని ఆయన తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలతో పిల్లలకు డ్రగ్స్ వంటి ఆలోచనలు రాకుండా ఆటల వైపు మళ్లుతారని వాకిటి పేర్కొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



మొదటిపేజీ తరువాయి

నిర్వహించిన ధర్నాకు ఆమె మద్దతు తెలిపి ప్రసంగించారు. తెలంగాణ వస్తే అసలు ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగాల వ్యవస్థే ఉండదని భావించామని, రాష్ట్ర ఆవిర్భావం తర్వాత పర్మినెంట్ ఉద్యోగాలనే ఔట్ సోర్సింగ్ గా మార్చేశారని ఆవేదవ వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్నప్పుడు విద్యుత్ ఆర్టిజన్లకు భరోసా కల్పించగలిగానని, మరికొందరు కాంట్రాక్ట్ ఉద్యోగులకు న్యాయం చేశానని తెలిపారు. ఆ ప్రభుత్వంలో భాగస్వామిగా ఉండి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. ఆనాటి పాపంలో తనకు భాగం ఉన్నందుకు సోదరిగా క్షమాపణ చెప్తున్నానని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పట్టించుకోలేదనే కాంగ్రెస్ ను గెలిపిస్తే వాళ్లు కూడా పట్టించుకోవడం లేదన్నారు. ప్రొఫెసర్ కోదండరాం, హరగోపాల్ లాంటి వాళ్లు చెబితేనే తెలంగాణ ఉద్యమంలో లేని రేవంత్ రెడ్డికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మద్దతు పలికారని చెప్పారు. ఇవ్వాళ కోదండరాం, హరగోపాల్ లాంటి మేధావుల మౌనం ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పాలిట శాపంగా మారిందన్నారు.

మరో తెలంగాణ ఉద్యమం

రాష్ట్రంలో ఉన్న 5 లక్షల మంది ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు చేపట్టిన ఈ ఉద్యమం మరో తెలంగాణ ఉద్యమంలా ఉందని కవిత అన్నారు. తెలంగాణ ఉద్యమంలో మిలియన్ మార్చ్ ఏ విధంగా చేశామో.. అలాగే హాఫ్ మిలియన్ ఉన్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు హైదరాబాద్ వీధుల్లో మార్చ్ చేపట్టాలని పిలుపునిచ్చారు. అప్పుడు మాత్రమే ఈ ప్రభుత్వం స్పందిస్తుందన్నారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానం కారణంగా 9 వందల ఏజెన్సీలకు మాత్రమే లాభం కలుగుతుంది తప్ప ఉద్యోగులకు జరిగిన మేలు ఏది లేదన్నారు. ప్రభుత్వంపై రూపాయి భారం పడకుండా సమస్య పరిష్కారించే అవకాశం ఉన్నా ఏజెన్సీలకు ఎందుకు కొమ్ము కాస్తున్నారని ప్రశ్నించారు. గత ప్రభుత్వం ధర్నా చౌక్ ఎత్తివేసి ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తే కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎన్ని రోజులైనా ధర్నా చేసుకొని మీ చావు మీరు చావండన్నట్లుగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు.

మేము వస్తే ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ విధానం ఉండదు

తాము త్వరలోనే రాజకీయ పార్టీగా అవతరించబోతున్నామని కవిత తెలిపారు. ఈ లోపే ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యకు పరిష్కారం దొరుకుతుందని భావిస్తున్నామని అన్నారు. లేదంటే ఇంకా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. తెలుగు దేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు తీసుకొచ్చిన కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానం ఇప్పటికీ కొనసాగటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. జాగృతి అధికారంలోకి వస్తే ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ అనే విధానాన్నే లేకుండా చేస్తామన్నారు. ప్రభుత్వ ఫలాలు ప్రజలకు అందించేందుకు ప్రభుత్వ ఉద్యోగుల వ్యవస్థ మాత్రమే ఉండాలన్నది తమ విధానమని స్పష్టం చేశారు.

న్యాయం చేయకపోతే అసెంబ్లీ ని ముట్టడిస్తాం: జాజుల హెచ్చరిక

రాష్ట్రంలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేసి నేరుగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని బీసీ జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు నేడు హైదరాబాద్ నుండి ఇందిరాపార్క్ వద్ద ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో జరిగిన మహా ధర్నాకు బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ తో కలిసి ముఖ్యఅతిథిగా విచ్చేసి జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉద్యోగ భద్రత కల్పించి, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలు పెంచాలని, ఆరోగ్య భద్రత తో పాటు ప్రతినెల జీతాలు విడుదల చేయాలని అలాగే అకారణంగా అన్యాయంగా తొలగించిన ఔట్సోర్సింగ్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఔట్సోర్సింగ్ ఉద్యోగుల తో కలిసి వేలాది మందితో చలో అసెంబ్లీ ముట్టడిని చేపడతామని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు.

నేను సిద్ధంగా ఉన్నాను, రేవంత్ రెడ్డి సిద్ధమా?

మొదటిపేజీ తరువాయి

రేవంత్ రెడ్డే చెప్పాడని అందుకే ప్రభుత్వం డిఫెన్స్ లో పడిపోయి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని హరీష్ రావు ఆరోపించారు. అక్రమ మైనింగ్ పై మాకు మాట్లాడేందుకు మైక్ ఇవ్వకుండా, వాళ్లకు వాళ్లే సీబీసీఐడీ విచారణ అంటూ చెప్పుకొని వస్తున్నారని అన్నారు. అక్రమ మైనింగ్‌పై హౌస్ కమిటీ వెయ్యాలని డిమాండ్ చేస్తే, దళితులపై రాజకీయం చేశారని అన్నారు. ప్రభుత్వ అవినీతినీ కౌశిక్ రెడ్డి గట్టిగా ప్రశ్నిస్తున్నాడు కాబట్టే కౌశిక్ రెడ్డిపై ఉద్దేశ పూర్వకంగా ప్రభుత్వం దాడి చేస్తుందని, ఈ దాడి ప్రజాస్వామ్యంపై దాడిగా మేము భావిస్తున్నాని అన్నారు. బడువ అనే భాష మాట్లాడిన రేవంత్ రెడ్డిపై శాసన సభ ఎథిక్స్ కమిటీకి రిఫర్ చెయ్యాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈరోజు కుట్రలో భాగంగా కౌశిక్ రెడ్డిపై ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేశారన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

అక్రమ మైనింగ్ పై హౌస్ కమిటీ వేస్తే తప్పేంటి

దళితుల పై ప్రేమ ఉన్నది బిఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్‌కు దళిత గిరిజనుల గురించి ఆలోచింది కేసీఆర్ దళిత బంధు పథకం తెచ్చారని హరీష్‌రావు అన్నారు. జాయింట్ హౌస్ కమిటీ వెయ్యాలని అనేక సార్లు పార్లమెంట్ లో రాహుల్ గాంధీ మాట్లాడారని, రాహుల్ గాంధీ మాట్లాడితే తప్పు లేదుగానీ, మేము హౌస్ కమిటీ డిమాండ్ చేస్తే తప్పా? అని హరీష్‌ప్రశ్నించారు. పరిశ్రమల శాఖలో భాగంగా మైనింగ్ ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ కు తెలియకపోవడం శోచనీయమన్నారు హరీష్ రావు. అక్రమ మైనింగ్ జరుగుతుందని రాఘవ కన్‌స్ట్రక్షన్‌పై అనేక సార్లు ఎర్రోళ్ల శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు.పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విషయం బయటపడగానే నాపై బురద జల్లే ప్రయత్నం చేశారు. నా బావమరిది, నా తమ్ముడు పేర్లు తీసుకుంటూ మాపై ఆరోపణలు చేశారు. మా కుటుంబ సభ్యులపై చేసిన ఆరోపణలపై విచారణకు సిద్ధం అని, రేవంత్ రెడ్డి తమ్ముళ్లు, బావలు చేసిన కుంభకోణాలపై విచారణకు రెడీ అయితే నేను రెడీ అని, హై కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయిద్దాం, నేను సిద్ధంగా ఉన్నాను, రేవంత్ రెడ్డి సిద్ధమా.? అని ప్రశ్నించారు.

సౌదీ అరేబియాలోని యూఎస్‌స్థావరాలపై ఇరాన్ చేపట్టిన దాడి వెనుక రష్యా సహకారం ఉంది. ఇరాన్‌కు రష్యా వందశాతం సహకరిస్తోంది. మార్చి 20, 23, 25 తేదీల్లో సౌదీలోని ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్ శాటిలైట్ చిత్రాలను రష్యా క్యాప్చర్ చేసింది. ఒకటి కన్నా ఎక్కువసార్లు అలా శాటిలైట్ ఇమేజెస్‌ను రష్యా సాధారణంగా సేకరించదు.

- ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

భూ బదలాయింపుపై హౌస్ కమిటీ వేయాలి

- ఖైరతాబాద్ ఎమ్మెల్యే ఎమ్మెల్యే దానం నాగేందర్
- లక్షల ఎకరాలు దోచుకున్నారు: కడియం
- 200 కోట్ల విలువైన భూమి కబ్జా చేశారు: నాయిని

ప్రతిపక్షం, స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 29: తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో గందరగోళం నెలకొంది. సభలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టి, పోడియం వద్దకు దూసుకెళ్లి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా భాగంగా మాజీ మంత్రి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ చేసిన వ్యాఖ్యలు పెను సంచలనం సృష్టిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూ కేటాయింపులపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకొని ఆయన చేసిన ఆరోపణలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

నా సొంత భూమినే కంపెనీకి ఇచ్చారు.

ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ.. 'నా సొంత భూమిని కేటీఆర్ ఒక ప్రైవేట్ కంపెనీకి కట్టబెట్టారు. ఆ సమయంలో అధికారంలో ఉండటంతో నేను తీవ్రంగా నష్టపోయాను. నేను హైదరాబాద్‌లో పుట్టి పెరిగినప్పటికీ.. అప్పుడు ఏమీ చేయలేక నోరు మూసుకోవాల్సి వచ్చింది. భూ బదలాయింపుల్లో జరిగిన అక్రమాలను వెలికితీయడానికి ప్రభుత్వం తక్షణమే హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేస్తున్నా. ఈ అక్రమాలకు సంబంధించిన అన్ని ఆధారాలు, పత్రాలు నా వద్ద ఉన్నాయి. ప్రభుత్వం కోరితే వాటిని సమర్పించడానికి నేను సిద్ధంగా ఉన్నా. నేను వ్యక్తిగతంగా ఎంత నష్టపోయానో నాకు మాత్రమే తెలుసు. ఇవన్నీ బయటకు రావాల్సిన అవసరం ఉంది.' అని అన్నారు.

రూ. 200 కోట్ల విలువైన భూమి కబ్జా చేశారు: నాయిని

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 'హన్మకొండలో సుమారు రూ.200 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్ పేరుతో అక్రమంగా దక్కించుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో అధికార దుర్వినియోగానికి ఇది పరాకాష్ట. నా ఆరోపణలు నిరూపించకుంటే 48 గంటల్లో పదవికి రాజీనామా చేస్తా. బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్ భూ దోపిడీపై హౌస్ కమిటీ వేయాలి. అక్రమంగా నిర్మించిన పార్టీ కార్యాలయాల విషయంలో కఠినంగా వ్యవహరించి, బాధ్యులను చట్టం ముందు నిలబెట్టాలి' అని అన్నారు.

లక్షల ఎకరాలు దోచుకున్నారు: కడియం

తెలంగాణ అసెంబ్లీ వేదికగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి బీఆర్ఎస్ నేతలపై నిప్పులు చెరిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'గత పదేళ్ల కాలంలో జరిగిన భూ కేటాయింపుల్లో భారీ అక్రమాలు జరిగాయి. లక్షల ఎకరాల ప్రభుత్వ భూములను దోచుకున్నారు. ఇప్పుడు నీతులు చెప్పడం హాస్యాస్పదంగా ఉంది. అప్పట్లో అధికారాన్ని అడ్డం పెట్టుకొని కంపెనీల యజమానులను బెదిరించారు. వారి వద్ద ఉన్న విలువైన భూములను బలవంతంగా బదలాయించుకున్నారు. ఇదో వ్యవస్థీకృత దోపిడీ.. బాలానగర్ ప్రాంతంలో జరిగిన భూ అక్రమాలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలి' అని అన్నారు.

ప్రతిపక్షానికి అవకాశమివ్వడం లేదు

- ఇల్లీగల్ మైనింగ్ పై హౌస్ కమిటీ వేయాలి
- మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 29: ఇల్లీగల్ మైనింగ్స్ పై హౌస్ కమిటీ వేయాల్సిందేనని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భర్తరఫ్ చేయాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. తెలంగాణ అసెంబ్లీ నిర్వహణ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్షానికి మాట్లాడే అవకాశం ఇవ్వకుండా అడ్డుకుంటున్నారని, అక్రమ మైనింగ్ వంటి కీలక అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకుండా తప్పించుకుంటోందని విమర్శించారు. ఇల్లీగల్ మైనింగ్ వ్యవహారంపై హౌస్ కమిటీ ఏర్పాటు చేసి విచారణ జరపాలని వారు గట్టిగా డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అసెంబ్లీ నిర్వహణపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బయట ప్రతిపక్షాన్ని అసెంబ్లీకి రమ్మని ఆహ్వానించి, లోపలికి వచ్చిన తర్వాత మైక్ ఇవ్వకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. ప్రశ్నోత్తరాల సమయంలో ప్రభుత్వం సమాధానాలు ఇవ్వడం లేదని, జీరో అవర్‌ను కాలక్షేపంగా మార్చారని విమర్శించారు. సాయంత్రం సమయంలో ఎలాంటి చర్చ లేకుండా బిల్లులను తొందరపడి ఆమోదించుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు దాటినా ఇంకా కేసీఆర్ గురించే మాట్లాడుతుండటం ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. తమ పార్టీ నేత హరీష్‌రావు బయటపెట్టిన అక్రమ మైనింగ్ అంశంపై హౌస్ కమిటీ వేసి విచారణ జరపాలని డిమాండ్ చేసినా ప్రభుత్వం స్పందించడం లేదని అన్నారు. పర్మిషన్ లేకుండా మైనింగ్ జరుగుతుంటే జరిమానా విధించడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. పెనాల్టీ వేసామని చెప్పడమే కాకుండా సంబంధిత కంపెనీలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందని అన్నారు. సభలో లేని వ్యక్తుల పేర్లు ప్రస్తావించకూడదనే నిబంధన ఉన్నప్పటికీ హరీష్‌రావు కుటుంబ సభ్యుల పేర్లు తీసుకురావడం తగదని మండిపడ్డారు. మాజీ మంత్రి సునీతా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యులకు మాట్లాడే అవకాశం ఇవ్వకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలు లేవనెత్తుతుంటే గొంతు నొక్కుతున్నట్లుగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈరోజును బ్లాక్ డేగా భావిస్తున్నామని పేర్కొన్నారు. అక్రమ మైనింగ్‌పై హౌస్ కమిటీ కోరితే ప్రభుత్వం ఎందుకు భయపడుతోందని ప్రశ్నించారు. తమ డిమాండ్‌కు సీబీసీఐడీ విచారణ అంటూనే, తమ నాయకుల కుటుంబ సభ్యులపై మాత్రం హౌస్ కమిటీ వేస్తామని చెప్పడం అన్యాయమని అన్నారు. మంత్రులను ప్రశ్నిస్తే కులం అంశాన్ని తీసుకువస్తూ అసలు సమస్యను మళ్లిస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... అసెంబ్లీలో తమకు ఒక్క నిమిషం కూడా మాట్లాడే అవకాశం ఇవ్వలేదని అన్నారు. రాజేంద్రనగర్ మానస హిల్స్ ప్రాంతంలో అనుమతులు లేకుండా వందల కోట్ల రూపాయల అక్రమ మైనింగ్ జరుగుతోందని ఆరోపించారు. పర్మిషన్ లేదని చెబుతూ జరిమానాలు విధించడం ఏమిటని ప్రశ్నించారు. అలాంటి మైనింగ్‌ను సీజ్ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిందని అన్నారు. అదేవిధంగా, కొన్ని అంశాల్లో ప్రభుత్వం డబుల్ స్టాండర్డ్స్ పాటిస్తోందని, ఒకరిపై ఒక విధానం, ప్రతిపక్షంపై మరో విధానం అనుసరిస్తోందని విమర్శించారు. అక్రమ మైనింగ్ వ్యవహారంపై హౌస్ కమిటీ ఏర్పాటు చేసి పూర్తి స్థాయి విచారణ జరపాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

గోదావరి పుష్కరాలపై 20 రోజుల్లో నివేదిక ఇవ్వండి

మొదటిపేజీ తరువాయి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరివాహక ప్రాంతంలోని ప్రధాన ఆలయాలు, పుష్కర ఘాట్ల అభివృద్ధిపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. సమీక్షలో బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానం నుంచి భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం వరకు ఉన్న ఆలయాలు, ఘాట్ల అభివృద్ధిపై ప్రత్యేకంగా చర్చించారు. పుష్కరాల నాటికి పూర్తి చేయాల్సిన పనులపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. పుష్కరాల నిర్వహణకు అనువైన ప్రదేశాల గుర్తింపునకు టెక్నికల్ ఇంజనీర్ల కమిటీని నియమించాలని సీఎం ఆదేశించారు. ఈ కమిటీ క్షేత్ర స్థాయిలో పర్యటించి 15-20 రోజుల్లో నివేదిక ఇవ్వాలని సూచించారు.

మూడు దశల్లో ప్రణాళిక అమలు

ఇంజనీర్ల కమిటీ నివేదిక, అధికారుల కమిటీ సమీక్ష, కేబినెట్ సబ్ కమిటీ ఆమోదం.. ఈ ప్రక్రియ అనంతరం కేబినెట్ తుది నిర్ణయం తీసుకుంటుందని సీఎం తెలిపారు. పుష్కరాల కోసం చేపట్టే పనులను శాశ్వత, తాత్కాలికంగా విభజించి ప్రాధాన్యతల ఆధారంగా పూర్తి చేయాలని సీఎం సూచించారు. వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం ప్రజా భవన్‌లో ప్రత్యేక వార్ రూమ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఘాట్ల విస్తరణ – రోడ్ల కనెక్టివిటీపై దృష్టి

పుష్కరాల ఏర్పాట్లలో భాగంగా ప్రధాన ఆలయాలు, పర్యాటక ప్రాంతాల్లో ఘాట్ల విస్తరణ, రోడ్లు, రవాణా కనెక్టివిటీ తదితరఅంశాలపై ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. ఈ సందర్భంగా బాసర శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానం అభివృద్ధి, విస్తరణకు సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను అధికారులు సమర్పించారు. దానిపై సీఎం పలు సూచనలు చేశారు.

కేటీఆర్‌తో రేవంత్ రెడ్డి కుమ్మక్కు

- ఇద్దరి మధ్య డీల్ కుదిరింది
- అందుకే కేటీఆర్ అవినీతి కేసుల జోలికే పోవడం లేదు
- కవితతో కేటీఆర్ సంధికి ప్రయత్నిస్తున్నారు
- హరీష్ ను మాత్రమే టార్గెట్ చేస్తున్నారు

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 29: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో సీఎం రేవంత్ రెడ్డి కుమ్మక్కు అయ్యారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన ఆరోపణలు చేశారు. అందుకే కేటీఆర్ పైనున్న అవినీతి కేసుల జోలికి పోవడం లేదని చెప్పారు. కల్వకుంట్ల కవిత, కేటీఆర్ సయోధ్య కుదుర్చేందుకు రేవంత్ రెడ్డి మధ్యవర్తి పాత్ర పోషిస్తున్నరని తెలిపారు. కేవలం హరీష్ రావును మాత్రమే టార్గెట్ చేస్తూ కాళేశ్వరంలోని కొంత భాగం అవినీతిపై మాత్రమే మాట్లాడుతున్నారని చెప్పారు. కాళేశ్వరంలో జరిగిన రూ.లక్ష కోట్ల అవినీతిపై విచారణ జరిపితే మొత్తం బండారం బయపటపడుతుందనే భయంతోనే అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ అవినీతిపైనే విచారణకు పరిమితం అయ్యారని చెప్పారు.



శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మీడియా ప్రతినిధులతో కొద్దిసేపు చిట్‌చాట్ చేశారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో కాళేశ్వరం అంశంపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించగా పై విధంగా స్పందించారు. 'కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కుమ్మక్కు రాజకీయాలు నడిపిస్తున్నాయి. రేవంత్ రెడ్డి, కేటీఆర్ ఇద్దరూ ఒక్కటే. హరీష్ రావుతో జాగ్రత్తగా ఉండాలని కేటీఆర్ కు సీఎం సలహా ఇస్తున్నారు. కాళేశ్వరంపై హరీష్ పై ఉన్నంత పగ కేటీఆర్ పై రేవంత్ కు లేదు. ఎందుకంటే ఈ ఫార్ములా కేసు, డ్రగ్స్, ఫాంహౌజ్ కేసులపై మాట్లాడటం లేదు. కేటీఆర్ పై రేవంత్ కు చాలా ప్రేమ ఒలకపోస్తున్నాడు. కేటీఆర్, కవిత మధ్య సంధి కుదర్చేందుకు యత్నిస్తున్నారు. భవిష్యత్తులో బీఆర్ఎస్ తో కలిసి పోటీ చేయాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నాడు. 100 శాతం కేటీఆర్, రేవంత్ రెడ్డి ఒక్కటే.' అని అన్నారు. 'కేసీఆర్ పై ఉన్న కోపం కూడా రేవంత్ కు పోయింది. ఇద్దరి మధ్య డీల్ కుదిరింది. అందుకే హరీష్‌ను మాత్రమే టార్గెట్ చేస్తున్నారే తప్ప కేటీఆర్ గురించి మాట్లాడటం లేదు. అందుకే హరీష్ రావు ఆలోచించుకోవాలి. కేటీఆర్, రేవంత్ రెడ్డి ఒక్కటా? కాదా? తేల్చుకోవాలి.' అని అన్నారు. 'డీలిమిటేషన్ చేస్తామనేసరికి, 33 శాతం మహిళా రిజర్వేషన్లను అమలు చేస్తామని చెప్పే సరికి రేవంత్ రెడ్డిలో డిప్రెషన్ మొదలైంది. దక్షిణాది, ఉత్తరాది అనే తేడా ఉండదు. బీజేపీకి అన్ని ప్రాంతాలు సమానమే. ఒక విధానం ప్రకారం ముందుకు వెళతామే తప్ప మరొకటి ఉండదు.' అని అన్నారు.

గోసంరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికలు

- ఎన్కేపల్లిలో గోశాల నిర్మాణానికి ఇప్పటికే శంకుస్థాపన
- రాష్ట్రంలో ఆలయాల సమీపంలో గోశాలల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం
- సీఎం రేవంత్ రెడ్డితో మేనకా గాంధీ బృందం భేటీ

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 29: గోసంరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ప్రణాళికలు రూపొందించిందని ముఖ్యమంత్రి రేవంత్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎన్కేపల్లిలో అత్యాధునిక సౌకర్యాలతో గోశాల నిర్మాణానికి ఇప్పటికే శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలు, ఆలయాల సమీపంలో గోశాలల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు రేవంత్ వెల్లడించారు. ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కేంద్ర మాజీ మంత్రి మేనకా గాంధీ బృందం భేటీ అయ్యింది. రాష్ట్రంలో వీధికుక్కల నిర్వహణ, గోసంరక్షణ వంటి అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ట్రై మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని మున్సిపాలిటీల పరిధిలో వీధికుక్కల నిర్వహణ, గోసంరక్షణ చర్యలను మేనకా గాంధీకి సీఎం రేవంత్ రెడ్డి, అధికారులు వివరించారు. మున్సిపాలిటీల పరిధిలో వీధి కుక్కలకు స్టెరిలైజేషన్ వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. ఈ సందర్భంగా జంతు సంరక్షణ విషయంలో తెలంగాణ ప్రభుత్వ చర్యలపై మేనకా గాంధీ సంతృప్తి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సర్కార్ కృషిని ప్రశంసిస్తూ అధికారులు, సీఎం రేవంత్ రెడ్డిని అభినందించారు.

'మానేరు రివర్‌ఫ్రంట్' ప్రతిపాదనలు సిద్ధం చేయండి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అదేశం
- మానేరు రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌పై సమీక్షా సమావేశం
- పాల్గొన్న మంత్రులు ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 29: మానేరు రివర్‌ఫ్రంట్ భూసేకరణ, అంచనా వ్యయం, నీటిపారుదల, పర్యాటక శాఖ కు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ఆదివారం అసెంబ్లీ కమిటీ హాల్ లో మానేరు రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్‌పై కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, ఇరిగేషన్, టూరిజం ఉన్నతాధికారులు హాజరయ్యారు. మానేరు రివర్ ఫ్రంట్ పనుల పురోగతి, పెండింగ్ నిధులు మరియు ప్రాజెక్టు పూర్తికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చ జరిగింది. ప్రాజెక్టును వేగవంతం చేయాలని అధికారులకు మంత్రులు ఆదేశించారు. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులతో క్షేత్రస్థాయి నివేదికలపై ఆరా తీశారు. త్వరలో మానేరు రివర్స్ ఫ్రంట్ పై మంత్రుల క్షేత్ర స్థాయిలో పర్యటన ఉంటుందని వారు తెలిపారు. భూ సేకరణ, అంచనా వ్యయం, నీటిపారుదల, పర్యాటక శాఖ కు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు.

కేరళలో కాంగ్రెస్ కూటమి విజయం ఖాయం

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, మార్చి 29 : కేరళ రాష్ట్రంలో వచ్చే నెల 9న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ స్పష్టమైన మెజార్టీతో అధికారంలోకి రానుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కేరళలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం పతనంతిట్ట జిల్లాలోని అదూర్ అసెంబ్లీ నియోజకవర్గం యూడీఎఫ్ ఎమ్మెల్యే అభ్యర్థి శాంతకుమార్ మద్దతుగా వివిధ ప్రాంతాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత పదేళ్లుగా ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ కూటమి పట్ల ప్రజల్లో స్పష్టమైన మార్పు కనిపిస్తున్నదన్నారు. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమి సాధించిన విజయాలు దీనికి నిదర్శనమని చెప్పారు. గత దశాబ్దంగా అధికారంలో ఉన్న ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని మంత్రి ఆరోపించారు. అభివృద్ధి పేరుతో ప్రచారం మాత్రమే జరిగిందిగానీ, ప్రజలకు అందిన ఫలితాలు తక్కువగానే ఉన్నాయని విమర్శించారు. 'పదేళ్ల పాలన తర్వాత కూడా నిరుద్యోగం పెరుగుతుంటే, ప్రజలపై ఆర్థిక భారాలు అధికమవుతుంటే.. అది ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం కాదా?' అని మంత్రి ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా మతపరమైన రాజకీయాలతో ప్రజలను విభజించే ప్రయత్నం జరుగుతోందని, కేరళలో ఆ పార్టీకి స్పష్టమైన అభివృద్ధి దిశ లేదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, సామాజిక న్యాయం, సెక్యులర్ విలువలను కాపాడగల శక్తి కాంగ్రెస్‌కే ఉందని, ఈ ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పుతో కాంగ్రెస్ కూటమికి విజయం అందిస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దళితులను చిన్నచూపు చూస్తారు. కనువిప్పు కలగాలనే ఎస్సీని స్పీకర్ చేశాము. దళితుడిని మైక్ కావాలని కోరాల్సి వస్తుందని కేసీఆర్‌సభకు రావట్లేదు. దొర బిడ్డనై ఉండి దళితుడి ముందు కింద కూర్చోవాలా? అనే అహంకారంతోనే రావట్లేదు. అహంకారమో, వయసు మీద పడిందని ఆయన్ను కొన్ని విషయాల్లో వదిలేసినా, సభకు వచ్చిన బీఆర్ఎస్‌నేతల తీరు సరిగా లేదు.

- సీఎం రేవంత్ రెడ్డి

బహుళ

విశ్లేషణ

కొన్ని కథలు, పాటలు ఎందుకు బాగుంటాయి?

బి.ఎస్ రాములు
8331966987

కొన్ని కథలు నవలలు పాటలు కవితలు ఎందుకు బాగుంటాయి? కొన్ని కొందరికి ఎందుకు నచ్చవు? మీ బతుకులు మేమెందుకు చదవాలి? అని పేదల బతుకులు, బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ బతుకులు కష్టాలు కన్నీళ్లు చిత్రించినపుడు పత్రికల సంపాదకులు వెనక్కి పంపుతారు. ఒకటి అలా ప్రచురిస్తే కొందరు పాఠకులు కూడా మీ కథలు ఎందుకు చదవాలి? ఎందుకు ఇలాంటి కథలు వేస్తారు..? అని ప్రశ్నిస్తారు. మరి ఇంత కాలం మీ జీవితాల కథలు నవలలు, సినిమాలు, టీవీ సీరియల్స్ చదువుతున్నాం, చూస్తున్నాము. మేము అట్లా ఎన్నడు అన లేదు గదా? అంటారు వీరు. 1992లో దరకమే ఐక్య వేదిక ఏర్పాటయ్యాక ఈ చర్చ సీరియస్ గా మారింది. దళితుడిని మా రెడ్ల అమ్మాయి ప్రేమించిందని రాస్తారా? అని విరుచుకు పడ్డారు. చలం తన కాలంలో బ్రాహ్మణ మహిళలను ముస్లింలు లేపుక పోయారన్నట్టు రాసారు. ఇపుడలా రాస్తే ఎంత గొడవో!

దరకమే తెచ్చిన మార్పు

దరకమే ఐక్య వేదిక మొదటి రాష్ట్ర మహా సభలు తెలుగు సాహిత్యంలో, విజన్ లో ఒక గొప్ప మలుపు. 1993 ఫిబ్రవరిలో మహా సభలు జరిగిన ఉత్తేజంతో వేసవి సెలవుల్లో హుస్నాబాద్లో ఆరు రోజుల పాటు కథ వర్క్ షాపు జరిగింది. దాంతో వర్క్ షాపు లకు సిలబస్ వుండాలి అర్థమైందా. అలా 1998లో కథల బడి కథా సాహిత్య అలంకార శాస్త్రం రాసాను. వందలాది యువర చయితలకు ఒక మార్గం చూపింది. సాహిత్యం జీవితం గెలుచుకోవడానికి ధైర్యాన్నివ్వాలి. ఆత్మ విశ్వాసం కలిగించాలి. కథ, నవల చదివితే వ్యక్తిత్వం, ఆలోచనా పరిధి వికసించాలి అని దరకమే ఐక్య వేదిక ముందుకు తెచ్చింది. కథా వస్తువును మార్చింది. దృష్టికోణాన్ని మార్చింది. బహుజనుల దృష్టితో సమాజాన్ని సాహిత్యాన్ని చూడడం ముందుకు తెచ్చింది. అందుకే కొందరు ఎందుకు నచ్చరో వారి కులం గుణం స్వభావం కథ చదవడంలో కూడ ఎలా కొనసాగుతున్నాయో ఈ విషయం తేట తెల్లం చేసింది. అట్లా నచ్చని వాల్లు కూడా మెచ్చే విధంగా వారి మనసును ఆకట్టుకునే విధంగా రాయడం రచయిత నైపుణ్యానికి నిదర్శనం. అల్లం శేషగిరిరావు రావు వేట కథలు, డాక్టర్ కేశవ రెడ్డి నవలలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఆదివాసుల గురించి గోపీనాథ్ మొహంతితో రాసిన అమృత సంతానం అందరినీ చదివించింది. ఈ నైపుణ్యం సాధించడాన్ని శిల్ప నైపుణ్యం అంటారు.

శిల్పం అంటే కథ చెప్పే తీరు

ఆకర్షణీయంగా, పెళ్లిచూపులకు అందంగా అలంకరించినట్టుగా కథను నవలను తీర్చి దిద్దడం ఒక కళ. మానవీయ సెంటిమెంట్లు, స్పందనల కదిలించడం హృదయాన్ని కరిగించడం ఒక కళ. ఒకే కథ ఒకరు చెప్తే బాగుంటుంది. వేరొకర్నా చెప్తే చప్పగా వుంటుంది. ఎవరైనా ఇంట్లో వున్నపుడు అనేక పనుల్లో మామూలుగా వుంటారు. కథగా రాసేటపుడు ప్రతిది ఆకర్శణీయంగా ఆకట్టుకునేదిగా వుండాలి. ఇదే శిల్పం అంటే!

జీవిత కథ మారక పోయినా శిల్పం మారుతుంది

ప్రేమ కథలు నవలలు సినిమాలు ఎన్ని చూసినా సమస్యలు ప్రేమలు సంఘర్శణ ఓ పది రకాలుండవచ్చు. కాని చెప్పే తీరు చూపే తీరు ఎన్నో రకాలు. అదే శిల్పం. అదే ప్రెజెంటేషన్. సాహిత్యంలో వస్తువు, శిల్పం గురించి ఎప్పటికప్పుడు కొత్త చర్చలు, కొత్త కోణాలు చర్చించ పడుతుంటాయి. వస్తువు శిల్పం, కథ నవల, సినిమా, ఏదైనా పాఠకుల కోసమే, ప్రేక్షకుల కోసమే. అందువల్ల వస్తువు, శిల్పంతో పాటు సాహిత్య ప్రయోజనం చర్చ ప్రధానమవుతుంది. సాహిత్య ప్రయోజనం అనగానే పాఠకులెవరు.? ప్రేక్షకులెవరు? ఎవరి కోసం రాస్తున్నారు, ఎవరి కోసం తీస్తున్నారు అనేవి ముందుకు వస్తాయి. కథా వస్తువుతో పాటు ఉద్దేశించిన పాఠకులు, ప్రేక్షకులు అనేవి ముఖ్యమవుతాయి. వృద్ధుల గురించి రాసే కథ పిల్లల కోసం కావచ్చు. వృద్ధుల కోసం కావచ్చు. ఇద్దరి కేసముద్రం కావచ్చు. దీన్నిబట్టి కథ ప్రెజెంటేషన్ మారుతుంది. అనగా శైలీ శిల్పం ఎంచుకోవాల్సి వుంటుంది. అనగా పాఠకులను బట్టి శిల్పం మలుచుకోవలసి వుంటుంది. ఉపన్యాసాల్లో కూడా శ్రోతలను బట్టి మాట్లాడే తీరు, చెప్పేతీరు మారుతుంది. కనక వస్తువు ఒకటే అయినా ఇలా శిల్పం వైవిధ్యం గా వుంటుంది.

దేని గురించి రాయాలనుకున్నది నిర్ణయమైనా తరువాత మిగతాదంతా శిల్పమే

వస్తువు లేకుండా శిల్పం అవసరం వుండదు. వస్తువు అంటే నీవు చెప్ప దలుకున్నది. ఏదో చెప్ప దల్చుకున్నది లేకుండా శిల్పం ఎలా వుంటుంది? కథ నవల సినిమా ప్రకియలో కథ అంటే పొడుపు కథ లా కథను విప్పుకుంటూ పోవడం. బాటసారి రోడు కిరువైపులా చూస్తూ సహ ప్రయాణికులతో కలిసి నడుస్తూ పోతూ కథ నడపడం వంటిది కథ నిర్మాణం.

కవిత పాట

బహుశా కవిత్వంలో ముఖ్యంగా వచన కవిత్వంలో శిల్పం ద్వారా కవిత్వం ప్రామాణీకరణ పొందుతున్నది. అలా లేక పోతే ఇది ఉత్త వచనంలా వుంది కవిత్వం లేదు అంటారు. పాటలో ట్యూన్, పాడే గొంతు, పక్క సంగీత లయలు ప్రాధాన్యంతో ప్రదర్శనతో, పల్లవిని మల్లీ మల్లీ అందుకోవడం మొదలైన వాటితో ఆకర్శిస్తున్నది. బుల్లెట్ బండెక్కి వచ్చేత్త పా! అనే పాట యాభయి కోట్ల మంది విన్నారు చూసారు. ఆడ పిల్ల హృదయాన్ని గొప్పగా వ్యక్తం చేసిన పాట! అలాగే రాను బొంబాయికి పాట డెబ్బయి కోట్ల మంది విన్నారు చూసారు. హం రాజ్ లోని హే నీల గగన్ కే తలే ధర్తీకో ప్యార్ కరే పాట దశాబ్దాలుగా కోట్ల మంది చూస్తున్నారు. బాహు బలి సినిమా లో కథను ప్రెజెంట్ చేసిన తీరుతో ప్రపంచం అంతా మెచ్చింది. ఆ కథను చందమామ కథలా రాస్తే ఏ ప్రత్యేకత లేని వందల కథల్లో ఒకటి. శిల్పం వల్లే బాహు బలి నిలిచి గెలిచింది. అదే ప్రెజెంట్ చేసిన తీరు సస్పెన్స్, డిటెక్టివ్ నవలలు సినిమాలు శిల్పం వల్లే కోట్ల మంది చూస్తున్నారు చదువుతున్నారు. అన్నిటిలో కథలు మూడు నాలుగు రకాలే.! కాని చెప్పే / చూపే తీరును అనుసరించి అన్నీ చదువుతున్నారు. చూస్తున్నారు. అనగా శైలి శిల్పం ప్రాధాన్యత వహిస్తున్నది.

వస్తువును ఎన్నుకున్నాక ఇక చేయాల్సిందంతా శిల్పమే!

ప్రేమ కథలు నవలలు, సినిమాలు వందలు వేలు. కాని అవన్నీ నాలుగైదు రకాలే. అయినా శిల్పం బలంతో వింటారు చదువుతారు చూస్తారు. సినిమా రంగంలో కథ ని సింగిల్ లైన్లో చెప్పు అంటారు. ఓపెన్ ఎండ్ క్లోజ్ ఎండ్ అంటారు. ఫస్టు హాఫ్ సెకండ్ హాఫ్ గా బ్యాలన్సు చేయాలి. ఇదంతా శిల్పానికి సంబంధించిన వ్యవహారమే. సినిమా ఎడిటింగ్ కూడా శిల్పంలో భాగమే. అనగా కథ నవల కవిత ఎడిటింగ్, రీ రేటింగ్ కూడా శైలీ శిల్పంలో భాగమే. వ్యాసంలో / వార్తా రచనలో కూడా శిల్పమే ప్రధానం. వస్తువు నిర్ణయమైనా క మిగతా అంతా శిల్పమే. కనక బాగా చదవాలి. పరిశీలించాలి. ప్రాక్టీసు చేయాలి. ప్రయోగాలు చేయాలి.

ఎక్కువ చదివి పోజులు కొట్ట కూడదు

ఎక్కువ చదివితే సృజనాత్మకత పోతుందని, సున్నితత్వం పోతుందని కొందరు ప్రచారం చేస్తుంటారు. అది పొరపాటు మాట. బాగా అధ్యయనం చేసిన వారి రచనలు చిక్కదనంతో సాంద్రత గాఢత, సమగ్ర సామాజిక పరిణామాల చిత్రణతో పాఠకులను ఆకట్టుకుంటాయి. మనమీ రచన చదివి చాలా నేర్చుకున్నాము అనుకుంటారు. అధ్యయనం లేని రచనలు ఇంత పరిణతి సాధించవు. ఎక్కువ చదివి అహంకారాన్ని పెంచుకుంటే రాయడం తగ్గి సమీక్షలు రాస్తారు. కొందరు ఎక్కువ చదివి వాడెంత వీడెంత ఏం రాసాడు బోడిరాతలు అనుకోవచ్చు. అనగా వారిలో సహృదయత లోపించింది. మున్షీ ప్రేంచంద్, టాగూర్, శరత్ బాబు! బాగా జీవితాన్నిఅధ్యయనం చేసి రాసారు. చిన్న కథలకు చెహోవ్! 1. సెంటిమెంట్లను పట్టుకోవాలి 2. ఆపిల్ ముక్క ఎంత చిన్నదైనా మొత్తం ఆపిల్ రుచి చెపుతుంది. 3. ఎక్కువ చదివి రాసిన చిన్న కథ కూడా ఇంతే! అందువల్ల కథలు నవలలు కవితలు పాటలు బాగుండాలంటే పై విషయాల్లో నైపుణ్యం పెంచుకోవాలి.

(వ్యాస రచయిత వ్యవస్థాపక అధ్యక్షులు, దరకమే ఐక్య వేదిక)

పరిచయం

సామాజిక దృక్పథం, స్త్రీవాదం మెరిసే అక్షర దివిటీ

తమిళ రచయిత్రి అంబై

డా టి.రాధాకృష్ణమాచార్యులు
9849305871

అంబైకలం పేరుతో రచనలు చేసే ఆమె అసలు పేరు చంద్రప్రభ సీతారామన్ లక్ష్మి. ఆమె ఒక ప్రసిద్ధ తమిళ రచయిత్రి, అంబైగా కూడా ప్రసిద్ధి చెందారు. ఆమె ఒక ప్రఖ్యాత రచయిత్రి, స్త్రీవాది. ఆమె వ్యక్తిగత జీవితం తెరిచిన పుస్తకాన్ని తలపిస్తుంది. సి.ఎస్ లక్ష్మి 1944లో తమిళనాడులోని కోయంబత్తూరులో జన్మించారు. ఆమె ఆమె బెంగళూరు విశ్వవిద్యాలయం నుండి బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్, మద్రాస్ క్రిస్టియన్ కళాశాల నుండి మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్, న్యూఢిల్లీలోని జవహర్లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం నుండి పిహెచ్డి పట్టాలను పొందిన ఆమె ముంబై, బెంగళూరులో పెరిగారు. జీవితంలో ఎంతైనా కొంత మార్పుకు దోహదం చేస్తుందనే ఆశతో చెన్నైలో చదువుకోమని అంబైకి చెప్పిన తన తల్లి నుండి ఆమె గొప్ప స్ఫూర్తిని పొందింది.1956లో విఫలమైన విప్లవం కారణంగా హంగేరి నుండి పారిపోతున్న శరణార్థుల పట్ల అమెరికా విధానంపై ఆమె సిద్ధాంత వ్యాసం రాశారు. విద్యను పూర్తి చేసిన తర్వాత, ఆమె తమిళనాడులో పాఠశాల ఉపాధ్యాయురాలిగా మరియు కళాశాల లెక్చరర్గా పనిచేశారు. ఆమె చిత్ర నిర్మాత అయిన విష్ణు మాథుర్‌ను వివాహం చేసుకుని ముంబైలో నివసిస్తున్నారు. ఆమెలో వైవిధ్య సృజనాత్మక విద్యా వృత్తిలో రాణించిన గొప్ప అకామీషియన్ స్ఫూర్తి ప్రేరణలను చూడవచ్చు.డా.సి.ఎస్ లక్ష్మి ముప్పై సంవత్సరాలకు పైగా మహిళా అధ్యయనాల రంగంలో స్వతంత్ర పరిశోధకురాలిగా ఉన్నారు. ఆమె తమిళ కల్పనా సాహిత్యాన్ని ప్రచురించడానికి అంబై అనే కలం పేరును వాడితే, ది హిందూ, ది టైమ్స్ ఆఫ్ ఇండియా వార్తాపత్రికలలో, ఎకనామిక్ అండ్ పొలిటికల్ వీక్లీ జర్నల్స్‌లో తన పరిశోధన పనులు మరియు ఇతర వ్యాసాలను ప్రచురించడానికి తన అసలు పేరు డాక్టర్ సి. ఎస్. లక్ష్మి ఉపయోగిస్తారు. 1992లో ఆమె చికాగో విశ్వవిద్యాలయంలో ఇన్‌స్టిట్యూట్ ఫర్ కల్చర్ అండ్ కాన్షియస్‌నెస్‌లో విజిటింగ్ ఫెలోగా ఉన్నారు. రోజా ముత్తయ్య చెట్టియార్ యొక్క పుస్తకాల సేకరణ మరియు ఇతర ప్రచురిత సామగ్రిని విశ్వవిద్యాలయం సేకరించేలా ఒప్పించడం ద్వారా రోజా ముత్తయ్య రీసెర్చ్ లైబ్రరీ (RMRL) స్థాపనలో ఆమె పాత్ర కీలకం, ఉత్ప్రేరకం కూడా. ఆమె ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్‌లో రీసెర్చ్ ఆఫీసర్‌గా న్యూఢిల్లీలో కళాశాల లెక్చరర్‌గా పనిచేశారు. 1990వ దశకంలో, ఆమె ఫోర్డ్ ఫౌండేషన్ ప్రాయోజిత 'తమిళనాడులో మహిళల సచిత్ర సామాజిక చరిత్ర' అలాగే హోమీ జె. భాభా ఫెలోషిప్ ప్రాయోజిత 'నిశ్శబ్దపు జాతీయం: ఒక మౌఖిక చరిత్ర మరియు చిత్ర అధ్యయనం' అనే రెండు పరిశోధన ప్రాజెక్టులలో పనిచేశారు. దీని ఫలితంగా వచ్చిన పరిశోధన 'సెవెన్ సీస్ & సెవెన్ మౌంటెన్స్' సిరీస్‌లో రెండు సంపుటాలుగా ప్రచురించారు. మొదటి సంపుటం, 'ది సింగర్ అండ్ ది సాంగ్' 2000లో, మహిళా సంగీతకారులతో చేసిన ఇంటర్వ్యూల సంకలనం కాగా, రెండవ సంపుటం 'మిర్రర్స్ అండ్ గెశ్చర్స్' 2003లో మహిళా నృత్యకారులతో చేసిన ఇంటర్వ్యూల సంకలనం. 1988లో డా.లక్ష్మి మహిళా రచయితలు మరింకా కళాకారుల కృషిని నమోదు చేయడానికి, భద్రపరచడానికి SPARROW (సౌండ్ అండ్ పిక్చర్ ఆర్కైవ్స్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఉమెన్) అనే ప్రభుత్వేతర సంస్థను (NGO) స్థాపించారు. SPARROW మహిళా కళాకారులు మరియు రచయితలపై అనేక పుస్తకాలను ప్రచురించింది. 2009 నాటికి ఆమె ఆ సంస్థకు డైరెక్టర్‌గా, మరి దాని ధర్మకర్తల మండలి సభ్యురాలిగా కొనసాగారు. ఆమె మిచిగాన్ విశ్వవిద్యాలయం యొక్క గ్లోబల్ ఫెమినిజమ్స్ ప్రాజెక్ట్‌లో ప్రస్తుత సభ్యురాలు.ఆమె తనను తాను "కాంప్రమైస్ లేకుండా జీవించిన స్త్రీవాది"గా భావించడమే కాదు ఆమె ఆలోచన సృజన కూడా "అన్ కాంప్రమైజ్డ్"గా కనిపించేలా చేస్తుంది.'(అంధి మాలై'), ఇది 1966లో వెలువడింది. దీనికి "కళైమగళ్ నారాయణస్వామి అయ్యర్" బహుమతి లభించింది 'కనైయళి' అనే సాహిత్య పత్రికలో 1967లో ప్రచురితమైన 'రెక్కలు విరిగిపోతాయి' ('సిరగుకల్ మురియుమ్') అనే చిన్న కథతో ఆమె విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. ఈ కథ తరువాత 1976లో అదే పేరుతో ఒక చిన్న కథల సంకలనంలో భాగంగా పుస్తక రూపంలో ప్రచురించబడింది. అదే సంవత్సరం తమిళ మహిళా రచయితల రచనలను అధ్యయనం చేయడానికి ఆమెకు రెండేళ్ల ఫెలోషిప్ లభించింది. ఆమె పరిశోధన గ్రంథం 1984లో 'ది ఫేస్ బిహైండ్ ది మాస్క్' (అడ్వెంట్ బుక్స్) పేరుతో ప్రచురించబడింది. 1988లో ఆమె రెండవ తమిళ కథా సంకలనం 'ఇంటి మూలలో ఒక వంటగది' ('వీటిన్ మూలైయిల్ ఒరు సమైయలరై') ప్రచురించబడింది. ఇది ఆమెను ఒక ప్రముఖ కథా రచయిత్రిగా నిలబెట్టింది. ఆమె రచనలు స్త్రీవాదం, విషయాలపై దృష్టి, మరియు వ్యంగ్యభావం వంటి లక్షణాలను కలిగి ఉంటాయి. 1992లో వచ్చిన 'ఎ పర్పుల్ సీ' ,మరి 2006లో ప్రచురించిన 'ఇన్ ఎ ఫారెస్ట్, ఎ డీర్' వంటి అంబై రచనలు కొన్నిటిని లక్ష్మీ హోల్మ్‌స్ట్రోమ్ ఆంగ్లంలోకి అనువదించారు. 2006లో ఆమె లక్ష్మీ హోల్మ్‌స్ట్రోమ్‌తో కలిసి 'ఇన్ ఎ ఫారెస్ట్, ఎ డీర్' రచనకు వోడాఫోన్ క్రాస్‌వర్డ్ బుక్ అవార్డు (భారతీయ భాషా కల్పన అనువాద విభాగంలో) గెలుచుకున్నారు. తమిళ సాహిత్యానికి ఆమె చేసిన సేవలకు గాను, కెనడాకు చెందిన తమిళ లిటరరీ గార్డెన్ వారు అందించే 2008 జీవిత సాఫల్య పురస్కారం (ఇయల్ విరుద్ధు)ను ఆమె అందుకున్నారు. 2021లో ఆమె తన చిన్నకథల సంకలనం 'శివప్పు కఝుతుడన్ ఒరు పచ్చై పరవై'కి భారతదేశపు అత్యున్నత సాహిత్య పురస్కారమైన సాహిత్య అకాడమీ అవార్డును గెలుచుకున్నారు.ఆమె 2023 లో శక్తిభట్ సాహిత్య పురస్కారం అట్లనే టాటా సాహిత్య జీవిత సాఫల్య పురస్కారాన్నీ అందుకున్నారు. అయితే అవార్డులను మించి ఆమె పాఠకుల ప్రశంసనీయ రివార్డ్స్ అందుకోవడం విశేషం. తమిళ రచయిత్రి అంబై (డా. సి.ఎస్.లక్ష్మి) స్త్రీవాద సాహిత్యానికి, స్త్రీల జీవితానుభవాలను అద్భుతంగా చిత్రీకరించడంలో ప్రసిద్ధి చెందారు. ఆమె రచనలు తెలుగులోకి కూడా అనువదించబడ్డాయి.

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula@gmail.com

99121 99844

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

కవిత

వసంత 'కోకిల'నిలా వసంత నవరాత్రులలో..

"ఏ దివిలో విరిసిన పారిజాతమో"
"సిరిమల్లె పూవే" ధవళ వస్త్రధారణలో
"తొలిసారి మిమ్మల్ని చూసింది మొదలు"
"గానకోకిల" శిష్టల జానకమ్మను విశాఖ నెల్లూరు నేడిలా
విశాఖయందు మూడవసారి కలిసిన శుభవేళ
శ్రీరామనవమి చేరువలో ఈ ప్రత్యక్ష జానకమ్మ దర్శనం
ఒక గంట సమయంపాటు ఆపేక్షపూరిత ఆర్ద్రత నిండిన
ఆరోగ్యకర వాతావరణంలో
కబురులతో గడిపిన మా దంపతులకు పలు పల్లవులు
ఆలపించే భాగ్యమూ
"కలైమామణి" కాలిగోటికి సరితూగని మా పాటలకు

స్వచ్ఛమైన ప్రశంసలు
ఇలా సాగిన పయనం నేటికీ ఆ కంఠం సుమధురం ఆ
హృదయం మృదుమధురం

ఉండవిల్లి సుజాతా మూర్తి,
వ్యాఖ్యాత్రి,రచయిత్రి మరియు గాయని,
విశాఖపట్నం, 93472 48428

బీరువాలో దాచిన పాత పుస్తకం

బీరువాను తెరిచిన మరుక్షణం
దుమ్ము రేగిన గాలి,
పాత పుస్తకం చేతికి చిక్కి
గుండెలో కదిలింది ఒక స్మృతి.
పసుపు రంగు పులుముకున్న
పత్రాల మీద
చెక్కబడినట్లున్న అక్షరాలు
మెరిసినవి,
కాలం మరువని ప్రేమానురాగాలు
మెల్లగా కదులుతున్నవి.
పుస్తకం తెరిచిన మరుక్షణం
గుండెలో తెరుచుకున్న గతం,
ప్రతి పేజీలో దాగి ఉన్నాయి
నా యవ్వనపు రాతలు.
ఆ పూల వాసన ఇంకా మెత్తగా
వస్తోంది,
నీ చేతుల స్పర్శలా...
నా ఊపిరిని తాకుతున్నట్టు.
కొన్ని పేజీల మూలలు చిరిగి,
మరికొన్ని మచ్చలు పడినా,
ఆ నాటి మాటలు మాత్రం
సజీవంగానే కనిపిస్తున్నాయి.
"నీ కోసం" అని రాసిన
ఆ ఒక్క లైను చూస్తే,
కళ్లలో నీళ్లు సుడులు తిరిగి
గొంతు అడ్డుపడుతోంది.
బీరువాలోని చీకటి
ఇప్పుడు వెలుగులా మారింది,
పాత పుస్తకం చదువుతుంటే
గతం తిరిగి ప్రాణం పోసుకుంది.
నీ నవ్వు, నీ కోపం, నీ మౌనం
అన్నీ ఈ పత్రాల్లో బతికి,
నా గుండె లోతుల్ని తాకుతున్నాయి.
కొన్ని ఆకులు రాలిపడి,
రంగులు మసకబారినా,
ఆ నాటి భావం మాత్రం ఇంకా
తాజాగా ఉంది.
ప్రేమ అంటే ఇదేనా?
కాలం మింగేసినా కూడా,
ఒక్క పుస్తకంలో జీవిస్తూ
జీవితాన్ని మించి నిలబడటం!
బీరువా మూసేస్తే
చీకటి తిరిగి రావచ్చు,
కానీ గుండెలో మాత్రం
ఆ వెలుగు ఎప్పటికీ ఆరిపోదు.
పాత పుస్తకం ఒక్కటి చాలు,
గతాన్ని తోడు తీసుకొని,
నాటి నిన్ను తడిమి,
భవిష్యత్తును కూడా తాకుతుంది.
ఈ పుస్తకంలోని ప్రతి అక్షరం
నా ఆత్మ, ప్రతి వాక్యం నా ఊపిరి,
ప్రతి పేజీ నా జీవితం.
బీరువాలో దాచిన ఈ రత్నం
కాలాన్ని అధిగమించి,
ఇంకా నన్ను ప్రేమిస్తూ
నిరంతరం నన్ను గుర్తుచేస్తూనే
ఉంటుంది.



రాము కోలా
9849001201

సమీక్ష

అందరికీ ఉపయోగడే మణిపూసలు

కందుకూరి భాస్కర్
9703487088

"శ్రీపద" కలం పేరుతో సాహితీ సేద్యం చేస్తున్న వడిచర్ల సత్యంచే నాలుగు పాదాలతో, మాత్రాఛందస్సులో పాడుకోవడానికి వీలుగా రూపొందించినబడిన కవితా ప్రక్రియ మణిపూసలు. ఈ ప్రక్రియలో ఇప్పటికే అనేకమంది కవులు రచనలు చేస్తున్నారు. ఆ క్రమంలో ప్రముఖ కవి, రచయిత, విశ్రాంత జిల్లా విద్యాశాఖాధికారి శ్రీ నన్నపరాజు రమేశ్వరరాజు కూడా మణిపూసల ప్రక్రియలో కవితలు రాయడం గమనార్హం. అలా రాసిన వాటిలో నుండి కొన్నిటిని ఎంచుకొని "నన్నపరాజు మణిపూసలు" అనే పుస్తకంగా వెలువరించారు. ఈ పుస్తకంలో కవి పలు సామాజిక అంశాలు, ప్రత్యేకమైన దినోత్సవాలు, ప్రముఖ వ్యక్తులకు సంబంధించి చక్కని మణిపూసలను అందించారు. సమకాలీన సంఘటనలను అక్షరబంధం చేస్తూ వివిధ అంశాలను ఎంచుకోవడం జరిగింది. మంచి భావంతో, చక్కని లయతో పాఠకులు అసాంతం చదివించేవిగా ఈ మణిపూసలు ఉన్నాయి. ప్రాచీన సాంప్రదాయ పద్ధతని కొనసాగిస్తూ, శ్రీ గణేశుని ప్రార్థిస్తూ, పుస్తక రచనను ప్రారంభించారు. కవి ప్రస్థావించిన అంశాలు వేటికవే భిన్నంగా ఉన్నాయి.

"శ్వాసలపై ధ్యాస నుంచు
ప్రాణాయామాన్ని పెంచు
అనునిత్యం తప్పకుండ
యోగాను కొనసాగించు!"

"ఆరోగ్యమే మహాభాగ్యం" అనే సూక్తిని ఆచరణలో పెట్టమని ఈ కవిత ప్రోత్సహిస్తోంది. ఈ పంక్తులు యోగా మరియు ప్రాణాయామం యొక్క ప్రాముఖ్యతను తెలుపుతూ, నిత్యం ఆరోగ్యం కోసం మనిషి పాటించాల్సిన క్రమశిక్షణా పద్ధతులను గుర్తు చేస్తున్నాయి.



'నన్నపురాజు మణిపూసలు'
పుస్తక ప్రతులకు.
నన్నపురాజు నీరజాదేవి
9700929582.

"ఆంగ్ల భాష మోజులోన
తల్లడిల్లె తెలుగు కూన
భాషాభిమానులంతా
కదలండిక ప్రతినబూన"

ఆంగ్ల భాషా వ్యామోహంలో పడి మాతృభాషను నిర్లక్ష్యం చేస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో, తెలుగు భాషా రక్షణ కోసం ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని ఈ కవిత భాషాభిమానాన్ని మేల్కొల్పుతోంది. అక్షరాల్లోని ఆవేదన పాఠకుడిని ఆలోచింపజేస్తూ, మాతృభాషను కాపాడుకోవాలనే బాధ్యతను గుర్తు చేస్తోంది.

"అణుబాంబుల తయారు
ఆధిపత్యపు పోరు
ఆగనప్పుడు, శాంతి
ఎండమావుల తీరు!"

ప్రపంచ దేశాల మధ్య సాగుతున్న ఆధిపత్య పోరు మరియు అణ్వాయుధాల తయారీని ఈ కవిత తీవ్రంగ ఖండిస్తుంది. యుద్ధం మరియు విధ్వంసం ఉన్న చోట 'శాంతి' అనేది కేవలం ఒక ఎండమావి లాంటిదే తప్ప అది ఎప్పటికీ లభించదని, ఈ కవిత ప్రపంచానికి ఒక బలమైన హెచ్చరికను మరియు సత్యాన్ని తెలియజేస్తోంది.

"వేదనలో చిక్కినపుడు
హృదయం బరువెక్కినపుడు
ఉద్భవించునొక కవితా
భావాలే ఊరినపుడు!"

కవి హృదయం నుండి కవిత్వం ఎప్పుడు జాలువారుతుందో ఈ పంక్తులు అద్భుతంగా వివరిస్తున్నాయి. మనిషి కష్టాల్లో ఉన్నప్పుడు, మనసు భారమైనప్పుడు కలిగే భావోద్వేగాలే అక్షర రూపం దాల్చి ఒక అమృత కావ్యంగా ఉద్భవిస్తాయని చెప్పడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు.

"ఆత్మహత్యల గోల
అసలు రైతులకేల
పెంచుకో రైతన్న
ఆత్మబలాన్ని చాల!"

అన్నదాతల ఆత్మహత్యలనే సామాజిక వ్యధను ఈ కవిత సూటిగా ప్రశ్నిస్తుంది. కష్టాల్లో ఉన్నప్పుడు కృంగిపోయి ప్రాణాలు తీసుకోవడం పరిష్కారం కాదని, 'ఆత్మబలమును' పెంచుకొని ధైర్యంగా సమస్యలను ఎదుర్కోవాలని ఈ కవిత రైతులకు గొప్ప స్ఫూర్తిని అందిస్తోంది. రైతు ప్రాణం విలువైందని, మనోధైర్యమే అసలైన ఆయుధమని చాటి చెబుతోంది. వివరణ అక్కరలేని రీతిలో నన్నపురాజు రమేశ్వర రాజు రాసిన ఈ సరళ సుందర మణిపూసలు పిల్లలతో పాటు పెద్దలకు కూడా ఉపయోగపడేలా ఉండడం విశేషం.

అసెంబ్లీలో ప్రతిపక్షాన్ని అణచివేస్తున్నారు

- అసెంబ్లీని గాంధీ భవన్‌లా మార్చారు
- ఇల్లీగల్ మైనింగ్‌పై హౌస్ కమిటీ వేయాలి
- మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, మార్చి 29: ప్రజాస్వామ్య విలువలను పక్కనబెట్టి ప్రతిపక్షాన్ని అణచివేస్తున్నారని, అక్రమ మైనింగ్ వంటి కీలక అంశాలపై చర్చ తప్పించేందుకు ప్రభుత్వం దారి మళ్లించే రాజకీయాలు చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. ఇల్లీగల్ మైనింగ్‌పై హౌస్ కమిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్‌ను పునరుద్ఘాటించారు. తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ అసెంబ్లీ నిర్వహణపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం అసెంబ్లీ జరిగిన తీరు ప్రజాస్వామ్యంలో చీకటి రోజుగా భావిస్తున్నామని తెలిపారు. పవిత్రమైన శాసనసభను అధికార దుర్వినియోగంతో గాంధీ భవన్‌లా మార్చారని విమర్శించారు. అక్రమ మైనింగ్ అంశంపై తమ ఉపనాయకుడు హరీష్ రావు ఆధారాలతో సహా అసెంబ్లీలో వివరించారని చెప్పారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకుండా దాన్ని పక్కనబెడుతోందని విమర్శించారు. ఈ అంశంపై హౌస్ కమిటీ వేసి పూర్తిస్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేసినా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీబీసీఐడీ విచారణ అంటున్నారని పేర్కొన్నారు. ఒక మంత్రి హౌస్ కమిటీకి అంగీకారం చెప్తే, ముఖ్యమంత్రి మరోలా మాట్లాడటం ప్రభుత్వంలో సమన్వయం లేదని సూచిస్తోందన్నారు.స్పీకర్‌ను తాము ఎప్పుడూ కుల పరంగా చూడలేదని, కానీ తమ డిమాండ్లపై నిరసన తెలుపుతుంటే దృష్టి మళ్లించేందుకు కుల రాజకీయాలు తెరపైకి తెస్తున్నారని ఆరోపించారు. కడియం శ్రీహరి వ్యవహార శైలిని తీవ్రంగా విమర్శిస్తూ, సభలో ఆర్డర్ లేకపోవడం వల్ల ఇలాంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు. ఎథిక్స్ కమిటీ సరిగా లేకపోయినా, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పై ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేస్తామని చెప్పడం విచిత్రమన్నారు. భట్టి విక్రమార్కపై తమకు గౌరవం ఉందని చెబుతూ, ఆయన పాదయాత్రను గుర్తు చేసిన ముఖ్యమంత్రి ఆయన్నే ముఖ్యమంత్రిగా చేయవచ్చుకదా అని వ్యాఖ్యానించారు. అధికార పార్టీ సభ్యులతో బీఆర్ఎస్‌ను విమర్శింపజేస్తూ సభను తప్పుదారి పట్టిస్తున్నారని ఆరోపించారు. వెనుకబడిన తరగతుల సంక్షేమంపై వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని చెబుతూ వాస్తవంగా అమలు జరగలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి తమను "పండబెట్టి తొక్కుతాం" అన్న వ్యాఖ్యలపై ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేయాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ కూడా హౌస్ కమిటీ కోరిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేస్తూ, తమ డిమాండ్‌ను ఎందుకు అంగీకరించడం లేదని ప్రశ్నించారు. అసెంబ్లీలో చర్చను తప్పుదారి పట్టించి బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేశారని, ముఖ్యంగా ద్రవ్య వినియోగ బిల్లుపై అభ్యంతరం వ్యక్తం చేసినందుకే ఈ చర్య తీసుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న కాలానికి సంబంధించిన విషయాలను విచారణ చేస్తామంటే చేసుకోవచ్చని, కానీ ప్రస్తుత సమస్యలను పక్కనబెట్టి గతాన్ని తెరపైకి తేవడం సరైంది కాదన్నారు. ప్రభుత్వం తీసుకువస్తున్న కొన్ని చట్టాలపై కూడా స్పష్టత లేకపోవడం గమనార్హమన్నారు. దళిత సంక్షేమం కోసం గతంలో కేసీఆర్ అనేక కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. అక్రమ మైనింగ్ అంశంపై హౌస్ కమిటీ ఏర్పాటు చేయడం తప్ప మరో మార్గం లేదని, అదే తమ ప్రధాన డిమాండ్ అని తలసాని స్పష్టం చేశారు. ప్రజలు ఈ పరిణామాలన్నింటినీ గమనిస్తున్నారని, భవిష్యత్తులో తగిన తీర్పు ఇస్తారని హెచ్చరించారు.

నందుపల్లిలో ఉల్లాస్ అమ్మ అక్షరాభ్యాసం ప్రారంభం సందర్భంగా సర్పంచ్ దేశపాగ నర్సింహా

మాణిక్యమ్మ గూడలో అమ్మలకు'అక్షర'పరీక్ష

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి 29: గ్రామీణ ప్రాంతాలలో నిరక్ష రాశులయిన వారిలో అక్షర వెలుగులు నింపడంతో పాటు చదువు మధ్యలో ఆపేసిన ప్రతి ఒక్కరికి విద్య అందించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్యచరణ చేపడుతున్నాయని గ్రామ సర్పంచ్ జెన్నపల్లి పద్మకృష్ణ అన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలోని మాణిక్యమ్మ గూడా గ్రామంలో.. విద్యాశాఖ సెల్ఫ్ ఆధ్వర్యంలో ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ సొసైటీ) పేరుతో స్వయం సహాయక సంఘాల సభ్యులను అక్షరాభ్యాసులుగా తీర్చి దిద్దే ప్రక్రియను గ్రామ సర్పంచ్ మాణిక్యమ్మ గూడా గ్రామపంచాయతీ లో అమ్మలకు అక్షరమాల పరీక్ష కేంద్రాలను ప్రారంభించారు. అలాగే గ్రామంలో ఉన్న ప్రతి మహిళ మహిళా సంఘాలలో ఉన్నప్పటికీ చాలామందికి విద్య లేక ఇబ్బందులు పడుతున్నారు ప్రతి ఒక్కరికి విద్య అందాలి గ్రామంలో ప్రతి ఒక్కరూ విద్యను కలిగి ఉండాలని అన్నారు ఈ యొక్క కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తోపాటు గ్రామ పాలకవర్గ సభ్యులు అంగన్వాడి టీచర్స్ వివోఏ శివనిల, సీసీ మరియు ఆశ వర్కర్ వాలంటీర్లు మహిళా సంఘాల సభ్యులు మరియు గ్రామ పెద్దలు పాల్గొనడం జరిగిందని సర్పంచ్ తెలిపారు.

బీఆర్ఎస్ తుమ్మలూరు గ్రామ శాఖ అధ్యక్షునిగా కటికల శ్రీహరి ఏకగ్రీవం

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి 29: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలోని తుమ్మలూరు గ్రామంలో.. మహేశ్వరం మండల్ ఎస్సీ సెల్ అధ్యక్షులు బూసగాళ్ల జంగయ్య, మాజీ ఉపసర్పంచ్ గంట వెంకట్ రెడ్డి,మాజీ ఉప్పసర్పంచ్ పి గోవర్ధన్,మాజీ ఎంపిటిసి జి నరసింహ, ఆర్ రాజు, ఏ తులసి రెడ్డి, ఆర్ శ్రీనివాస్, ఎన్ శివ, జి వెంకట్ రెడ్డి, వి అడివెయ్య, జి వెంకటేష్, బి శ్రీనివాస్ గౌడ్, పెద్దల ఆధ్వర్యంలో..గ్రామ శాఖ అధ్యక్షునిగా కటికల శ్రీహరి ముదిరాజ్ ని ఏకగ్రీవం గా ఎన్నుకోవడం జరిగింది గ్రామ శాఖ అధ్యక్షులు శ్రీహరి మాట్లాడుతూ... గ్రామంలో పెద్దలు అందరూ సహకరించి ఈ బాధ్యతను అప్పజెప్పినందుకు గ్రామంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలియజేశారు. అధ్యక్షునిలా కాకుండా గ్రామంలో కార్యకర్తల పని చేస్తానని తెలియజేశారు. ఉపాధ్యక్షులుగా పామ్ శేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఏ శ్రీనివాస్, వోళవోజ్ సుభాష్, జెనగే మహేష్ యాదవ్, కోశాధికారులుగా.. ఎర్రవాపు రత్నం యూత్ అధ్యక్షులు, జెనిగే శేఖర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి వొళవోజ్. యోగీ యూత్ ఉప అధ్యక్షులు.రాజమౌని. కొండల్ బీసీ సెల్ అధ్యక్షులు సంపంగి. చిన్న రాజు బీసీ సెల్ ఉప అధ్యక్షులు జెనిగే. కృష్ణ యాదవ్ ప్రధాన కార్యదర్శి ఏర్ల. సురేష్ ఎస్సీ సెల్ అధ్యక్షులు భయగాళ్ల.దర్శన్,ప్రధాన కార్యదర్శి మంచాల కుమార్,మైనార్టీ అధ్యక్షులు షేక్. జంగీర్ మహిళా అధ్యక్షురాలు టీ .సబితా రైతు అధ్యక్షులు మెదిరెడ్డి రంగారెడ్డి సోషల్ మీడియో ఏనుగు. కరుణాకర్, అడ్డెకర్. శ్రీకాంత్, ఎం జంగయ్య,.. టీ రమేష్,మాజీ. ఉప సర్పంచ్. పి గోవర్ధన్. మంచాల రాజు తదితరులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

చలివేంద్రం ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే

ప్రతిపక్షం, ఉప్పల్: మీర్పేట్ హెచ్ బి కాలనీ పరిధిలో నోమ బస్ స్టాప్ పక్కన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఎమ్మెల్యేతో పాటు మాజీ కార్పొరేటర్లు జెరిపోతుల ప్రభుదాస్, గుండారపు శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు. స్వర్గీయ ముస్కె సరస్వతి యాదవ్ జ్ఞాపకార్థంకంగా యాదవ సంఘం ఆధ్వర్యంలో దాత రాజమల్లు యాదవ్ కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ఈ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వాసు గౌడ్, ఉస్మాన్, పాండాల నరసింహ గౌడ్, సంజయ్ నాయక్, కృష్ణ, దయాకర్ మరియు యాదవ సంఘం అధ్యక్షులు అల్లాడి కృష్ణ యాదవ్, పల్లె కుమార్ యాదవ్, గడ్డం కృష్ణ యాదవ్, మల్లేష్ యాదవ్, సూరం రాజేష్ మరియు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సీఎంఆర్ఎఫ్ భరోసా: భీమ్ భరత్

ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 29 : చేవెళ్ల నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన 65 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ పామేన భీమ్ భరత్ ఆదివారం అందజేశారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సహకారంతో ఈ సాయం అందుతోందని ఆయన తెలిపారు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న పేదలకు ఈ నిధి వరంలా మారిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి గౌరి సతీష్, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజా నాయకుడు కొండిగారి రాములు

- 31న మొయినాబాద్‌లో సంతాప సభ
- గోడపత్రికను ఆవిష్కరించిన సీపీఐ నాయకులు

ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 29: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎమ్మెల్యే కొండిగారి రాములు ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని సీపీఐ నాయకులు పిలుపునిచ్చారు. ఈ నెల 31న మండల కేంద్రంలో నిర్వహించనున్న రాములు సంతాప సభకు సంబంధించిన గోడపత్రికను ఆదివారం మండల కార్యదర్శి కే. శ్రీనివాస్ అధ్యక్షతన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా నాయకులు భానోరి సుభాన్ రెడ్డి, మల్గని సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ.. రాములు గారు తన చివరి శ్వాస వరకు నిరుపేదల సంక్షేమం, వెట్టిచాకిరి విముక్తి కోసం అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. 'దున్నేవానికే భూమి' నినాదంతో బడుగు, బలహీన వర్గాలకు భూములు పంచిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ప్రజల కోసం అసెంబ్లీలో ఆయన వినిపించిన గళం నేటి తరం నాయకులకు ఆదర్శమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ముప్పురి వెంకటయ్య యాదవ్, సత్యనారాయణ గౌడ్, టీ నర్సింలు, వడ్డే నర్సింలు, రత్నయ్య, లక్ష్మమ్మ, చంద్రమ్మ, వాణి, అరుణ మరియు అభిమానులు పాల్గొన్నారు.

బిజీ బ్రైన్స్ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

ప్రతిపక్షం, కూకట్‌పల్లి, మార్చ్ 29: అల్విన్ కాలనీ సెకండ్ ఫేస్‌లో ఉన్న బిజీ బ్రైన్స్ స్కూల్ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. విద్యార్థులు ప్రదర్శించిన కుచిపుడి, భరతనాట్యం మరియు ఇతర నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకర్షించాయి. తల్లిదండ్రులు పిల్లలు ఉత్సాహంగా ఈ గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో పాల్గొన్నారు. రాజేష్ బదోని మరియు స్మితా బదోని పిల్లలు అనిరుధ్ బదోని, రుద్ర బదోని ఈ వేడుకలో అవార్డు, షీల్డ్స్ అందుకున్నారు. ప్రిన్సిపాల్ జయ లక్ష్మి, స్టాఫ్ సభ్యులు ఈ వేడుకలో పాల్గొన్నారు.పాఠశాల యజమానులు తెలంగాణ సంస్కృతిని, అన్ని మతాల గురించి విద్యార్థులకు నేర్పుతూ, విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దుతున్నారు.ఈ కార్యక్రమానికి చీఫ్ గెస్ట్‌లుగా చెఫ్ ప్రభాకర్ రావు, శ్రీనివాస్ రావు, విజయ లక్ష్మి, శ్రీధర్, కళ్యాణ్ పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ జయ లక్ష్మి మేడం మరియు స్టాఫ్ సభ్యులు ఈ వేడుకలో పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం

ప్రతిపక్షం, సిద్దిపేట, మార్చి 29: తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిద్ధిపేట నియోజకవర్గ ఇంచార్జి పాసికంటి సత్యం ఆధ్వర్యంలో కాంచిటీ చౌరస్తాలో పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎం. వెంకేశ్వర్ రావు, ఎం.డి. గౌస్, డి. వేణు, డి. మల్లేశం, కె. సతీష్‌గౌడ్, చ. యాదగిరి, డి. శ్రీనివాస్, డి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మా దీవుల్ని, నేలను ఆక్రమించాలని చూస్తే

పర్షియన్ గల్ఫ్ షార్కులకు ఆహారంగా మారతారు

మొదటిపేజీ తరువాయి

తెలిసిందే. భూతల పోరుకోసం ఏకంగా 3,500 ట్రూపుల్ని తరలించినట్లు అమెరికా వెల్లడించింది. అధునాతన యుద్ధ నౌక యూఎస్ఎస్ ట్రిపోలి ద్వారా సైనికులు గల్ఫ్ తీరానికి చేరుకున్నారు. అయితే, అమెరికన్ సైనికుల రాకపై ఇరాన్ ఘాటుగా స్పందించింది. తమ దీవుల్ని, నేలను ఆక్రమించాలని చూస్తే అమెరికన్ సైనికులంతా అక్కడి పర్షియన్ గల్ఫ్ షార్కులకు ఆహారంగా మారడం ఖాయమని హెచ్చరించింది. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ఇరాన్ ఆర్మీ ఒక హెచ్చరిక జారీ చేసింది. ఇరాన్ సైనిక ప్రతినిధి, బ్రిగేడియర్ జనరల్ ఎబ్రహీమ్ జోల్ఫాకరి మాట్లాడిన వీడియోను ఆర్మీ పోస్టు చేసింది. ఈ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌పై కూడా విమర్శలు చేశారు. ట్రంప్‌నకు ఎప్‌స్టీన్‌తో ఉన్న సంబంధాల నేపథ్యంలో ఆయనపై ఇజ్రాయెల్ ఇంటెలిజెన్స్ ఒత్తిడి తెస్తోందని, దీంతో ట్రంప్ దాడులు చేయిస్తున్నాడని ఎబ్రహీమ్ అన్నాడు. ఇజ్రాయెల్‌కు ట్రంప్ తన దేశాన్ని తాకట్టుపెట్టాడని ఆరోపించాడు. మొసాద్ అనే తీవ్రవాద సంస్థ ఒత్తిడికి ట్రంప్ తలొగ్గాడని ఆరోపించాడు. తమపై దాడి చేయాలని చూస్తే అమెరికన్ సైనికులు షార్క్‌లకు ఆహారంగా మారడం ఖాయమని హెచ్చరించారు. ఏదైనా భూతల దాడి జరిగితే అమెరికన్ దళాల అంతానికి కౌంట్‌డౌన్ ప్రారంభిస్తామన్నారు. ఇక, ఇప్పటికే అమెరికన్ దళాలు నౌకలో పశ్చిమాసియా చేరుకున్నాయి. మొత్తం 3,500 ట్రూపుల్లో 2,500 మెరైన్లు ఉన్నారు. గడిచిన 20 ఏళ్లలో ఈ ప్రాంతంలో అమెరికా ఈ స్థాయిలో దళాలను మోహరించడం ఇదే మొదటిసారి.

ఖర్గ్ ఐలాండ్‌ను స్వాధీనం చేసుకున్న అమెరికా

ఇరాన్ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేలా అమెరికా సంచలన చర్యకు దిగింది. ప్రపంచ చమురు రవాణాలో కీలకమైన హర్మూజ్ జలసంధి సమీపంలోని ఇరాన్ 'ఖర్గ్ ఐలాండ్ ' ను అమెరికా దళాలు తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. ఇరాన్ ముడి చమురు ఎగుమతుల్లో దాదాపు 90 శాతం ఈ దీవి నుంచే జరుగుతాయి. ఈ మెరుపుదాడితో ఇరాన్ ఆర్థిక మూలాలను అమెరికా గట్టిగా దెబ్బతీసినట్లయింది. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

ట్రంప్‌కు వ్యతిరేకంగా అమెరికాలో ఉద్యమం

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఏకపక్ష విధానాలపై అమెరికాతో పాటు ప్రపంచ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఎలాంటి కారణం లేకుండానే ఇరాన్‌పై యుద్ధానికి దిగడం, ట్రంప్ తీసుకున్న వలస విధానాలు వంటి వాటిపై అమెరికాలో గతంలో ఎన్నడులేని విధంగా భారీగా ప్రజలు రోడ్ల మీదకు వచ్చి 'నో కింగ్స్' అంటూ నిరసన ప్రదర్శనలు చేపడుతున్నారు. అమెరికాలోని మిన్నెసోటా కేంద్రంగా మొత్తం 50 రాష్ట్రాల్లో 3,100 నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చారు. ఈ నిరసనల్లో సుమారు 90 లక్షల వరకు ప్రజలు పాల్గొంటారని, అమెరికా చరిత్రలోనే ఇది అతి పెద్ద నిరసన అవుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే మిన్నెసోటాలోని కాలిపట్ లాన్‌కు ప్రజలు భారీగా చేరుకొని 'నో కింగ్స్' ప్లకార్డులను ప్రదర్శిస్తూ ట్రంప్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మరోవైపు ఐరోపా, లాటిన్ అమెరికా ఖండాల్లో కూడా ట్రంప్‌కు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టారు. ఐరోపాలో నివసిస్తున్న అమెరికన్లు ట్రంప్‌కు వ్యతిరేకంగా ర్యాలీలు చేపట్టారు.

కొండ్రు యాదగిరి మాదిగ కుటుంబాన్ని పరామర్శించిన మందకృష్ణ మాదిగ

ప్రతిపక్షం, మహేశ్వరం, మార్చి 29: ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు కొండ్రు యాదగిరి మాదిగ అకాల అకాల మరణం గత 30 ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో అలుపెరుగని పోరాటం చేసి స్వర్గస్తులయ్యారు. ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్న ఉద్యమ నాయకుడు కొండ్రు యాదగిరి మాదిగ కుటుంబాని పరామర్శించిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ కొండూరు యాదగిరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ.. మనోధైర్యంగా ఉండాలని కుటుంబానికి అండగా ఎమ్మార్పీఎస్ ఎల్లప్పుడు ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం ఎస్ పి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు, రావుగళ్ల బాబు మాదిగ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ప్రశాంత్ తోపాటు ఎమ్మార్పీఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని చిత్రపటానికి నివాళులర్పించారు.

“

గతంలో కొవిడ్, ప్రస్తుతం యుద్ధాలతో ప్రపంచం అనేక సమస్యలను ఎదుర్కొంటోంది. పెట్రోల్, డీజిల్, గ్యాస్ సంక్షోభం తలెత్తింది. ఈ సమయంలో దేశంలోని 140 కోట్ల మంది ప్రజల ప్రయోజనాలకు విఘాతం కలిగేలా తప్పడు ప్రచారాలు, స్వార్థపూరిత రాజకీయాలు చేయొద్దు. ఫేక్ ప్రచారాన్ని నమ్మొద్దు. ప్రజలు ఐక్యంగా ఉండాలి.
- ప్రధాని నరేంద్ర మోదీ

ప్రాంతీయం

ఎందరినో ఉన్నత శిఖరాలకు చేర్చిన విద్యాసంస్థ పాలిటెక్నిక్ కళాశాల

- కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్
- వరంగల్ ప్రభుత్వపాలిటెక్నిక్‌లో ప్లాటినం జూబ్లీ వేడుకలు

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, మార్చి 29: వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల 70 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో ప్లాటినం జూబ్లీ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. దేశ విదేశాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా కలెక్టర్ & గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ వైస్ చైర్‌పర్సన్ చాహత్ బాజ్ పాయి, ఎన్పీడీసీఎల్ చైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పాలిటెక్నిక్ విద్యతో ఉన్నత శిఖరాలక ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ, వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు అన్ని విభాగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో కూడా ఈ కళాశాలకు చెందిన ఇంజినీర్లు ఉన్నారని తెలిపారు. బీటెక్ చదివిన వారికంటే పాలిటెక్నిక్ చదివిన వారికి ప్రాక్టికల్ నాలెడ్జ్ ఎక్కువగా ఉండి, త్వరగా ఉపాధి అవకాశాలు లభించి స్థిరపడతారని చెప్పారు. రూ.28 కోట్లతో నూతన భవన నిర్మాణానికి సహకరించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కళాశాల నూతన భవన ప్రారంభోత్సవానికి మళ్లీ పూర్వ విద్యార్థులందరూ రావాలని ఆకాంక్షించారు. తన కుటుంబానికి కూడా పాలిటెక్నిక్ విద్యతో అనుబంధం ఉందని, తన తండ్రి పాలిటెక్నిక్ చదివి ఉన్నత ఉద్యోగం సాధించారని, ఆ ప్రేరణతోనే తాను కలెక్టర్ స్థాయికి చేరుకున్నానని పేర్కొన్నారు. కళాశాల అభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ, పాలిటెక్నిక్ విద్యకు గొప్ప ప్రాధాన్యం ఉందన్నారు. డిప్లమా, ఇంజినీరింగ్ మధ్య తేడా లేదని, నైపుణ్యమే విజయానికి మూలమని పేర్కొన్నారు. AI మనుషులను భర్తీ చేయదని, కొత్త సాంకేతికతలను నేర్చుకుని ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. తమ కాలేజ్‌ను "అమ్మ"గా భావిస్తూ భావోద్వేగానికి లోనయ్యారుకార్యక్రమం కన్నులపండువగా సాగింది. కార్యక్రమ విజయానికి సహకరించిన కళాశాల ప్రిన్సిపాల్ డా. బైరి ప్రభాకర్, సంగీత కళాశాల బృందం, పూర్వ విద్యార్థులందరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

జన గణన సమర్ధవంతంగా పూర్తి చేయాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, మార్చి 29: హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో జిల్లాలో త్వరలో ప్రారంభం కానున్న జన గణన పై ఫీల్డ్ ట్రైనర్లకు మూడు రోజుల అవగాహన కార్యక్రమం మే నెలలో ప్రారంభంకానున్న జన గణన ప్రక్రియను ఖచ్చితత్వంతో సమర్థవంతంగా నిర్వహించేందుకు ఫీల్డ్ స్థాయిలో శిక్షణ పొందిన ట్రైనర్లు కీలక పాత్ర పోషించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు హనుమకొండ కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశపు హాలులో జనగణన ఫీల్డ్ ట్రైనర్లకు నిర్వహించిన మూడు రోజుల శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న ట్రైనర్లకు జనగణన నిర్వహణలో పాటించాల్సిన విధానాలు, డేటా సేకరణలో ఖచ్చితత్వం, సమగ్రతపై పలు సూచనలు చేశారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ఫీల్డ్ ట్రైనర్లు ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలపై పూర్తి పట్టు సాధించి, తమ పరిధిలోని మండలాలు, వార్డుల్లో పనిచేసే ఎన్యుమరేటర్లకు స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఇంటిని కవర్ చేస్తూ, సరైన సమాచారాన్ని సేకరించడం ద్వారా జనగణనను విజయవంతం చేయాలని అన్నారు. జనగణనలో సేకరించే సమాచారం ప్రభుత్వ ప్రణాళికలకు, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రామాణిక ఆధారంగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. అందువల్ల ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ట్రైనర్లను కోరారు ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి సత్యనారాయణ రెడ్డి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సిటీ ప్లానర్ రవీంద్ర రాడేకర్, స్టాటిస్టికల్ ఆఫీసర్ సతీష్, మాస్టర్ ట్రైనర్లు రామ్ దయాకర్ రెడ్డి, రమేష్, ఇతర అధికారులు ఆయా మండలాలకు, గ్రేటర్ వరంగల్ పరిధికి కేటాయించిన జన గణన ఫీల్డ్ ట్రైనర్లు పాల్గొన్నారు.

జాతీయ మెగా లోక్‌అదాలత్‌కు అపూర్వ స్పందన

- 4868 కేసుల్లో విజయవంతంగా రాజీ
- సైబర్ నేరగాళ్ల చేతిలో కోల్పోయిన రూ 1.42 కోట్లు తిరిగి బాధితులకు అందేలా కోర్ట్ ఆదేశాలు

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 29 : జాతీయ మెగా లోక్‌అదాలత్ ను ఉద్దేశించి జిల్లా ఎస్పీ ఒక ప్రకటనలో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన, చాలా కాలంగా పెండింగ్ లో ఉన్న, రాజీ పడటానికి అవకాశం ఉన్నటువంటి 717 - ఐపిసి కేసులలో ఇరు వర్గాలను రాజీ కుదిరచడం జరిగిందని, 2722 ఇపెట్టి, 1429 డిడి కేసులలో అడ్మిషన్/ జరిమాజన విధించడం జరిగింది. సైబర్ నేరాలకు సంభందించి జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన 73 సైబర్‌క్రైమ్ కేసులలో రూ: 1.32 కోట్లు, ఎఫ్ఐఆర్ లేకుండా 88 కేసులలో 10.83 లక్షల రూపాయలను తిరిగి సైబర్ బాధితులకు ఇప్పించేందుకు కోర్ట్ నుండి అనుమతి పొందడం జరిగిందని అన్నారు. జిల్లా ప్రజలను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ క్షణికావేశంలో చేసే తప్పులను సరిదిద్దుకోవడానికి లోక్‌అదాలత్ అనేది ఒక మంచి అవకాశం అని, అనవసర గొడవలకు పోయి జీవితాలను ఇబ్బందులపాలు చేసుకోకూడదని అన్నారు. రాజీ మార్గమే రాజా మార్గం అని, రాజీ పడటం ద్వారా ఇరువర్గాలు సమఉజ్జులు ఉంటారని, రాజీ కుదుర్చుకోవడానికి అవకాశం ఉన్న అన్ని కేసులల్లో ఇరు వర్గాలు రాజీపడవచ్చు అన్నారు. 2021లో సంగారెడ్డి మహిళా పోలీస్ స్టేషన్‌లో నమోదైన వరకట్న వేధింపుల కేసులో భార్యాభర్తల మధ్య ఉన్న విభేదాలను పరిష్కరించి, ఐదేళ్లుగా కొనసాగుతున్న సమస్యకు జాతీయ లోక్‌అదాలత్ ద్వారా ముగింపు పలికారు. మురళి -శ్రీలేఖ దంపతులను మళ్లీ ఏకం చేసి కుటుంబాన్ని కలిపారు. ఈ సందర్భంగా వారు సంగారెడ్డి జిల్లా పోలీసులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా పోలీసుల అత్యుత్తమ పనితీరును కొనియాడుతూ, ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడంలో చూపిన కట్టుబాటు, సమన్వయం, సేవా భావం ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఇలాంటి అద్భుతమైన ప్రదర్శనతో జిల్లా పోలీస్ శాఖ ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలపరిచిందని ఎస్పీ గర్వంగా తెలిపారు. జాతీయ లోక్‌అదాలత్ ను విజయవంతం చేసిన అధికారులు పి.పిలు, వర్టికల్ డిఎస్పీ సురేందర్ రెడ్డి, ఇన్స్పెక్టర్ రమేష్, D4C డిఎస్పీ వేణుగోపాల్ రెడ్డి, ఇన్స్పెక్టర్ రవి, లైజనింగ్ అధికారి కె.సత్యనారాయణ ఎస్ఐ, కోర్ట్ డ్యూటీ అధికాలు, సైబర్ సెల్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచే పవిత్ర సందర్భం ఈద్

- కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

ప్రతిపక్షం ప్రతినిధి, హనుమకొండ, మార్చి 29: పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని జమాతే ఇస్లామీ హింద్ హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో హనుమకొండలోని బ్రైనీ స్టార్స్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన ఈద్ మిలాప్ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర కార్యదర్శి ఇశ్రత్ బాను, జిల్లా అధ్యక్షుడు సయ్యదా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ, రంజాన్ నెల ఆత్మశుద్ధి, నియమ నిష్టలకు ప్రతీకగా నిలుస్తుందని, ఈద్ పండుగ ఆధ్యాత్మిక ఆనందాన్ని పంచే పవిత్ర సందర్భంగా నిలుస్తుందని తెలిపారు. ఈద్ మిలాప్ వంటి కార్యక్రమాలు సమాజంలో సౌహార్ద వాతావరణాన్ని పెంపొందిస్తూ, భిన్న మతాల మధ్య ఐక్యతను బలపరుస్తాయని పేర్కొన్నారు. మన సమాజంలో శాంతి, సామరస్యాలు నెలకొనాలంటే పరస్పర గౌరవం, సహనం అత్యవసరమని, ప్రతి ఒక్కరూ సమాజ ఐక్యతకు తమవంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. భిన్నత్వంలో ఏకత్వమే భారతదేశ మహత్తర సంప్రదాయం అని, ఇలాంటి కార్యక్రమాలు ఆ విలువలను మరింత బలపరుస్తాయని అన్నారు. పండుగలు మనుషుల మధ్య దూరాలను తొలగించి హృదయాలను దగ్గర చేసే శక్తి కలిగివున్నాయని, ఈద్ మిలాప్ ఆ భావనకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. సమాజంలో శాంతి, ఐక్యత కోసం అందరూ కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుని ఆనందాన్ని పంచుకున్నారు.

యువతి అదృశ్యం

ప్రతిపక్షం, మొయినాబాద్, మార్చి 29 : ఇంట్లో ఒంటరిగా ఉన్న ఓ యువతి అదృశ్యమైన ఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన పెంజర్ల కమలమ్మ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. శనివారం ఉదయం 7 గంటలకు ఆమె యధావిధిగా పని నిమిత్తం బయటకు వెళ్లింది. ఆ సమయంలో కమలమ్మ కుమార్తె మనీషా (19) ఇంట్లోనే ఉంది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో కమలమ్మ తిరిగి ఇంటికి వచ్చే సరికి కుమార్తె కనిపించకపోవడంతో ఆందోళనకు గురైంది. చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు బంధుమిత్రుల ఇళ్లలో వెతికినా మనీషా ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న మొయినాబాద్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పెద్దకోడెపాక కురుమ సంఘం నూతన కార్యవర్గం

ప్రతిపక్షం, పరకాల, మార్చి 28: గ్రామాల్లో కుల ఐక్యతకు పాత ఆచారాలను గౌరవిస్తూనే, అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని పెద్దకోడెపాక కురుమ కులస్తులు నిర్ణయించారు. ఆదివారం ఉదయం స్థానిక పెద్ద కురుమ అమ్మ తిరుపతి గారి ఆధ్వర్యంలో జరిగిన కులస్తుల సమావేశంలో పెద్దకోడెపాక గ్రామ కురుమ సంఘం మరియు బీరన్న ఆలయ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కురుమ సంఘం అధ్యక్షుడిగా అమ్మ రవి, ఉపాధ్యక్షుడిగా సవ్వాసి రమేష్, జనరల్ సెక్రెటరీగా బుట్టి చంద్రమోహన్, సంయుక్త కార్యదర్శిగా యార రాజ్ కుమార్, కోశాధికారిగా నంద సుమన్ ఎన్నికయ్యారు. అలాగే బీరన్న ఆలయ కమిటీ ప్రెసిడెంట్ గా సవ్వాసి బీరయ్య, వైస్ ప్రెసిడెంట్ గా అమ్మ సురేష్, సభ్యులుగా కోరే భాస్కర్, బుట్టి బీరయ్యలను, ముఖ్య సలహాదారుగా డా. సవ్వాసి శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పెద్ద కురుమ అమ్మ తిరుపతి మాట్లాడుతూ, అనాదిగా వస్తున్న ఆచారాల ప్రకారం పెద్ద కురుమలకే బొట్టు, కంకణం గౌరవాలు ఉంటాయని, నూతనంగా ఎన్నికైన కమిటీలు కుల అభివృద్ధి కార్యక్రమాలను పర్యవేక్షించాలని సూచించారు. వచ్చే నెల ఏప్రిల్ 5వ తేదీన గ్రామంలో బీరన్న పండుగను ఘనంగా నిర్వహించేందుకు పూజారులను ఆహ్వానించినట్లు తెలిపారు. కుల సభ్యులందరూ బాధ్యతగా మెలుగుతూ, ఐకమత్యంతో కులాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఈ సమావేశంలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో కుల సభ్యులు అమ్మ రాజయ్య, భద్రయ్య, బుట్టి కుమార్ స్వామి, రాజయ్య, మల్లయ్య, శ్రీనివాస్, రవీందర్, సుధాకర్, కొమురయ్య, సాంబయ్య, డా. అమ్మ వేణు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన విద్యార్థుల రోబోటిక్స్ ప్రదర్శనలు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 29 : జిల్లా కేంద్రంలోని కాకతీయ ఒలంపియాడ్ పాఠశాల విద్యార్థుల రోబోటిక్స్ ప్రదర్శనలు ఘనంగా ముగిసాయి. నగరంలోని శ్రీరామా గార్డెన్స్ లో గత 2 రోజులుగా పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుక ఆదివారంతో ముగిశాయి. రెండవరోజు ఆదివారం విద్యార్థుల తల్లిదండ్రులు, సందర్శకులు ఈ ప్రదర్శనలు తిలకించేందుకు తరలివచ్చారు. ప్రదర్శనలను వీక్షించిన ప్రజలు, తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తంచేస్తూ ఇంత మంచి ప్రోగ్రాంను నిర్వహించిన పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. రెండవరోజు ఈ రోబో ఫెస్ట విద్యార్థులు మరింత ఉత్సాహంతో పాల్గొని ప్రాజెక్టుల గురించి విజిటర్స్ కు వివరించారు. ఈ పోటీలో చక్కని ప్రతిభ, నైపుణ్యాన్ని ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు వ్యక్తిగత మెడల్స్ ను అందించిన యాజమాన్యం, ముమ్ముందు నిజామాబాద్ లో అంతర్జాతీయస్థాయి ఒలంపియాడ్ విద్యను అందించడమే తమ లక్ష్యమని ఇలాంటి రోబో ఫెస్ట్ లు ప్రతి సంవత్సరం నిర్వహిస్తామని తెలిపారు. పాఠశాల డైరెక్టర్ రామోజీరావు మాట్లాడుతూ దక్షిణ భారత దేశంలో మొట్టమొదటి అతి పెద్ద రోబో ఫెస్ట్ ను నిర్వహించడం మాకెంతో గర్వకారణమని, ఇందుకోసం రోబోటిక్ స్టాఫ్, టీచింగ్‌నాన్ టీచింగ్ స్టాఫ్, ఇతర స్టాఫ్ అందరి కృషి మరువలేనిదని వారిని అభినందించారు. పాఠశాల స్థాయి నుండే రోబోటిక్స్ కాన్సెప్ట్ మీద అవగాహన పెంచుకోవాల్సిన అవసరం నేటి పోటీ ప్రపంచంలో ఉందని, భవిష్యత్ అంతా ఇలాంటి టెక్నాలజీ మీదనే నడుస్తుందనే విషయాన్ని ప్రజలందరూ గ్రహించి తమ పిల్లలకు అత్యున్నత విద్యను అందించాలని, ఐఐటి ఫౌండేషన్, ఆల్ రౌండ్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ లో భాగంగా ఈ రోబోట్ ఫెస్ట్ ను నిర్వహించామని డైరెక్టర్ రజినీకాంత్ తెలిపారు. ఈ ముగింపు కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు రజినీకాంత్, రాజా, రామోజీరావు, తేజస్విని, ప్రిన్సిపాల్ లు చంద్రశేఖర్, రవికాంత్, సుచరిత, వైస్ ప్రిన్సిపాల్ లు భావనా, భూపాల్, రోబోటిక్స్ హెడ్ నీరేష్, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడిచినప్పుడే దేశ భవిష్యత్తు బాగుంటుంది

- పోలీస్ కమీషనర్ వెల్లడి
- నిజామాబాదు రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో 2కే రన్

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, మార్చి 29 : యువత సన్మార్గంలో నడిచినప్పుడే దేశ భవిష్యత్తు బాగుంటుందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య అన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి, యువతే దేశానికి భవిష్యత్తు, మీలో ఉన్న శక్తి , సామర్థ్యాన్ని సరైన దారిలో వినియోగిస్తే మీరు మాత్రమే కాదు, సమాజం మొత్తం అభివృద్ధి చెందుతుందన్నారు. ఆదివారం నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్ రూరల్ పోలీస్ ల ఆధ్వర్యంలో 2కే రన్ కార్యక్రమం జరిగింది. రూరల్ బైపాస్ చౌరస్తా వద్ద ఈ కార్యక్రమాన్ని సీపీ ప్రారంభించారు. అనంతరం ముఖ్య అతిథి పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య జండా ఊపి 2 కే రన్ ను ప్రారంభించారు. Say no to drugs , yes to life అనే నినాదం తో యువత ముందుకు వెళ్ళాలి అనే నినాదానంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం క్రీడలు, వ్యాయామం చాలా అవసరం. అలాంటి మంచి అలవాట్లను పెంపొందించుకోవాలి. ఇటీవల కాలంలో యువతలో చెడు అలవాట్లు పెరుగుతున్నాయి. ముఖ్యంగా డ్రగ్స్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండటం అత్యంత అవసరమన్నారు. ఒకసారి ఆ అలవాట్లలో పడితే బయటపడటం చాలా కష్టం. కాబట్టి మీ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని మంచి మార్గాన్ని ఎంచుకోండి. మన దేశ భవిష్యత్తు యువత చేతిలో ఉంది కావున యువకులు, విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనై డ్రగ్స్ బారిన పడకూడదని సూచించడం జరిగింది. ఈ సమాజంలో ఎవరైనా డ్రగ్స్ గాని, గంజాయి గాని అమ్మిన, సేవించిన చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయన్నారు. ఎవరికైనా సమాచారం తెలిసినట్లయితే 1908 నెంబర్ లేదా, 100 కు కాల్ చేయాలని అన్నారు. డ్రగ్ ఫ్రీ సొసైటీగా తీసుకురావాలని దీనికి ప్రజల, యువత, మీడియా సహకారం ఉండాలన్నారు. ఈ 2K రన్ కార్యక్రమం ద్వారా ఆరోగ్యంపై అవగాహన పెంచడం మాత్రమే కాకుండా, డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ఒక బలమైన సందేశాన్ని నిజామాబాద్ పోలీస్ శాఖ అందిస్తున్నదని, అందరూ ఈ సందేశాన్ని జీవితంలో ఆచరించాలి." ఇలాంటి సందేశం ద్వారా యువతలో సానుకూల మార్పు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల నుండి వచ్చిన విద్యార్థులు డాన్సులు, నాటకాల రూపంలో గంజాయి పర్యావసనాలని ప్రజలకు చూపించడం జరిగింది. అనంతరం సీపీ 2కే రన్ ని పోలీస్ కమీషనర జెండా ఊపి ప్రారంభించారు. ఈ 2 కె రన్ బైపాస్ చౌరస్తా నుండి ఐ.డి.ఓ.సి కార్యాలయం వరకు నిర్వహించారు. ఈ 2కె రన్ లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పోలీస్ కమీషనర్ బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ అదనపు డీసీపీ (అడ్మిన్) జి. బస్వా రెడ్డి , నిజామాబాదు ఏసీపీ ప్రకాష్ , ట్రాఫిక్ ఏసిపి మస్తాన్ అలీ, నిజామాబాద్ రూరల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, నిజామాబాద్ రూరల్ ఎస్సైలు ఎండి షరీఫ్ , ఆనంద్ సాగర్ మరియు పోలీస్ స్టేషన్ సిబ్బంది, గిరిరాజు కాలేజీ , సీఎస్ఐ కాలేజీ , వివేకానంద హై స్కూల్, ప్రభుత్వ డైట్ కాలేజీ, ఎస్సీ హాస్టల్ , డిఎస్ టెక్నాలజీ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.



స్థానిక సంస్థల్లో మహిళలకు ఏనాడో రిజర్వేషన్లు కల్పించిన పార్టీ టీడీపీ. సామాన్యులను చట్టసభలకు పంపిన పార్టీ టీడీపీ. మేం తెచ్చిన విద్యుత్ సంస్కరణలు అనేక రాష్ట్రాలకు మోడల్‌గా మారాయి. ఇక మూడు రాజధానుల మూడు ముక్కలాటలు ఉండవు. హైదరాబాద్‌ను మించిన రాజధానిగా అమరావతి మారుతుంది.

\- ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

ప్రజా కళలను బతికించుకోవాలి

- దేశ సాంప్రదాయాలను రక్షించుకోవాలి
- ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారన్న
- అమెరికా సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా పోరాడాలి
- సీఐటీయూ జిల్లా కోశాధికారి కె.రాజయ్య

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, మార్చి 29 : ప్రస్తుతం అంతరించిపోతున్న కళలను బతికించుకోవాల్సిన అవసరం ఉన్నదని ప్రజా నాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మారన్న అన్నారు. ఆదివారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని రాయల్ జూనియర్ కళాశాలలో(ప్రభాకర్ నగర్) సంగారెడ్డి జిల్లా ప్రజానాట్య మండలి 3వ మహాసభలు జిల్లా అధ్యక్షుడు పి.ఆంజనేయులు, కార్యదర్శి ఎ.నాగభూషణం అధ్యక్షత నిర్వహించారు. మహాసభ సందర్భంగా పీఎన్ఎం పతాకాన్ని ఆవిష్కరించి అమరులకు నివాళులు అర్పించారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన మారన్న మాట్లాడుతూ దేశంలో రోజు రోజుకు కళలు అంతరించిపోతున్నాయని అన్నారు. వాటిని బతికించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో కులం, మతం పేరిట మనుషుల మధ్య విభజనలు చేస్తున్నారని, అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చేందుకు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కళ కళ కోసం కాదు కళ ప్రజల కోసం అనే నినాదంతో పీఎన్ఎం పనిచేస్తుందన్నారు. కొందరు కళాకారులు పేరు, బిరుదులు, కానుకల కోసం, అవార్డుల కోసం పనిచేస్తారని, కానీ ప్రజానాట్య మండలి మాత్రం సమాజ మార్పుకోసం పనిచేస్తుందన్నారు. తన ఆట పాటల ద్వారా ప్రజా సమస్యలను వెలికితీసి వాటిని పరిష్కరించేలా తన పాటల ద్వారా ప్రభుత్వాలకు హెచ్చరికలు చేస్తుందన్నారు.

అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాలి
సీఐటీయూ జిల్లా కోశాధికారి కె.రాజయ్య

అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.రాజయ్య పిలుపునిచ్చారు. అమెరికా, ఇజ్రాయిల్ కలిపి ఇరాన్ పై దాడి చేస్తున్నాయని, యుద్ధం వల్ల అన్ని దేశాలపై ప్రభావం పడుతుందన్నారు. యుద్ధం జరగడం వల్ల మన దేశంతో పాటు ఇతర దేశాల్లో సైతం గ్యాస్, పెట్రోల్, డీజిల్ దొరకడం లేదని, అదే కాకుండా నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతారన్నారు. దేశంలో రోజు రోజుకు మతోన్మాదం పెరిగిపోతుందని దాని వల్ల దేశంలో మతాల మధ్యన చిచ్చు పెట్టి పబ్బం గడుపుకుంటున్నారని ఆరోపించారు. భారత రాజ్యాంగం మార్చేందుకు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజానాట్యమండలి ప్రజా సమస్యల పరిష్కారం కోసం తన ఆటపాటల ద్వారా ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. ఈ మహాసభలకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు, వ్యకాస జిల్లా కార్యదర్శి ఎం.నర్సింలు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.రాజయ్య, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రమేష్ గౌడ్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పి.అశోక్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సతీష్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి పాల్గొని సంఘీభావ ఉపాన్యాసం చేశారు. ఈ మహాసభలో ప్రజానాట్యమండలి జిల్లా కమిటీ సభ్యులు, కళాకారులు పాల్గొన్నారు.

మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాజు మృతి బాధాకరం

- మెదక్ మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు

ప్రతిపక్షం,మెదక్ టౌన్,మార్చి 29: మెదక్ పట్టణానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గంట. రాజు అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందడం తీవ్ర విషాదాన్ని కలిగించింది. ఆదివారం మెదక్,మల్కాజ్గిరి మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు మెదక్ పట్టణంలోని గంట.రాజు నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గంట రాజు మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన ఆయన, ఈ క్లిష్ట సమయంలో పార్టీ తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ పరామర్శ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మందుగల. గంగాధర్, మున్సిపల్ కౌన్సిలర్లు అరునార్తి, వెంకటరమణ,గంట సంపత్, మన్సూర్,శశాంక్,మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ రాగి. అశోక్ నాయకులు బి. సిద్ధారాలు, జాయ్ ముర్రే, సాంసన్ సందీప్, శ్రీకాంత్ నిఖిల్ తదితరులు ఉన్నారు.

సేవలకు ప్రతిరూపం లయన్స్ క్లబ్

- రీజియన్ చైర్మన్ సంజయ్ గుప్తా

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చ్ 29: నియోజకవర్గ కేంద్రం గజ్వేల్ లో ఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ సాధారణ సమావేశం నిర్వహించారు, ఈ కార్యక్రమంలో పాల్గొన్న లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ సంజయ్ గుప్తా మాట్లాడుతూ, సేవకు ప్రతిరూపం లయన్స్ క్లబ్ అని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అలాగే ఇటీవల నిర్వహించిన లయన్స్ క్లబ్ రీజియన్ మీట్ విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతూ, సేవ చేసేవారు లయన్స్ క్లబ్ లో చేరాలని పిలుపునిచ్చారు, అనంతరం వచ్చే రెండు నెలల తర్వాత నిర్వహించే కొత్త లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ పాలకవర్గాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షులు ఉప్పల మెట్టయ్య, లయన్ పరమేశ్వర చారి, నేతి శ్రీనివాస్, డాక్టర్ కుమారస్వామి, రాధాకృష్ణ, దొంతుల సత్యానారాయణ, మల్లేశం గౌడ్,టీచర్ సత్యనారాయణ, విజయ్ భాస్కర్, తాటి రాములు, ఎల్లం రాజు, టీచర్ సంతోష్, దూబకుంట లక్ష్మణ్,లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాల అభివృద్ధి ద్వారానే ఉన్నతమైన జీవితం

ప్రతిపక్షం,సంగారెడ్డి ప్రతినిధి , మర్చి 29 : కేంద్ర మానవ వనరులు మరియు యువజన వ్యవహారాల శాఖ సహకారంతో తారా ప్రభుత్వ కళాశాల, సంగారెడ్డి ఎన్ఎస్ఎస్ విభాగాలు 2, 3, 4 ఆధ్వర్యంలో కలవకూర్, మల్కాపూర్, అంగడిపేట గ్రామాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక శీతాకాల శిబిరాలలో భాగంగా "నాయకత్వ లక్షణాలు - నైపుణ్యాల అభివృద్ధి" అంశంపై ఆదివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని సోలాపూర్‌కు చెందిన జ్ఞాన ప్రబోధిని సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రవీణ తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జ్ఞాన ప్రబోధిని స్వచ్ఛంద సంస్థ జాయింట్ సెక్రటరీ అమూల్ గాంగిలి మాట్లాడుతూ, యువత నైపుణ్యాలను అభివృద్ధి చేసుకున్నప్పుడే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని అన్నారు. నైపుణ్యాల ద్వారానే సరైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని, నాయకత్వ లక్షణాలు మరియు నైపుణ్యాల అభివృద్ధితో యువత ఏ లక్ష్యాన్నైనా సాధించగలదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ సదయ్ కుమార్, డాక్టర్ వాణి మరియు ఇతరులు పాల్గొన్నారు.

బజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 2న జరగనున్న వీర హనుమాన్ విజయోత్సవ శోభ యాత్రకు నిధి సేకరణలో భాగంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ 20 వేలు ఆర్థిక సహాయంగా ఆదివారం నాడు నిర్వాహకులకు అందజేశారు.
- ప్రతిపక్షం, గజ్వేల్

జాతీయ లోక్ అదాలత్‌లో 11,193 కేసుల పరిష్కారం

- పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్

ప్రతిపక్షం,సిద్దిపేట టౌన్ , మార్చి 29: సిద్దిపేట పోలీసు శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారంలో విశేష ఫలితాలు సాధించినట్లు పోలీసు కమిషనర్ రష్మీ పెరుమాళ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వివిధ న్యాయస్థానాల పరిధిలో ఉన్న మొత్తం 11,193 కేసులు పరిష్కరించబడినట్లు పేర్కొన్నారు. వాటిలో భారతీయ శిక్షాస్మృతి కేసులు 733, దినచర్య నమోదు కేసులు 7,995, సూక్ష్మ జరిమానా కేసులు 2,465 ఈ కేసుల పరిష్కారంతో బాధితులకు తక్షణ న్యాయం అందించడంతో పాటు, న్యాయస్థానాలపై ఉన్న భారం కూడా తగ్గినట్లు కమిషనర్ తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ ద్వారా వివాదాలను స్నేహపూర్వకంగా, వేగవంతంగా పరిష్కరించుకోవడం వల్ల ప్రజలకు సమయం, ధనం ఆదా అవుతాయని ఆమె పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజలు ఈ విధమైన అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్, మల్కాజిగిరి జిల్లాల తర్వాత మూడవ స్థానంలో సిద్దిపేట జిల్లా అత్యధిక సంఖ్యలో కేసుల పరిష్కారాలను నమోదు చేసి అగ్రస్థానంలో నిలిచిందని తెలిపారు. ఈ విజయవంతమైన కార్యక్రమానికి సహకరించిన న్యాయమూర్తులు, న్యాయవాదులు, పోలీసు అధికారులు, సిబ్బంది మరియు సంబంధిత శాఖలందరికీ కమిషనర్ అభినందనలు తెలిపారు.

అత్తను హతమార్చిన కోడలు

- 24 గంటల్లోనే కేసును ఛేదించిన గాంధారి పోలీసులు

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, మార్చ్ 29: నమ్మించి గొంతు కోసింది.. అత్తను అత్యంత కిరాతకంగా చంపి, ఏమీ ఎరగనట్లుగా డ్రామా ఆడింది.. కానీ, గాంధారి పోలీసుల నిశిత విచారణలో ఆ కోడలే నేరం చేసినట్లు తెలిసింది. సీతాయిపల్లి గ్రామంలో సంచలనం సృష్టించిన వృద్ధురాలి హత్య కేసును కేవలం 24 గంటల్లోనే ఛేదించి, నిందితురాలిని కటకటాల్లోకి నెట్టారు పోలీసులు గాంధారి మండలంలోని సీతయ్యపల్లి గ్రామానికి చెందిన కావటి రుక్మవ్వ (73)కు ముగ్గురు కుమారులు కలరు. ముగ్గురు కుమారుల్లో పెద్ద కుమారుడు, నడిపి కుమారుడు మృతి చెందగా, చిన్న కుమారుడు హైదరాబాదులో ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇందులో నడిపి కుమారుడైన భూమయ్య భార్య అయిన కోటవ్వకు మృతురాలు రుక్మవ్వతో అనేకసార్లు బంగారం, డబ్బుల విషయాలలో గొడవలు జరిగేవి. గత కొన్ని రోజుల క్రితం కోడలు అత్తను డబ్బులు అడగగా ఇవ్వకపోవడంతో కక్ష పెంచుకొని, అత్త దగ్గర ఉన్న బంగారం మరియు నగదును కాజేయాలనే ఉద్దేశంతో, తేదీ 28 రాత్రి డబ్బులు ఇవ్వలేదని, దూషించిందని కోపంతో, కోడలు తెల్లవారుజామున అత్త పడుకున్న ఇంటికి వెళ్లి రాయితో తలపై దాడి చేసి హత్య చేసింది. హత్య అనంతరం ఘటనను బయటపడకుండా ఉండేందుకు రక్తపు ఆనవాళ్లను తుడిచేసి, బంగారు ఆభరణాలు దొంగిలించింది. నిందితురాలి నుండి 13.8 గ్రాముల బంగారు గుండ్లు, 1.2 గ్రాముల బంగారు చెవి కమ్మ ఒకటి స్వాధీనం చేసుకుని, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసును అత్యంత వేగంగా ఛేదించిన సదాశివనగర్ సీఐ బి. సంతోష్ కుమార్, గాంధారి ఎస్ఐ ఆంజనేయులు, సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ రవి కుమార్, కానిస్టేబుల్ లు సాందీప్ జానకిరాము, లను జిల్లా ఎస్పీ అభినందించారు.

బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలి

- ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడినా, ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు
- జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు

ప్రతిపక్షం, మెదక్ టౌన్, మార్చి 29: జిల్లాలో ఎవరైనా క్రికెట్ లేదా ఇతర బెట్టింగ్‌లకు పాల్పడినా, ప్రోత్సహించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఆదివారం ఒక ప్రకటన ద్వారా హెచ్చరించారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో యువత బెట్టింగ్ మోజులో పడుతూ తమ భవిష్యత్తును ప్రమాదంలోకి నెడుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.యువత బెట్టింగ్‌ల వైపు వెళ్లి ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా, కొన్ని సందర్భాల్లో ప్రాణాలపైనా ముప్పు ఏర్పడుతున్నదని పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ప్రస్తుతం ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్ కొనసాగుతున్నందున తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్పీ సూచించారు. ముఖ్యంగా మొబైల్ ఫోన్ వినియోగం, ప్రవర్తనలో మార్పులు గమనించి అనుమానాస్పద పరిస్థితుల్లో వెంటనే స్పందించాలని తెలిపారు. జిల్లాలో బెట్టింగ్ కార్యకలాపాలను అరికట్టేందుకు టాస్క్‌ఫోర్స్ మరియు ప్రత్యేక బృందాలతో నిఘా పెంచినట్లు పేర్కొన్నారు. ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడినా, ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తప్పవని మరోసారి హెచ్చరించారు.బెట్టింగ్‌లపై సమాచారం ఉన్నవారు వెంటనే డయల్ 100 లేదా జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712657888కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు.

నేడు ఇందిరా పార్క్‌లో జరిగే నిరాహార దీక్షను విజయవంతం చేయండి

ప్రతిపక్షం, దౌల్తాబాద్, మార్చ్29: హైదరాబాద్ ఇందిరా పార్క్ లో జరిగే నిరాహార దీక్షను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగపల్లి సాయిలు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాలి గారి కృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం దౌల్తాబాద్ ప్రెస్క్లబ్లో నిరాహార దీక్ష కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని అన్నారు. అంబేద్కర్ అభయ హస్తం పథకం ద్వారా ప్రతి దళిత కుటుంబానికి 12 లక్షల ఆర్థిక సహాయం తక్షణమే అందించాలని, అర్హులైన ప్రతి దళిత కుటుంబానికి మూడు ఎకరాల సాగు భూమిని కేటాయించాలన్నారు. జీవో నెంబర్ 58, 59 ప్రకారం పట్టాలు ఇచ్చి అమ్ముకునే హక్కు కల్పించాలని, విద్యా రిజర్వేషన్ కార్పొరేట్ విద్యాసంస్థల్లో 25% ఉచిత విద్యను అమలు చేయాలన్నారు. ఎస్సీ కార్పొరేషన్ నిధులు కార్పొరేషన్ శాఖకు రూ. 15 వేల కోట్లు కేటాయించి సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని, భూ హక్కులు దళితుల వద్ద నుండి లాక్కున్న అసైన్డ్ భూములను తిరిగి వారికి ఇవ్వాలన్నారు. కార్మిక గుర్తింపు పారిశుద్ధ్య కార్మికులకు నాలుగవ తరగతి ఉద్యోగుల గుర్తించి కనీసం రూ.20 వేల వేతనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు రాజు, స్వామి, హరి తదితరులు పాల్గొన్నారు.

'కావేరి' యూనివర్సిటీకి ఉత్తమ విశ్వవిద్యాలయ అవార్డు

- అందించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చ్ 29: విద్యార్థుల పట్ల సంస్థ అంకితభావం, నిబద్ధత, అందుతున్న పరిజ్ఞానం దృష్టిలో పెట్టుకొని వర్గల్ మండలం గౌరారం శివారు లోని కావేరి విశ్వవిద్యాలయానికి ఉత్తమ యూనివర్సిటీ అవార్డు దక్కించుకుంది. ఇందులో భాగంగానే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చేతుల మీదుగా హైదరాబాదులో సంస్థ డైరెక్టర్ డాక్టర్ హర్ష పోల్సాని అవార్డు అందుకున్నారు. చక్కటి సాంకేతిక నైపుణ్యం, నూతన ఆవిష్కరణలు సత్ఫలితాలిస్తుండగా, అందుతున్న పరిజ్ఞానం దృష్టిలో పెట్టుకొని కావేరి విశ్వవిద్యాలయానికి ఉత్తమ యూనివర్సిటీ అవార్డు దక్కినట్లు కావేరి యూనివర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ భాస్కర్ రావు స్పష్టం చేశారు. వ్యవసాయం, సాంకేతికత ఆధారిత పరిష్కారాల్లో నూతన పరిశోధన, పరిశ్రమలకు అనుగుణమైన కోర్సులు, స్థిరమైన అభివృద్ధి, ఉన్నత విద్యకు కావేరి యూనివర్సిటీ అందిస్తున్న గొప్ప గుర్తింపుకు ఈ అవార్డు ప్రామాణికంగా నిలిచిందని వైస్ చాన్సలర్ డాక్టర్ ప్రవీణ్ రావు, రిజిస్ట్రార్ డాక్టర్ శ్రీనివాసులు వివరించారు. ఈ కార్యక్రమానికి వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా పవన్ కుమార్

ప్రతిపక్షం, నంగునూరు, మార్చి 29: నంగునూరు మండలంలోని సిద్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) వైస్ చైర్మన్ గా నంగునూరుకు చెందిన సాదుల పవన్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నంగునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్.ఎస్.సి చదివిన పవన్ కుమార్ బీటెక్, ఎల్.ఎల్. బి పూర్తి చేశారు. పవన్ కుమార్ ఎన్ ఎస్ యు ఐ, యూత్ కాంగ్రెస్ చురుగ్గా పనిచేశారు. ప్రస్తుతం యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా ఉన్నారు. పవన్ కుమార్ తండ్రి సాదుల ఆత్మారాములు సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ప్రముఖ న్యాయవాది. ఆయన సిద్ధిపేట జిల్లా కోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా విధులు నిర్వహిస్తున్నారు. తల్లి సాదుల రాణి కాంగ్రెస్ పార్టీ నుంచి నంగునూరు సర్పంచిగా ఎన్నికై నంగునూరు గ్రామ అభివృద్ధికి కృషి చేశారు. ఈ సందర్భంగా సాదుల పవన్ కుమార్ మాట్లాడుతూ రైతు కుటుంబానికి చెందిన తనకు చిన్న వయసులో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పదవి దక్కడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను రైతులకు చేరువ చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. మార్కెట్ కమిటీ అభివృద్ధికి నిరంతరం పాటు పడతానని పేర్కొన్నారు. తనపై నమ్మకంతో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పదవికి తనను ఎంపిక చేసిన జిల్లా ఇంచార్జి మంత్రి వివేక్ వెంకట స్వామి, మంత్రులు దామోదర్ రాజ నరసింహ, పొన్నం ప్రభాకర్, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు, కాంగ్రెస్ పార్టీ సిద్ధిపేట నియోజకవర్గ ఇంచార్జి పూజల హరికృష్ణ, ఇందుకు సహకరించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



పిల్లలు మాత్రం రెక్కలు వచ్చాక తల్లిదండ్రులను పట్టించుకోవట్లేదు వృద్ధ తల్లిదండ్రులకు అండగా నిలవాలనే చట్టం తీసుకొచ్చాం. మేం తెచ్చిన చట్టం ప్రభుత్వ ఉద్యోగులకే కాదు. ప్రజా ప్రతినిధులకు కూడా వర్తిస్తుంది. తల్లిదండ్రుల యోగక్షేమాలు చూడని వ్యక్తిని సామాజికంగా బహిష్కరించాలి. సామాజిక బాధ్యతగా ఈ చట్టాన్ని తీసుకువచ్చాం, అందరూ మద్దతు ఇవ్వాలి
- సీఎం రేవంత్ రెడ్డి

ప్రాంతీయం

ఏడుపాయల వన దుర్గ భవాని మాతను
దర్శించుకున్న జిల్లా కలెక్టర్ దంపతులు

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్,మార్చి 29: మంజీరా నదీ తీరాన వెలసిన అత్యంత మహిమాన్విత ఏడుపాయల వనదుర్గా భవానీ ఆలయం అని.భక్తుల కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం వన దుర్గ భవాని మాత అని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. ఆదివారం ఏడుపాయల దుర్గా మాతను జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో వీరేశం, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారి పేర ప్రత్యేక పూజ నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మెదక్ జిల్లాలో ఏడుపాయల దుర్గా భవానీ దేవత యొక్క అత్యంత గౌరవనీయమైన మందిరంగా పేర్కొన్నారు . కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంగా విరాజిల్లుతూ ఈ ప్రాంత ప్రజలు అధిక సంఖ్యలో అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటారని అన్నారు.మామూలు రోజుల్లో ఒక మాదిరిగా ఉండే భక్తుల రద్దీ ఆదివారాలలో అధిక సంఖ్యలో భక్తులు తాకిడికనుగుణంగా సకల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా భక్తులకు సౌకర్యాలు ఆలయ పరిసర ప్రాంతాలు పరిశుభ్రతంగా ఉంచడంలో నిర్వాహకుల సేవలను కలెక్టర్ కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఈవో వీరేశం సిబ్బంది శ్రీనివాస్, అర్చకులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి
కొత్త రాజకీయ పార్టీ అవసరం

- జాగృతి జిల్లా నాయకుడు సిద్ధరబోయిన శ్రీనివాస్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 29: తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై రాజకీయ వ్యవస్థ తగిన దృష్టి సారించడం లేదని సిద్దిపేట జిల్లా జాగృతి నాయకుడు సిద్ధరబోయిన శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగం, రైతుల ఆర్థిక ఇబ్బందులు, మహిళల భద్రత, ధరల పెరుగుదల వంటి సమస్యలు రోజురోజుకు తీవ్రంగా మారుతున్నప్పటికీ, రాజకీయ పార్టీలు ప్రజా సమస్యల కంటే తమ స్వప్రయోజనాలకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయని విమర్శించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలకు తమ సమస్యలను నిజాయితీగా ప్రతిబింబించే వేదిక లేకపోవడం కూడా అసంతృప్తికి కారణమవుతోందని ఆయన అన్నారు. ఈ నేపథ్యంలో ప్రజల ఆశయాలను నెరవేర్చే కొత్త రాజకీయ ప్రత్యామ్నాయం అవసరమని భావించిన తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో కొత్త రాజకీయ పార్టీ ఆవిర్భవించడం సమయోచితమని పేర్కొన్నారు.ఏప్రిల్ 25 కేవలం పార్టీ ప్రకటనా రోజు మాత్రమే కాకుండా, ప్రజల ఆశలు పునరుద్ధరించబడే రోజుగా నిలవాలని మేధావులు, యువత, ఉద్యోగులు ఆశిస్తున్నారని తెలిపారు. కవితక్క నాయకత్వంలో ప్రారంభమయ్యే ఈ కొత్త రాజకీయ ప్రయాణం ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులకు దారి తీస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి ఈ కొత్త పార్టీ కీలక పాత్ర పోషిస్తుందని సిద్ధరబోయిన శ్రీనివాస్ ఆశాభావం వ్యక్తం చేశారు.

జాతీయ స్థాయికి శ్రీవిద్య విద్యార్థుల ఎంపిక

ప్రతిపక్షం,మెదక్ టౌన్,మార్చి 29: స్పెల్లింగ్ బి రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిన శ్రీవిద్య పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఈ విషయాన్ని పాఠశాల ప్రిన్సిపల్ రవీందర్ గుప్తా వెల్లడించారు. హైదరాబాద్‌లోని రామంతాపూర్ టీఎస్ గ్రామర్ హైస్కూల్‌లో ఆదివారం విశ్వం ఎడ్యుటెక్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి స్పెల్లింగ్ బి పోటీల్లో మెదక్ జిల్లా పాపన్నపేటకు చెందిన శ్రీవిద్య పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు పాల్గొన్నారు.ఈ పోటీల్లో ఫస్ట్ కేటగిరీలో పి. మనోహర్ ప్రథమ బహుమతి సాధించగా, శ్రేష్టాక్షర ద్వితీయ బహుమతి పొందారు. అక్షిత్ కేటగిరీ2లో ద్వితీయ బహుమతి సాధించి జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. సైపొద్దిన్ "రైజింగ్ స్టార్"గా నిలిచి ప్రత్యేక గుర్తింపు పొందారు.విద్యార్థుల విజయానికి కృషి చేసిన ఉపాధ్యాయులు దుర్గ, విలాస్, జ్యోతి రాజ్ ప్రధాన్, షీలా, అనురాధ, అపూర్వలను ప్రిన్సిపల్ రవీందర్ గుప్తా, కరస్పాండెంట్ నిటల క్రృప్ప, సుమన్ అభినందించారు.

ఆర్ఎంపీ, పీఎంపీ సంక్షేమ సంఘం
అధ్యక్షునిగా ముదిగొండ రమేశ్

ప్రతిపక్షం, నంగునూరు, మార్చి 29: నంగునూరు మండల ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్(సంక్షేమ సంఘం) ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. నంగునూరు మండల కేంద్రంలోని ఆర్ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ భవన్లో ఆదివారం జరిగిన సమావేశంలో ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షునిగా ముదిగొండ రమేశ్, ఉపాధ్యక్షునిగా నకీర్తి రాజమల్లు, ప్రధాన కార్యదర్శిగా మల్లమారి శంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని సంక్షేమ సంఘం సభ్యులు సంఘం సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఆర్ఎంపీ, పీఎంపీల సంక్షేమం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు.

విధేయతకు దక్కిన ప్రాధాన్యం

- వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గా దేవులపల్లి యాదగిరి
- బాధ్యతలు స్వీకరించిన యాదగిరి

ప్రతిపక్షం, నంగునూరు, మార్చి 29: కాంగ్రెస్ పార్టీ విధేయతకు పెద్ద పీట వేసింది. కష్ట కాలంలో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి ప్రతికూల పరిస్థితుల్లో పార్టీ బలోపేతానికి కృషి చేసిన నాయకునికి నామినేటెడ్ పదవుల భర్తీలో ప్రాధాన్యత దక్కింది. బీఆర్ఎస్ కంచు కోటలో కాంగ్రెస్ పార్టీ వెంట నడిచి కార్యకర్త స్థాయి నుంచి పీసీసీ కార్యదర్శిగా ఎదిగిన నాయకుడికి సముచిత స్థానం కల్పించింది. పలువురు కాంగ్రెస్ నాయకులు పోటీ పడ్డప్పటికీ కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీకి అండగా నిలిచి పార్టీ బలోపేతానికి ఒక రకంగా చెప్పాలంటే కాంగ్రెస్ పార్టీ ఉనికిని కాపాడిన దేవులపల్లి యాదగిరి వైపే కాంగ్రెస్ అధిష్టానం నిలిచింది. ఫలితంగా సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని సిద్ధన్నపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గా పీసీసీ కార్యదర్శి, నంగునూరు మాజీ సర్పంచి దేవులపల్లి యాదగిరి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను ఆదివారం ఉదయం జిల్లా ఇంఛార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి దేవులపల్లి యాదగిరికి అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజకవర్గ ఇంఛార్జి పూజల హరికృష్ణ పాల్గొన్నారు. జిల్లా ఇంఛార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి కి ధన్యవాదాలు తెలిపిన అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పీసీసీ కార్యదర్శిగా వ్యవహరిస్తున్న దేవులపల్లి యాదగిరి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తీవ్రంగా కృషి చేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా నిలిచారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అధికార పార్టీ నుంచి తమ పార్టీలోకి రావాలని పిలుపు వచ్చినా యాదగిరి కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగారు. కష్ట కాలంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా నిలిచారు. బీఆర్ఎస్ కంచుకోటగా మారిన సిద్దిపేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి ఎదురు నిలిచి కాంగ్రెస్ పార్టీ తరపున నంగునూరు సర్పంచిగా పదేళ్ల కిందట విజయం సాధించారు. అప్పట్లో సిద్దిపేట నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నియోజక వర్గ స్థాయి నాయకులు నంగునూరులో ఉండి యాదగిరిని ఓడించేందుకు తీవ్ర ప్రయత్నం చేశారు. అయినా సర్పంచిగా గెలుపొందడం విశేషం. నంగునూరు గ్రామాన్ని అభివృద్ధి పథంలో నిలిపేందుకు అహర్నిశలు కృషి చేశారు.

బాధ్యతల స్వీకరణ

నియామక పత్రం అందుకున్న దేవులపల్లి యాదగిరి నంగునూరుకు వచ్చి ఆదివారం మధ్యాహ్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ గా దేవులపల్లి యాదగిరి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు దేవులపల్లి యాదగిరి మాట్లాడుతూ మార్కెట్ కమిటీ అభివృద్ధి దిశగా, రైతులకు మెరుగైన సేవలు అందించడంతో పాటు మార్కెట్ వ్యవస్థను బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవికి తనను ఎంపిక జిల్లా ఇంఛార్జి మంత్రి వివేక్ వెంకట స్వామి, మంత్రులు దామోదర్ రాజ నరసింహ, పొన్నం ప్రభాకర్, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట నియోజక వర్గ ఇంఛార్జి పూజల హరికృష్ణ, ఇందుకు సహకరించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తప్పెట శంకర్, యువజన కాంగ్రెస్ నాయకుడు చెలికాని యాదగిరి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిలుకల రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గోటి తలంబ్రాల పరిచయ ఘనత గజ్వేల్ రామకోటి రామరాజుదే

- భద్రాచల దేవస్థానం మరో భక్త రామదాసుగా బిరుదు

ప్రతిపక్షం, గజ్వేల్, మార్చ్ 29: నియోజకవర్గ కేంద్రం గజ్వేల్ కు చెందిన అపర రామభక్తుడు, శ్రీరామకోటి భక్త సమాజం ధార్మిక సంస్థ వ్యవస్థాపక, అధ్యక్షులు రామకోటి రామరాజుకు ఆదివారం నాడు కరీంనగర్ లో ఉగాది జాతీయ పురస్కారాన్ని, నంది అవార్డును, సన్మాన పత్రాన్ని సంస్థ అధ్యక్షులు పోలోజు రాజ్ కుమార్, ముఖ్య అతిథి ఆర్.ఎస్.నందా, సినీ నటి రాధిక చేతుల మీదుగా రామరాజుకు అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి వ్యక్తిని అధ్యాత్మికం వైపు నడిచెలా ప్రేరేపింపజేసి వారిచే "రామ" నామాన్ని కోట్లాది సంఖ్యలో లిఖింపజేపించి ధార్మిక మార్గంలో నడిపించడం అభినందనీయం అన్నారు. గత 30యేండ్ల నుండి చేస్తున్న నిర్విరామ కృషి అమోఘం అన్నారు. రామ నామమే ప్రాణమని వేయి కోట్లకు శ్రీకారం చుట్టిన ధార్మిక యువ కెరటం, అధ్యాత్మిక వేత్త రామకోటి రామరాజు నేటి యువతకు ఆదర్శం అన్నారు.

ప్రతి సబ్జెక్ట్ పైన పట్టు సాధించాలి

- జిల్లా కలెక్టర్ హైమావతి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 29: చిన్నకోడూరు మండలం అల్లిపూర్ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించారు. విద్యాలయ ప్రాంగణం మొత్తం కలియ తిరిగారు. తరగతి గదిలో విద్యార్థులు ఆప్యాయంగా పలకరించారు. రోజు భోజనం ఎలా ఉంటుంది మెనూ ప్రకారం పెడుతున్నారా రుచిగా ఉంటుందా అని ఆరా తీశారు. మంచి క్రమశిక్షణ అలవాట్లను అలవర్చుకోవాలని మంచి నైపుణ్యం కలిగివుండాలని ప్రతి సబ్జెక్ట్ పైన పట్టు సాధించాలని సమయం వృధా చేయకూడదని రోజు వ్యాయామం, యోగ ధ్యానం లాంటివి తప్పనిసరిగా చెయ్యాలని శారీరక శ్రమ ఉంటేనే మానసికంగా దృఢంగా ఉంటారని ఒక లక్ష్యం పెట్టుకొని ఉన్నతమైన విలువలతో గమ్యాన్ని చేరుకోవడని నిరారంతం శ్రమించాలని ఆదేశించారు. భోజనం, వసతి లో ఎలాంటి లోటుపాట్లు ఉన్న ఎస్ ఓ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు.

రామాయణ విశిష్టతలు వెలుగులోకి
ఘనంగాపుస్తక ఆవిష్కరణ సభ

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, మార్చి 29: రామాయణం చదవడం మాత్రమే కాకుండా, అందులోని ఆచరణీయ అంశాలను జీవితంలో అమలు చేయడం ఎంతో ముఖ్యమని రఘువీర్ ప్రతాప్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "వశిష్ట గీతామృతము" పుస్తకంలో రామాయణ విశేషాలను చక్కగా విశ్లేషించిన తీరు ప్రశంసనీయమని అన్నారు.మరో విశిష్ట అతిథి డాక్టర్ దాశరథులు బాలయ్య మాట్లాడుతూ రామాయణం మనకు మార్గదర్శక గ్రంథమని, "వశిష్ట గీతామృతము"ను సరళమైన భాషలో అందంగా అచ్చు వేశారని కొనియాడారు.ఈ సందర్భంగా "ఉత్సాహ రామాయణము", "శ్రీ వశిష్ట గీతామృతము" పుస్తకాల ఆవిష్కరణ మహోత్సవం ప్రెస్ క్లబ్‌లో ఘనంగా జరిగింది. శ్రీవాణి సాహిత్య పరిషత్ అధ్యక్షులు పెందోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సిద్దిపేట సాహిత్యానికి మంచి ప్రోత్సాహం అందిస్తున్న నగరమని, అనేక మంది కవులు తమ రచనలను ప్రజలహిత దృక్పథంతో రచిస్తున్నారని అన్నారు. కార్యక్రమానికి వ్యాఖ్యాతగా బెజగం శివయ్య తన మాటల చమక్కులు, పద్యాలు, శ్లోకాలతో సభను రంజింపజేశారు. మరో వ్యాఖ్యాత బసవ కుమార్ రాజు కూడా తన ప్రదర్శనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. బ్రిడ్జి గోపాల్ ఆధ్యాత్మిక ఉపన్యాసం ఇచ్చి రామాయణ విశిష్టతను వివరించారు.ఈ కార్యక్రమంలో రోజు వెంకటేశ్వర్లు, మౌన స్వామి, అబద్ధాన్ని బండి కాడ అంజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు. తాటికొండ విష్ణుమూర్తి, కాల్వ రాజయ్య, అనిశెట్టి సతీష్, దుడుగు నాగలత, ఇప్ప ఉమారాణి, గడ్డం బాలకిషన్, అల్లా అశోక్ కుమార్ తదితరులు హాజరయ్యారు.

కన్నుల పండువగా శ్రీరామ కళ్యాణం

- రాంపూర్ శ్రీ సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ప్రతిపక్షం, నంగునూరు, మార్చి 29: సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం రాంపూర్ గ్రామంలో శ్రీ సీతా రామచంద్ర స్వామి దేవాలయంలో శ్రీరామ కళ్యాణం కన్నుల పండువగా జరిగింది. శ్రీ సీతా రామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు శ్రీ సీతారాముల కళ్యాణంతో ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ సీతారాముల కళ్యాణం అత్యంత వైభవోపేతంగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏటా శ్రీ రామ నవమినాడు భద్రాచలంలో సీతారామ కళ్యాణం అయిన తర్వాత ఇక్కడ కళ్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామ సర్పంచి గోక మహిపాల్ రెడ్డి, గ్రామ నాయకులు అనగోని లింగం గౌడ్, అనగోని పర్శరాములు గౌడ్ తెలిపారు. భద్రాచలం నుండి స్వామివారి తలంబ్రాలు తీసుకువచ్చిన తర్వాత ఈ కళ్యాణోత్సవాలు నిర్వహిస్తారు. గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి శ్రీ సీతారాముల కళ్యాణాన్ని కన్నులారా తిలకించి తరించారు. కళ్యాణం అనంతరం ఆలయ సన్నిధిలో అన్న ప్రసాద వితరణ చేశారు. భద్రాద్రి శ్రీ సీతారాముల కళ్యాణం అనంతరం అక్కడి తలంబ్రాలతో సీతారాముల కళ్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొని కళ్యాణాన్ని తిలకించారు. తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ సందర్భంగా భక్తులు శ్రీ సీతారామ చంద్ర స్వామికి ఓడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తిరుపతి గౌడ్, నాయకులు యాదగిరి, వార్డు సభ్యులు వెంకటేశ్, తిరుపతి యాదవ్, మల్లారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, పలువురు భక్తులు పాల్గొన్నారు.



నా బావమరిది, తమ్ముడిపై సీఎం ఆరోపణలు చేశారు. సీఎం తమ్ముడు, బావమరిదిపై అవినీతి ఆరోపణలు ఉన్నాయి. నా బావమరిది, తమ్ముడిపై వచ్చిన ఆరోపణలపై విచారణకు సిద్ధం. సీఎం తమ్ముడు, బావమరిదిపై వచ్చిన ఆరోపణలపై విచారణకు సిద్ధమా?. హౌస్ కమిటీ కాదు. సీబీసీఐడీ కాదు. సిట్టింగ్ జడ్జితో విచారణ చేయిద్దాం.

- హరీశ్‌రావు, మాజీ మంత్రి

బీజేపీ హయాంలో దళిత, ఆదివాసీలపై వివక్ష తీవ్రం

- మండిపడ్డ రాహుల్ గాంధీ

ప్రతిపక్షం, నేషనల్ డెస్క్: గుజరాత్‌లోని బీజేపీ ప్రభుత్వ హయాంలో దళిత, ఆదివాసీ వర్గాలపై ద్వేషం, వివక్ష, అకృత్యాలు తీవ్రమయ్యాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. 2016 నాటి 'ఉనా కొరడా దెబ్బల ఘటన' బాధితులకు మద్దతు తెలుపుతూ ఈ మేరకు వ్యాఖ్యానించారు. వారికి న్యాయం జరిగేంత వరకు వారి గళాన్ని వినిపిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. గుజరాత్‌కు చెందిన ఉనా ఘటన బాధితులతో సహా దళిత, ఆదివాసీ వర్గాల ప్రతినిధుల బృందంతో ఇటీవల జరిపిన భేటీకి సంబంధించిన వీడియోను సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేశారు. 'సుమారు 10 ఏళ్ల క్రితం ఉనా ఘటన దేశం మొత్తాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. దళిత యువకులను బహిరంగంగా దుస్తులు లేకుండా చేసి దారుణంగా కొట్టారు. ఆ సమయంలో నేను వారి కుటుంబాలకు అండగా నిలిచాను. అయితే, ఒక దశాబ్దం గడిచినా వారికి ఇంకా న్యాయం జరగకపోవడం అత్యంత దురదృష్టకరం. వారి గాయాలు ఇంకా మానలేదు. పైగా పరిస్థితి మరింత దిగజారింది. ఆ ప్రతినిధుల బృందం చెప్పే విషయాలను వింటున్నప్పుడు పరిస్థితి మెరుగుపడకపోగా, మరింత ఆందోళనకరంగా మారిందని స్పష్టమైంది.' అని రాహుల్ గాంధీ అన్నారు. 'ఒక వ్యక్తిని ఎంత దారుణంగా కొట్టారంటే అతని శరీరంలో ఏకంగా 19 చోట్ల ఎముకలు విరిగిపోయాయి. మరొక వ్యక్తి సోదరుడిని కేవలం ఒక చిన్న అనుమానం లేదా కక్షతో సజీవ దహనం చేశారు. ఈ ఘటనలు కేవలం అక్కడక్కడా జరిగే నేరాలు మాత్రమే కాదు. భయం, అన్యాయంతో నిండిన దారుణ వాస్తవాన్ని ఇవి ప్రతిబింబిస్తాయి. అన్నింటికంటే అత్యంత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే తమ హక్కులను డిమాండ్ చేస్తూ గళం విప్పేవారిని పద్ధతి ప్రకారం అణచివేస్తున్నారు. కొన్నిసార్లు బెదిరింపుల ద్వారా, మరికొన్నిసార్లు హింస, తరచుగా హత్యల ద్వారా భయపెడుతున్నారు.' అని రాహుల్ గాంధీ అన్నారు.

విశ్వ వీక్షణం

భారత్‌కు చేరుకోనున్న మరో రెండు ఎల్పీజీ నౌకలు

ప్రతిపక్షం, నేషనల్ డెస్క్: పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకున్న వేళ, ంటగ్యాస్ కొరతతో ఇబ్బంది పడుతున్న భారత్‌కు పెద్ద ఊరట లభించింది. భీకర దాడులతో అట్టుడుకుతున్న హార్ముజ్ జలసంధి గుండా భారత జెండాతో ఉన్న మరో రెండు ఎల్‌పీజీ కార్గో నౌకలు సురక్షితంగా బయటపడ్డాయి. దేశంలో ఒక రోజుకు సరిపడా వంటగ్యాస్‌ను ఈ నౌకలు మోసుకొస్తున్నాయి. రాబోయే రెండు, మూడు రోజుల్లో ఇవి భారత్‌కు చేరుకోనున్నాయి. సుమారు 94 వేల టన్నుల ఎల్‌పీజీ కార్గోతో వస్తున్న BW టైర్, BW ELM అనే రెండు భారతీయ నౌకలు తాజాగా జలసంధిని సురక్షితంగా దాటాయి. ఇందులో BW TYR మార్చి 31 నాటికి ముంబయికి, BW ELM ఏప్రిల్ 1న మంగళూరుకు చేరుకోనున్నాయి. దేశంలో వంటగ్యాస్ కొరతను ఎదుర్కోవడానికి ఈ నౌకల రాక ఎంతో సహాయపడనుంది. ఈ రెండు నౌకల కంటే ముందే నాలుగు భారత ఎల్‌పీజీ ట్యాంకర్లు సురక్షితంగా మన దేశానికి చేరుకున్నాయి. 92 వేల టన్నులకు పైగా వంటగ్యాస్‌తో వచ్చిన పైన్ గ్యాస్, జగ్ వసంత్ నౌకలు ఇప్పటికే భారత పోర్టులను చేరుకున్నాయి. జగ్ వసంత్ ఎల్పీజీ ట్యాంకర్ శుక్రవారం రాత్రి 8గంటలకు గుజరాత్‌లోని వాదినార్ ఓడరేవుకు చేరినట్లు చెప్పారు. అందులో 47వేల టన్నుల ఎల్పీజీ ఉన్నట్లు తెలిపారు. రెండో ట్యాంకర్ పైన్ గ్యాస్ శుక్రవారం రాత్రి భారత సముద్రజలాల్లోకి ప్రవేశించినట్లు అధికారులు చెప్పారు. ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్‌కు చెందిన ఈ నౌక ఏప్రిల్ 2న ఒడిశాలోని ధమ్రా ఓడరేవుకు చేరుకుంటుందని తెలిపారు. టెహ్రాన్ ఆమోదించిన మార్గాల ద్వారా ఈ 2 నౌకలు హార్ముజ్ జలసంధి గుండా ప్రయాణించాయని అధికారులు తెలిపారు.

సింగిడి
హైదరాబాద్
సోమవారం
30.03.2026
9
ప్రతిపక్షం
Prathipaksham.in

ప్రకృతితో మమేకమై...





నేటి ఉరుకుల, పరుగుల యాంత్రిక జీవనంలో మానవుడు కాలంతో పాటు పరిగెత్తి పరిగెత్తి అలసిపోతున్నాడు. అందుకే సంవత్సరానికి ఒక్కసారైనా యాంత్రికతకు దూరంగా, ప్రకృతికి దగ్గరగా గడపాలనుకుంటున్నాడు. ఇందుకోసం కొత్త కొత్త దారులను ఎంచుకుంటున్నాడు. ఈ విషయాన్ని కనిపెట్టారేమో.. కానీ, కొంతమంది వ్యాపారవేత్తలు ఇలాంటివారికోసం.., ప్రకృతితో సహజీవనం చేసేందుకు వీలుగా చెట్లపై రిసార్ట్స్‌ను నిర్మిస్తున్నారు. అన్ని రకాల సౌకర్యాలతో చాలా అందంగా, నివాసానికి అనువుగా వీటిని నిర్మిస్తున్నారు. నిజానికి ఈ ఆలోచన ఇప్పటిది కాదు. భూమి గుండ్రంగా ఉంది అన్నట్లు.. మానవుడు మళ్లీ ఆనాటి కాలానికి వెళ్లిపోయాడా? అనిపిస్తున్నాయి ఈ రిసార్టులను చూస్తుంటే.. వీటికి గొప్పచరిత్ర ఉంది. చెట్ల నివాసాలను దక్షిణ పసిఫిక్ ఆగ్నేయాసియా ప్రజలు మొదటిసారిగా కట్టారు. అప్పట్లో వీరు కుటుంబాలను జంతువుల నుంచి రక్షించుకోడానికి చెట్లపై గృహాలను నిర్మించుకునేవారు. మధ్యయుగాల్లో ఫ్రాన్సిస్కాన్ సన్యాసులు ధ్యానం చేయడానికి చెట్ల గదులను వినియోగించేవారు. హిందూ సన్యాసులు కూడా ఇలాంటి ఇళ్లలోనే నివసించేవారు. అనేక శతాబ్దాల తర్వాత నేడు వ్యాపారవేత్తలు.. తమ వ్యాపారంలో భాగంగా యాత్రాస్థలాల్లో ఇలాంటి గదులను నిర్మించి పర్యటకులను ఆకర్షిస్తున్నారు.

- కేరళలోని లక్కిడిలోని వైత్రి అనే రిసార్ట్స్‌ను అడవి మధ్యలో చెట్లపై నిర్మించారు. ఇక్కడ ఆయుర్వేద స్పా, స్విమ్మింగ్ పూల్, ఆటస్థలాలే గాక ఆరోగ్య కేంద్రం కూడా ఉంది.
- రాజస్థాన్‌లోని జైపూర్‌లో నేచర్ ఫామ్ పేరిట ఇలాంటి చెట్టు రిసార్టులు ఉన్నాయి. ఇవి చాలా లగ్జరీగా ఉన్నాయి. ప్రకృతిపై ప్రేమ ఉన్నవారు ఎవ్వరైనా ఇక్కడికి వెళ్లి ఉండొచ్చు.
- కేరళలోని వయనాడ్‌లో ట్రాన్‌క్విల్ రిసార్ట్ కూడా ఇదేవిధంగా నిర్మించిందే.. దట్టమైన అడవి మధ్యలో బలమైన చెట్లపై గదుల నిర్మాణాన్ని చేపట్టారు. ఇక్కడ దాదాపు వందకు పైగా పక్షులు నివసిస్తాయి. ఇక్కడ స్విమ్మింగ్ పూల్ కూడా ఉంటుంది. క్రూర జంతువుల నుంచి రక్షణగా ఇక్కడ ప్రత్యేకమైన సిబ్బంది కూడా ఉంటారు.
- మధ్యప్రదేశ్‌లోని విజర్‌హియాలో కూడా ట్రీ హౌసెస్ చాలా ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. ఇవి చాలా అధునాతనమైన సౌకర్యాలను కలిగి ఉన్నాయి.
- కర్ణాటకలోని దన్‌దేలిలోని హార్న్‌బిల్ రిసార్ట్ నది ఒడ్డున చెట్లపై ఉంటుంది. ఒకవైపు చెట్లు, మరొక వైపు పచ్చని ప్రకృతి, కొండలతో చాలా ఆహ్లాదకరంగా, అందంగా ఉంటాయి ఈ రిసార్ట్స్.
- తమిళనాడులో సఫారీ లాండ్ రిసార్ట్ కూడా చాలా అందంగా ఉంటుంది. ఇక్కడ ప్రకృతి నడుమ ట్రెక్కింగ్, గుర్రపు స్వారీ, ఏనుగు స్వారీ.. వంటి సౌకర్యాలు ఉంటాయి.
- కేరళలోని కల్‌పెట్టాలోని చెట్టుపై ఉన్న ఇళ్లు చాలా అందంగా, భిన్నంగా ఉంటాయి.
- గోవాలోని ఖామా కేత్న ఎకోలాజికల్ రిసార్ట్ బీచ్‌లకు దగ్గరగా ఉన్న చెట్లపై అందంగా కట్టారు. ఇక్కడ ఉంటే ఎంచక్కా సముద్రాన్ని వీక్షిస్తూ సూర్యోదయం, సూర్యాస్తమాలను చూడవచ్చు. ఇవి చాలా ప్రశాంతమైన వాతావరణంలో ఉండి.. కేవలం సముద్ర ఘోష తప్ప.. మరింకేం శబ్దాలు వినిపించకుండా ఉంటుంది.
- పాండిచ్చేరిలోని చున్నంబార్ బీచ్ రిసార్ట్ కూడా ఇలాంటి కోవకు చెందించే. పాండిచ్చేరికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలోని ఈ ట్రీ హౌసెస్ చాలా అందంగా ఉంటాయ. క్రిస్టల్ క్లియర్ పూల్‌లో బోటింగ్ ఓ మధురానుభూతి.

వీలున్నపుడల్లా ఇలా ప్రకృతికి దగ్గరగా, ప్రకృతి ఒడిలో గడిపితే ఒత్తిడి పారిపోయి.. మనసు ఆహ్లాదంతో నిండిపోయి.. శరీరం, మెదడు, మనసు మరో ఐదు సంవత్సరాలు ఎటువంటి కష్టమైన పనులు, ఒత్తిడికి తట్టుకునే విధంగా తయారవుతాయి.

బొప్పాయితో బోలెడు లాభాలు

ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన ఫలాలలో బొప్పాయిది ప్రత్యేక స్థానం. పచ్చి బొప్పాయి కాయలను కూరగా, దోరగా పండిన వాటిని నేరుగా తినొచ్చు. బోలెడన్ని పోషకాలను అందించడంతో పాటు సులభంగా జీర్ణమయ్యే బొప్పాయిని పిల్లల నుంచి పెద్దల వరకూ అందరూ తినొచ్చు. ఇది సంవత్సరం పొడవునా లభించడమే కాకుండా చాలా చౌక కూడా.

- ప్రతి వంద గ్రాముల బొప్పాయిలో సుమారు అరవై నుంచి వంద మిల్లీగ్రాముల విటమిన్ సి ఉంటుంది. అందుకే బొప్పాయి చక్కని రోగనిరోధక శక్తికి, చర్మం నిగారింపునకు దోహదపడుతుంది.
- బొప్పాయి గుజ్జును ఫేస్‌ప్యాక్‌గా వేసుకుంటే ముఖంపై మచ్చలు, మొటిమలు, చర్మవ్యాధులూ దూరమవుతాయి. అంతేకాదు ఇలా తరచూ చేయడం వల్ల చర్మంపై మృతకణాలు తొలగిపోయి చర్మం ప్రకాశిస్తుంది.
- బొప్పాయి పండులో విటమిన్ సి, ఇ, బీటా కెరోటిన్ ఉంటాయి గనుక ఇది చక్కటి యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేసి, శరీరంలోని హానికారక ఫ్రీ రాడికల్స్ ప్రభావాన్ని నిరోధిస్తుంది.
- రుతుక్రమ సమస్యలకు బొప్పాయి పండు చక్కని మందు. అంతేకాదు ఆడవారిలో రుతుక్రమ సమయంలో వచ్చే పొత్తికడుపు నొప్పిని బొప్పాయి తొలగిస్తుంది.
- అధిక బరువు తగ్గాలంటే బొప్పాయిని రోజూ తింటే సరి. బొప్పాయిలో ఉన్న సహజమైన పోషకాలు తక్కువ కేలరీలను ఉత్పత్తి చేసి లావుగా ఉన్నవారిని సన్నగా చేస్తుంది.
- పరగడుపునే బొప్పాయి తింటే రక్తపోటు అదుపులోకి రావడమే గాక కడుపులో చేరిన నులి పురుగులు తొలగిపోతాయి.
- బొప్పాయి వేరు మూత్రపిండాల్లో రాళ్లు కరిగేందుకు చక్కగా ఉపయోగపడుతుంది.
- మధుమేహ రోగుల్లో రక్తనాళాలు కుంచించుకుపోవడం వల్ల గుండె పనితీరు దెబ్బతింటుంది. అందుకే మధుమేహం ఉన్నవారు రోజూ ఒకటి, రెండు బొప్పాయి ముక్కలను తీసుకుంటే రక్తనాళాల పనితీరు మెరుగుపడుతుంది.
- రక్తంలో మోతాదుకు మించి కొలెస్ట్రాల్ ఉన్నవారు రోజూ బొప్పాయిని తింటే ఎలాంటి మందులూ వాడకుండానే నెలరోజుల్లో కొలెస్ట్రాల్ తగ్గుతుంది.
- పలు ఉదర సంబంధిత అనారోగ్యాలకు బొప్పాయి దివ్యమైన ఔషధం. బొప్పాయి గింజలను నూరి ఆ పొడిని తీసుకోవాలి. దీన్ని చెంచాడు నిమ్మరసంతో కలిపి మూడు పూటలా తీసుకుంటే దెబ్బతిన్న కాలేయం పనితీరు మెరుగు పడుతుంది.
- కీళ్ళ వాతం, ఎముకలు బోలుగా మారటం, ఆస్తమా బాధితులు బొప్పాయి తింటే ఆయా సమస్యల కారణంగా వచ్చిన నొప్పులు, వాపులు ఉపశమిస్తాయి.
- బొప్పాయి ఆకులో ఉండే కార్పిన్ అనే రసాయనం నొప్పుల నివారిణిగా పనిచేస్తుంది. అందుకే కీళ్ళ నొప్పులతో బాధపడేవారు బొప్పాయి ఆకులను వేడిచేసి కట్టుకడితే కీళ్ళ నొప్పులు ఉపశమిస్తాయి.
- టాన్సిల్స్, నోటిపూతతో సతమతమయ్యేవారు పచ్చి బొప్పాయి ఆకును నమిలి ఆ రసాన్ని పుక్కిలిస్తే సమస్య తగ్గినట్టే..
- బొప్పాయి పండు క్షయ నివారణకు చక్కగా ఉపయోగపడుతుంది.

డీఎంకే వరాల జల్లు

ప్రతిపక్షం, నేషనల్ డెస్క్: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ తమిళనాడు ప్రజలకు అధికార డీఎంకే పార్టీ వరాల జల్లు కురిపించింది. తమిళనాడులో మళ్లీ అధికారంలోకి వస్తే మహిళలకు అందుతున్న నెలవారీ గౌరవ వేతనాన్ని వెయ్యి రూపాయల నుంచి 2 వేల రూపాయలకు పెంచుతామని హామీ ఇచ్చింది. ఈ మేరకు పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను సీఎం స్టాలిన్ విడుదల చేశారు. మహిళలు, రైతులు, విద్యార్థులే లక్ష్యంగా పలు పథకాలను ప్రకటించిన స్టాలిన్, ఇల్లత్తరసి పథకం కింద ప్రతి గృహిణికి 8 వేల రూపాయల విలువైన కూపన్లను అందజేస్తామని స్టాలిన్ తెలిపారు. ఈ కూపన్లను ఉపయోగించి మహిళలు తమకు టీవీ, మిక్సీ, గ్రైండర్ వంటి వస్తువులను కొనుగోలు చేయవచ్చని వెల్లడించారు. అదే కూపన్లతో పాత వస్తువులను మార్చుకోవచ్చని స్టాలిన్ స్పష్టం చేశారు

ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి వరకు పిల్లలకు అల్పాహార పథకం

పాఠశాలల్లో అమలవుతున్న ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని 8వ తరగతి వరకు విస్తరిస్తామని ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. ఉచిత విద్యుత్ పథకం కింద రైతులకు ఎలాంటి మీటర్లు లేని ఆధునిక పంపుసెట్లను పంపిణీ చేస్తామని తెలిపారు. రాబోయే ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల కొత్త ఇళ్లను నిర్మించి పేదవాళ్లకు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థినులకు ఇచ్చే నెలవారీ ప్రోత్సాహకాన్ని వెయ్యి రూపాయల నుంచి 15 వందల రూపాయలకు పెంచుతామని తెలిపారు.

బీజేపీ గెలిస్తే చేపలు, గుడ్లు తినలేం

- ఎన్నికల్లో మమతా బెనర్జీ సంచలన వ్యాఖ్యలు

ప్రతిపక్షం నేషనల్ డెస్క్: పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల వేడి మొదలైంది. ఇప్పటికే అధికార టీఎంసీ, ప్రతిపక్ష బీజేపీ మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. తాజాగా టీఎంసీ అధినేత, సీఎం మమతా బెనర్జీ బీజేపీపై సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ప్రజలు చేపలు, గుడ్లు తినలేరని వ్యాఖ్యానించారు. పురులియాలో ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచారంలో మమత ఈ వ్యాఖ్యలు చేశారు. ''బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రజలు చేపలు తినడం లేదు. బీజేపీ అధికారంలోకి వస్తే ప్రజలు చేపలు, మాంసం, గుడ్లు తినలేరు. మీరందరూ మీ మతాల్ని అనుసరిస్తారు. కానీ, బీజేపీ వాళ్లంతా ఒకేవైపు ఉంటారు. ఇతర మతాల మీద వారికి నమ్మకం లేదు. ధర్మం అంటే మానవత్వం అని శ్రీకృష్ణుడు చెప్పాడు. పని చేయడం ధర్మం. మంచి కోసం పని చేయడమే ధర్మం. కానీ, అల్లర్లు చేయడం, అమాయకుల్ని చంపడం ద్వారా బీజేపీ అధికారంలోకి రావాలని చూస్తోంది. అందులోనూ బీజేపీ పాలిత రాష్ట్రాల్లో గిరిజనులు, మహిళలపైనే అధిక దాడులు జరుగుతున్నాయి. బీజేపీ అధికారంలో ఉన్న ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్‌లలోనే దాడులు ఎక్కువగా జరుగుతున్నాయి. పని కోసం వేరే ప్రాంతాలకు వెళ్లి బెంగాలీ మాట్లాడేవారిపై ఇతర రాష్ట్రాల్లో దాడులు జరుగుతున్నాయి. కానీ, మేం ఎవరినీ అణచివేయం. టీఎంసీ అంటే శాంతి, మానవత్వం, అందరినీ గౌరవించడం.ప్రజలతో కలిసి పని చేయడం'' అని మమత వ్యాఖ్యానించారు.





సర్‌ప్రైజ్ చేయడానికి శర్వా సిద్ధం

చార్మింగ్ స్టార్ శర్వా మోస్ట్ ఎవైటెడ్ మూవీ బైకర్ కోసం అద్భుతంగా ట్రాన్స్‌ఫర్మేషన్ అయ్యారు. వ్యక్తిగతంగా, క్రియేటివ్‌గా తనను మళ్లీ ఛాలెంజ్ చేసే పాత్ర బైకర్ రూపంలో వచ్చింది. ఇందులో అతను 18 ఏళ్ల రేసర్‌గా కనిపించనున్నారు. ఈ పాత్ర కోసం అతను తన శరీరాన్ని, మనసును పూర్తిగా మార్చుకున్నారు. ఈ చిత్రానికి అభిలాష్ రెడ్డి దర్శకత్వం వహించగా, యువి క్రియేషన్స్ నిర్మిస్తోంది. సినిమా ఏప్రిల్ 3న విడుదల కానుంది. ఇప్పటికే మేకర్స్ శర్వా ట్రాన్స్‌ఫర్మేషన్ వీడియోను విడుదల చేయగా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఒకసారి కమిట్ అయిన తర్వాత శర్వా పూర్తిగా తనను డెడికేట్ చేశారు. ఉదయం సూర్యోదయం కంటే ముందే మొదలయ్యే రోజు, అలసటతో ముగిసేది. లాంగ్ డిస్టెన్స్ పరుగులు, కఠినమైన స్ట్రెంగ్త్ ట్రైనింగ్, మొబిలిటీ సెషన్స్‌తో అతను తన పరిమితులను దాటాడు. ఇది కేవలం శారీరకంగా మాత్రమే కాదు, మానసికంగా కూడా ఛాలెంజ్ గా మారింది. ఈ ప్రయాణంలో యోగా అతనికి కీలకంగా నిలిచింది. జిమ్ అతనికి బలం, సహనం ఇచ్చినప్పుడు, యోగా అతని ఆలోచనలను ప్రశాంతం చేసి, ఫోకస్‌ను పెంచింది. ఈ ఫెరోసిటీ, ప్రశాంతత కలయికే అతని మార్పుకు బలం అయింది. దీంతో అతను బరువు తగ్గి, మరింత షార్ప్ లుక్‌తో పాటు కొత్త కాన్ఫిడెన్స్‌ను పొందారు.

‘చిచ్చుబుడ్డి..’

‘డెకాయిట్’ నుంచి అల్టిమేట్ డాన్స్ నంబర్ సాంగ్ రిలీజ్

బ్యాక్ టు బ్యాక్ పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్లతో అలరిస్తున్న అడివి శేష్ ఏప్రిల్ 10న థియేటర్లలోకి రాబోతున్న పాన్‌ఇండియా యాక్షన్‌రొమాంటిక్ థ్రిల్లర్ 'డెకాయిట్'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రంలో శేష్ తొలిసారిగా మాస్, రగ్గడ్ పాత్రలో కనిపించనున్నారు. ప్రోమోలు, ఫస్ట్ సింగిల్ 'రుబారూ' ఒక రగ్గడ్ హీరోని ప్రజెంట్ చేశాయి. ఈ రోజు మేకర్స్ ఈ సినిమా సెకండ్ సింగిల్ 'చిచ్చుబుడ్డి'ని విడుదల చేశారు. ఇది శేష్ క్యారెక్టర్ సరికొత్త కోణాన్ని చూపిస్తోంది. 'చిచ్చుబుడ్డి' పాట సినిమా మూడ్‌ను పూర్తిగా మార్చేస్తుంది. ఇందులో అడివి శేష్ తొలిసారిగా తెరపై డ్యాన్స్ చేస్తూ హైఎనర్జీ అవతార్‌లో అదరగొట్టారు.

‘అనకాపల్లి’ టీజర్ రిలీజ్

సమ్మర్‌లో చిత్రం విడుదల

భవ్య శ్రీ మూవీ మేకర్స్, నక్కిన నెరేటివ్స్ బ్యానర్ల మీద కంద్రేగుల నాయుడు, త్రినాథరావు నక్కిన నిర్మిస్తున్న చిత్రం ‘అనకాపల్లి’. ఈ సినిమాకి ఖగేష్ తమ్మినేని దర్శకత్వం వహిస్తున్నారు. కంద్రేగుల కుమార్ రాజా కో ప్రొడ్యూసర్‌గా చేసిన ఈ మూవీలో విక్రమ్ సహిదేవ్, సంధ్య వశిష్ట జంటగా నటించారు. ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లేని అందించడమే కాకుండా త్రినాథరావు నక్కిన ఓ ముఖ్య పాత్రను కూడా పోషించారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన టీజర్‌ను రిలీజ్ చేశారు. ‘అనకాపల్లి.. ఇక్కడ మనకు కావాల్సింది దక్కాలంటే.. ఎదుటోడికి మనమంటే భయం ఉండాలి.. భయం లేనోడికి పిడికిలి రుచి చూపించాలి.. అదీ తెలిసినోడికి ఓబీ రుచి చూపించాలి.. అప్పటికీ లొంగకపోతే ఆడి పుర్రె పచ్చడయ్యేలా తూటాల వర్షం కురిపించాలి.. మనకి కావాల్సింది దక్కించుకోవాలి’.. అంటూ మొదలైన ఈ టీజర్‌లో అన్ని రకాల ఎమోషన్స్ చూపించారు. మాస్ ఆడియెన్స్‌కి నచ్చే యాక్షన్ సీక్వెన్స్, యూత్ మెచ్చే లవ్ ట్రాక్, ఫ్యామిలీ ఆడియెన్స్‌కి కనెక్ట్ అయ్యే ఎమోషనల్ సీన్స్ ఇలా అన్నీ టీజర్‌లో ఉన్నాయి. ఇక అన్ని వర్గాల ఆడియెన్స్‌ని ఆకట్టుకోబోతోన్నామని ఈ టీజర్‌తో టీం చెప్పకనే చెప్పేసింది. ఈ టీజర్‌లోని యాక్షన్ సీక్వెన్స్, విజువల్స్, మ్యూజిక్ ఇలా అన్నీ కూడా రా అండ్ రస్టిక్‌గా ఉన్నాయి. ప్రేమ కథ కూడా చాలా కొత్తగా ఉండబోతోన్నట్టు అనిపిస్తోంది. మరి ఈ అనకాపల్లి కథ ఏంటో తెలియాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

విజృంభించిన రోహిత్ శర్మ

భారీ లక్ష్య ఛేదనలో ముంబై ఓపెనర్లు రోహిత్ శర్మ, ర్యాన్ రికెల్టన్ విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగారు. తొలి ఓవర్ నుంచే కేకేఆర్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. దాంతో పవర్ ప్లేలో ముంబై వికెట్ నష్టపోకుండా 80 పరుగులు చేసింది. అనంతరం మరింత దూకుడుగా ఆడిన ఈ జోడీ 8.1 ఓవర్లలోనే 100 పరుగుల మార్క్ అందుకుంది. రోహిత్ 23 బంతుల్లో ర్యాన్ రికెల్టన్ 24 బంతుల్లో హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకున్నారు. ర్యాన్ రికెల్టన్ ఇచ్చిన రెండు క్యాచ్‌లను కేకేఆర్ ఫీల్డర్లు వదిలేసారు. సెంచరీ దిశగా సాగిన రోహిత్ శర్మను వైభవ్ అరోరా క్యాచ్ ఔట్ చేయడంతో తొలి వికెట్‌కు నమోదైన 148 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. సూర్యకుమార్ యాదవ్(16) విఫలమవగా.. అనుకుల్ రాయ్ స్టన్నింగ్ త్రోకు రికెల్టన్ రనౌటయ్యాడు. విజయం ముంగిట తిలక్(20) వెనుదిరిగినా.. నమన్ ధిర్‌తో కలిసి హార్దిక్ పాండ్యా(18 నాటౌట్) విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు.

TATA IPL 2026

ధనాధన్

14 ఏళ్ల తర్వాత ముంబై శుభారంభం!

హిట్‌మ్యాన్ విధ్వంసం

ఐపీఎల్ 2026 సీజన్‌ను ముంబై ఇండియన్స్ విజయంతో ప్రారంభించింది. 14 ఏళ్ల తర్వాత ఈ క్యాష్ రిచ్ లీగ్‌లో శుభారంభం చేసింది. ఆదివారం వాంఖడే వేదికగా జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన ముంబై ఇండియన్స్ 6 వికెట్ల తేడాతో కేకేఆర్‌ను చిత్తు చేసింది. చివరిసారిగా ముంబై ఇండియన్స్ ఐపీఎల్ 2012 సీజన్‌లో శుభారంభం చేసింది. ఆ తర్వాత జరిగిన 13 సీజన్లలోనూ ముంబై తొలి మ్యాచ్‌ను గెలవలేకపోయింది. ఈ చెత్త రికార్డ్‌కు హార్దిక్ సేన ఎట్టకేలకు బ్రేక్ వేసింది. జస్‌ప్రీత్ బుమ్రా, శార్దూల్ ఠాకూర్ అసాధారణ బౌలింగ్.. రోహిత్ శర్మ, రికెల్టన్ విధ్వంసకర బ్యాటింగ్‌తో ముంబై ఇండియన్స్ విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు చేసిన కోల్‌కతా నైట్‌రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 220 పరుగులు చేసింది. కెప్టెన్ అజింక్యా రహానే(40 బంతుల్లో 3 ఫోర్లు, 5 సిక్స్‌లతో 67), అంగ్‌క్రిష్ రఘువంశీ(29 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 51) హాఫ్ సెంచరీలతో రాణించగా.. ఫిన్ అలెన్(17 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్స్‌లతో 37), రింకూ సింగ్ (21 బంతుల్లో 4 ఫోర్లతో 33 నాటౌట్) దూకుడుగా ఆడారు. ముంబై బౌలర్లలో శార్దూల్ ఠాకూర్(3/35) మూడు వికెట్లు తీయగా.. హార్దిక్ పాండ్యా ఒక వికెట్ పడగొట్టాడు. అనంతరం ముంబై ఇండియన్స్ 19.1 ఓవర్లలో 4 వికెట్లకు 224 పరుగులు చేసి గెలుపొందింది. రోహిత్ శర్మ(38 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్స్‌లతో 78), ర్యాన్ రికెల్టన్(43 బంతుల్లో 4 ఫోర్లు, 8 సిక్స్‌లతో 81) విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగారు. కేకేఆర్ బౌలర్లలో వైభవ్ అరోరా, కార్తీక్ త్యాగి, సునీల్ నరైన్ తలో వికెట్ తీసారు.

రోహిత్ శర్మ రికార్డు

ప్రపంచంలోనే ఏకైక ఆటగాడు!

ముంబై ఇండియన్స్ మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ చరిత్ర సృష్టించాడు. ఐపీఎల్‌లో 19 సీజన్లు ఆడిన ఏకైక క్యాప్డ్ ప్లేయర్‌గా నిలిచాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో వాంఖడే వేదికగా ఆదివారం జరిగిన మ్యాచ్‌తో రోహిత్ శర్మ ఈ ఫీట్ సాధించాడు. రోహిత్ శర్మతో పాటు విరాట్ కోహ్లీ, మహేంద్ర సింగ్ ధోనీ, మనీష్ పాండేలు మాత్రమే 19 సీజన్లు ఆడిన ఆటగాళ్ల జాబితాలో ఉన్నారు. ఇందులో రోహిత్ శర్మ ఒక్కడే క్యాప్డ్ ప్లేయర్‌గా ఈ 19 సీజన్లు ఆడాడు. విరాట్ కోహ్లీ తొలి రెండు సీజన్లను అనామక ఆటగాడిగా ఆడగా.. ఐపీఎల్ 2023 సీజన్ తర్వాత ధోనీ అనామక ప్లేయర్‌గా బరిలోకి దిగుతున్నాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు దూరమై ఐదేళ్లు గడిచిన ఆటగాళ్లను అనామక ప్లేయర్‌గా పరిగణించాలనే కొత్త రూల్‌ను బీసీసీఐ ఐపీఎల్ 2023 సీజన్‌కు ముందు ప్రవేశ పెట్టిన సంగతి తెలిసిందే. ఐపీఎల్ ప్రారంభానికి ముందే అంతర్జాతీయ క్రికెట్‌లోకి రోహిత్ శర్మ అరంగేట్రం చేసిన సంగతి తెలిసిందే. అరంగేట్ర టీ20 ప్రపంచకప్ 2007తోనే రోహిత్ శర్మ ఇంటర్నేషనల్ క్రికెట్‌లోకి అడుగుపెట్టాడు. ఐపీఎల్ ఆరంభంలో డెక్కన్ ఛార్జర్స్‌కు ఆడిన రోహిత్ శర్మ.. ఆ తర్వాత ముంబై ఇండియన్స్‌కు మారాడు. అతని సారథ్యంలో ముంబై ఐదు టైటిళ్లు గెలిచింది. కేకేఆర్‌తో తాజా మ్యాచ్‌లో రోహిత్ శర్మ విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగాడు. 221 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో మరో ఓపెనర్ ర్యాన్ రికెల్టన్‌తో కలిసి అదిరిపోయే ఆరంభాన్ని అందించాడు. 23 బంతుల్లోనే హాఫ్ సెంచరీ బాదిన రోహిత్ శర్మ.. తన 19 ఏళ్ల ఐపీఎల్ కెరీర్‌లోనే ఫాస్టెస్ట్ ఫిఫ్టీ నమోదు చేశాడు. ర్యాన్ రికెల్టన్ కూడా 24 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించాడు. సెంచరీ దిశగా సాగిన రోహిత్ శర్మ(38 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్స్‌లతో 78)ను వైభవ్ అరోరా క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో తొలి వికెట్‌కు నమోదైన 148 పరుగుల భారీ భాగస్వామ్యానికి తెరపడింది.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana- 500008. Editor: MOHAMMED AZIZ UR RAHAMAN. 040-4565 1990, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200